- మండుతున్న ఎండలతో నగరానికి ఎక్కిళ్లు
- ఒంగోలులో అస్తవ్యస్తంగా తాగునీటి సరఫరా
- అడుగంటిన గుండ్లకమ్మ.. సాగర్ జలాలూ కష్టమే..
- అంతంతమాత్రంగా ఎస్ఎస్ ట్యాంకుల్లో నీరు
- రోజూ ఇస్తాం.. మళ్లీ 'ఎమ్మెల్యే పాత పాట'
- మండిపడుతున్న నగరవాసులు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఒంగోలులోని దేవుడు చెరువు రోడ్డు ప్రాంతానికి గురువారం రాత్రి 10గంటలకు నీరు విడుదల చేశారు. బిందెడు నీటి కోసం మహిళలు నిద్రమానుకుని కొళాయిల వద్ద ఎదురుచూశారు. అయితే అర్ధగంటకే సరఫరా నిలిచిపోవడంతో తాగడానికి తప్ప, ఇంటి అవసరాలకు నీరు సరిపోలేదని మహిళలు వాపోయారు.

నగరంలోని తూర్పుకమ్మపాలెంకు బాలినేని నామినేషన్ కోసమని ముందురోజైన అదివారం అర్ధరాత్రి అరగంటపాటు హడావుడిగా నీరు విడుదల చేశారు. అప్పటి నుంచి మళ్లీ ఇవ్వలేదు. ఐదురోజుల తర్వాత శుక్రవారం సాయంత్రం సరఫరా చేశారు. అదీ అరగంటే..!

ప్రతిరోజూ.. నీరేది?

జీవోలు, హామీలతో తీరని దాహం..!

ఒంగోలు నగర ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదు. 'ఈ ఎన్నికల్లో గెలిపించండి.. నగరానికి ప్రతిరోజూ తాగునీరు ఇవ్వకుంటే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను.' ఇదీ గత ఇరవై ఏళ్లుగా ఒంగోలు ప్రజలకు వినిపిస్తున్న హామీ. ఎన్నికలు వచ్చినప్పుడల్లా గెలుపు కోసం.. నగరానికి రోజూ నీరిస్తామంటూ స్థానిక ఎమ్మెల్యే పాడే పాత పాటపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికే ఒంగోలు నగరంలో ఎక్కిళ్లు మొదలయ్యాయి. ఎస్ఎస్ ట్యాంకుల్లో నీరు అడుగంటింది. మూడురోజులకొకసారి.. అదీనూ అరకొరగా సరఫరా చేస్తున్న పరిస్థితి. వైసీపీ నాయకుల హామీలతో ఎప్పటికప్పుడు ఆశతో ఎదురుచూస్తున్న జనానికి నిరాశే మిగులుతోంది. అయితే మళ్లీ నన్ను గెలిపిస్తే ప్రతిరోజూ నీరు అంటూ ఎమ్మెల్యే పాతపాటే పాడుతుండటంపై నగరవాసులు మండిపడుతున్నారు.

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 26: నగర ప్రజలు గత కొన్నేళ్లుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదు. ఇప్పటికే 'ఒకరోజు మోటారు పాడైంది.. ఇంకో రోజు పైపులైను పగిలిపోయింది.. మరోసారి కరెంటు పోయింది' అంటూ నీటి సరఫరాను అధికారులు నిలిపివేస్తున్నారు. కానీ అసలు కారణం వేరని సమాచారం. నగరానికి నీరందించే నీటి వనరులు అడుగంటాయి. మండుతున్న ఎండలతో పెరుగుతున్న తాగునీటి అవసరాలను పాలకులు పట్టించుకోవడం లేదు. వేసవి దృష్ట్యా యంత్రాంగం ముందుచూపు లేకపోవడంతో నగరమంతా నీటి సరఫరా అస్తవ్య స్తంగా తయారైంది. దీనిపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక సంస్థ నిర్లక్ష్యం, వైసీపీ పాలకులు పట్టించుకోనితనంతో పదేపదే తాగునీటి సమస్య ఎదురవుతోంది. నగరంలో రోజూ తాగునీటి సరఫరా చేస్తామంటూ ప్రతిసారీ ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే బాలినేని ప్రచార అస్త్రంగా వాడుతున్న విషయం విదితమే. ప్రతి రోజూ నీరు ఇస్తాను.. లేదంటే పోటీ చేయనంటూ ఆయన మరోసారి చెప్పడం.. పాతపాటే అంటూ ప్రజలు పెదవివిరుస్తు న్నారు. ఇదిలా ఉంచితే గతేడాది తాగునీటి కోసం వైసీపీ ప్రభుత్వం రూ.339.92 కోట్లకు జీవో జారీ చేసింది. దీంతో అదేదో నీరొచ్చినట్లే జీవో కాపీలు చేతపట్టి బైక్ ర్యాలీతో నగరంలో నానా హడావుడి చేశారు. అయితే ఆ జీవో విడుదలై ఏడాది పూర్తయినా నేటికీ పనులు ప్రారంభానికి నోచుకోలేదు.

అడుగంటిన వేసవి చెరువులు

గుండ్లకమ్మ గేట్లు కొట్టుకుపోవడంతో ఉన్న నీరు వృథా అయిన విషయం విదితమే. నేటికీ గేట్ల మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రాజెక్టులో నీరు అడుగంటి, క్రీడామైదానంలా మారింది. దీంతో గుండ్లకమ్మ నుంచి సరఫరా నిలిచిపోయింది. ఇదిలా ఉంచితే సాగర్ నీటిపైనే ఆశలు పెట్టుకోగా ప్రస్తుతం అది చెరువులకు రావడం లేదు. అయితే వైసీపీ ప్రజాప్రతినిధులు మాత్రం తాగునీటికి కోట్ల రూపాయల జీవోలు తెచ్చాం, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని చెబుతున్న మాటలు ఆచరణలో సాధ్యపడటం లేదు. ఇప్పటి వరకు మూడు రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా చేస్తుండగా, రకరకాల సాకులతో నాలుగు రోజులకు ఒకసారి ఇచ్చేందుకు యంత్రాంగం సిద్ధమవుతోంది. అదికూడా సరఫరా సమయం తగ్గించనున్నారు. దీంతో నగరంలో దాహం కేకలు వినిపించనున్నాయి. ఇప్పటికే నగరంలో అధికశాతం ప్రాంతాల్లో పురాతన పైపులైన్లు ఉన్నాయి. అతి కొద్ది ప్రాంతాల్లోనే కొత్తవి వేశారు. దీంతో పాత పైపులైన్‌లకు పదేపదే లీకులు ఏర్పడుతుండగా, వాటిని నియంత్రించడంలో విఫలమయ్యారనే విమర్శలున్నాయి. దీంతో చెరువుల్లో ఉన్న కొద్దిపాటి నీరు చివరి ఇళ్ల వరకూ చేరడం లేదు.



ఒంగోలులోని జక్రయ్య ఆసుపత్రి వద్ద అర్ధరాత్రి నీరు పట్టుకుంటున్న మహిళ



ఒంగోలులోని శివారు కాలనీలో ట్యాంకర్ వద్ద నీరు పట్టుకొని వెళ్తున్న మహిళలు

టీడీపీ ప్రభుత్వ హయాంలో చర్యలు

అమృత్ పథకం నిధుల విడుదల కాకముందు గుండ్లకమ్మ నీటిని రాబట్టుకోవడానికి రూ.40కోట్లు అప్పటి టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ సమయంలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నగరానికి వచ్చిన సమయంలో ప్రకాశం భవనం వద్ద ఈ పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఏడుగుండ్లపాడు వద్ద నుంచి ఒంగోలు వేసవి జలాశయం వరకు రూ.40 కోట్లతో 8.9 కిలోమీటర్ల పైపులైను పనులు చేపట్టారు. ఆ పనులు 70శాతం పూర్తికాగా, అప్పటి కేంద్ర మంత్రిగా ఉన్న వెంకయ్యనాయుడు చేతుల మీదుగా దానిని ప్రారంభించారు. ఆ పైపులైను ద్వారా రోజుకు 60 మిలియన్ లీటర్ల నీటిని ఒంగోలు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులకు సరఫరా చేసే విధంగా పనులు చేపట్టారు. అయితే రోజువారీగా నగర ప్రజల నీటి అవసరాలకు 35 మిలియన్ లీటర్ల నీరు సరఫరా చేస్తుండగా, గుండ్లకమ్మ నుంచి వచ్చే దానితో ప్రజలకు మరింతగా అందించడంతోపాటు వేసవిలోనూ సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపడం కోసం అప్పటి ఎమ్మెల్యే దామచర్ల ఎనలేని కృషిచేశారు.

దామచర్ల కృషితో అదనంగా రూ.123 కోట్లు

గుండ్లకమ్మ నుంచి ఏడుగుండ్లపాడు వరకు మరోసారి టీడీపీ హయాంలోనే పైపులైను పనులు పూర్తిస్థాయిలో చేపట్టారు. ఒంగోలు నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం రూ.330 కోట్లు కేటాయించాలని ప్రాజెక్టు నివేదికలో పేర్కొన్నారు. ఒకేసారి అంత కేటాయించడం సాధ్యపడక విడతల వారీగా ఇచ్చేందుకు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ సుముఖత వ్యక్తం చేసింది. అందులో భాగంగా అమృత్ పథకం కింద తొలి విడత రూ.123 కోట్లు అదనంగా కేటాయించారు. వీటితో మరో 16కి.మీ పైపులైను నిర్మించడానికి చర్యలు చేపట్టారు. అంతేకాకుండా 15 ఎంఎల్‌డీ సేప్టెజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం కూడా ఏర్పాటు అవసరం ఉండటంతో అదనంగా మరో రూ.30.79 కోట్లు కేటాయించారు. దీంతో ఒంగోలు నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం మొత్తం రూ.190.79 కోట్లు వెచ్చించి దాహార్తి తీర్చేందుకు, భవిష్యత్‌లో తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండటం కోసం దామచర్ల అటు కేంద్రప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి అవసరమైన నిధులు రాబట్టారు. ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు చేపట్టారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పథకాన్ని పక్కన పడేసింది. పనులు నిలిచిపోయాయి.

అయితే ప్రజల నుంచి విమర్శలు రావడంతో గతేడాది హడావుడిగా ప్రారంభించారు. అన్నీ పాత నిధులే అయినా తామేదో తెచ్చి చేయించినట్లు చెబుతున్నారన్న విమర్శలు వచ్చాయి. పనులు పూర్తయినట్లు ఆర్భాటం చేసి గత ఏడాది ఆగస్టు 23న ప్రారంభించినప్పటికీ మోటార్లు మొరాయించడంతో అంతా తుస్సుమంది.

నగరమైనా ప్రైవేటు ట్యాంకర్లే

నగర జనాభా పెరిగింది. అయితే శివారు కాలనీలు, విలీన గ్రామాల స్థితిగతులు మాత్రం మారలేదని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. జిల్లాకేంద్రమైన ఒంగోలుకు మాత్రమే తొలిసారిగా కార్పొరేషన్ హోదా లభించింది. కానీ అందుకు అనుగుణంగా నీరు సరఫరా చేసేందుకు ప్రభుత్వ ట్యాంకర్లు లేవు. గతంలో మూడు ఉండగా అవి ప్రస్తుతం మరమ్మతులకు గురై నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో ప్రైవేటు ట్యాంకర్ల ద్వారానే ఏళ్లతరబడి తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఇదిలా ఉండగా కార్పొరేషన్‌లో మరో పది పంచాయతీలు విలీనం కావడంతో ఉన్న అరకొర ట్యాంకర్లే వాటికీ దిక్కయ్యాయి. అటు శివారు కాలనీలు, ఇటు గ్రామీణ ప్రజలు కూడా తాగునీటి కోసం తంటాలు పడుతున్నారు.



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ ఒంగోలులో రూపొందించిన సైకత శిల్పం వద్ద కలెక్టర్ దినేష్‌కుమార్, ఇతర అధికారులు, శిల్పి బాలాజీ

ఓటు హక్కుపై విస్తృత ప్రచారం

- జిల్లా ఎన్నికల అధికారి దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 26 : వచ్చే నెలలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో అర్హులంతా ఓటు హక్కును వినియోగించుకొనేలా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ ఏర్పాటు చేసిన సైకత శిల్పాన్ని ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులందరూ ఓటు హక్కును వినిగించుకోవాలని కోరారు. పట్టణ ప్రజలు కూడా చురుగ్గా ఓటింగ్‌లో పాల్గొనేలా వివిధ రూపాల్లో స్వీప్ కార్యక్రమాలు చేపట్టామన్నారు. విజయవాడకు చెందిన అంతర్జాతీయ గుర్తింపు పొందిన సైకత శిల్పి బాలాజీ వరప్రసాద్ ఈ సైకత శిల్పాన్ని తయారు చేసినట్లు చెప్పారు. సుమారు 30 టన్నుల ఇసుకతో రెండు రోజుల్లో దీనిని రూపొందించిన ఆయన్ను కలెక్టర్ అభినందించి సన్మానించారు.

ముగిసిన పరిశీలన

- ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లో 48 నామినేషన్లు తిరస్కరణ, 158 ఆమోదం
- ఒంగోలు పార్లమెంట్‌లో ఏడు తిరస్కరణ, 25 ఓకే!
- జిల్లా ఎన్నికల అధికారి దినేష్‌కుమార్ వెల్లడి

ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 26 : జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో నామినేషన్ల పరిశీలన ముగిసిందని జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఈనెల 18నుంచి 25వతేదీ వరకూ నామినేషన్లను స్వీకరించడం జరిగిందన్నారు. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో 206 మంది అభ్యర్థులు 354 నామినేషన్లను దాఖలు చేశారన్నారు. అన్ని నియోజకవర్గాల్లో రిటర్నింగ్ అధికారుల నేతృత్వంలో శుక్రవారం పరిశీలన జరిగిందన్నారు. 48 మంది అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరించినట్లు తెలిపారు. 158 మంది నామినేషన్లను ఆమోదించడం జరిగిందన్నారు. ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గంలో 32 మంది అభ్యర్థులు 62 సెట్ల నామినేషన్‌లను దాఖలు చేయగా, ఏడింటిని తిరస్కరించినట్లు తెలిపారు. 25 మంది నామినేషన్లను ఆమోదించినట్లు చెప్పారు. ఈనెల 29వతేదీ వరకు ఉపసంహరణకు గడువు ఉందన్నారు. 29వతేదీ సాయంత్రం పోటీలో ఉండే అభ్యర్థులను ప్రకటిస్తామని తెలిపారు.

30న బాలకృష్ణ పర్యటన

- కొండపి, ఎస్ఎన్‌పాడు నియోజకవర్గాల్లో రోడ్‌షో, సభలు



ఒంగోలు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నేత, సినీనటుడు నందమూరి బాలకృష్ణ ఈనెల 30న జిల్లాలో పర్యటించనున్నారు. కొండపి, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. పార్టీ వర్గాల సమాచారం మేరకు... 30వతేదీ సాయంత్రం 4 గంటలకు కొండపి నియోజకవర్గ పరిధిలోని మండల కేంద్రమైన మర్రిపూడికి ఆయన హెలికాప్టర్‌లో చేరుకుంటారు. సాయంత్రం ఆరు గంటల వరకు అక్కడ రోడ్‌షో, సభలో పాల్గొంటారు. అనంతరం రోడ్డుమార్గంలో సంతనూతలపాడు నియోజకవర్గానికి వస్తారు. ఆ నియోజకవర్గంలోని మండల కేంద్రాలైన చీమకుర్తి లేదా సంతనూతలపాడుల్లో ఒక చోట రోడ్‌షోలో పాల్గొంటారు. ఎక్కడ అనేదానిపై శనివారం స్పష్టత రానుంది.

ప్రచారంలో టీడీపీ స్పీడు



పామూరులో రోడ్‌షో నిర్వహిస్తున్న ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట, కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి ఉగ్ర

- రోడ్‌షోలతో అభ్యర్థులు బిజీ
- ఇంటింటికీ తిరుగుతున్న కుటుంబ సభ్యులు
- వైసీపీ నుంచి కొనసాగుతున్న వలసల జోరు

ఒంగోలు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని టీడీపీ అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో స్పీడ్ పెంచారు. వివిధ కార్యక్రమాలతో దూసుకుపోతున్నారు. నామినేషన్ల దాఖలు ప్రక్రియ ముగియడంతో అటు అభ్యర్థులు రోడ్‌షోలు, సభలు నిర్వహిస్తున్నారు. ఇటు వారి కుటుంబ సభ్యులు ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. అదేసమయంలో వైసీపీ నుంచి వలసల జోరు కొనసాగుతోంది. పార్టీ అధిష్ఠానం అభ్యర్థులను ప్రకటించకముందే టీడీపీ నేతలు వివిధ రూపాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ వచ్చారు. తమ పేర్లను ఖరారు చేసిన తర్వాత క్రమపద్ధతిలో కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈనెల 18నుంచి 25వరకూ నామినేషన్ల దాఖలు సందర్భంగా ర్యాలీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ జనజాతర మధ్య నామినేషన్ల ఘట్టాన్ని ముగించారు. ఆ సందర్భంగా పార్టీ శ్రేణులు, అలాగే మద్దతు ఇస్తున్న జనసేన, బీజేపీ కార్యకర్తల్లో కనిపించిన ఉత్సాహాన్ని గుర్తించిన అభ్యర్థులు అదే ఊపును పోలింగ్ వరకూ తీసుకెళ్లే దిశగా ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నారు.

ప్రచారాలు.. చేరికలు..

ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ల దాఖలు, పరిశీలన ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. పోలింగ్‌కు రెండు వారాలు మాత్రమే గడువు ఉంది. దీంతో టీడీపీ నుంచి రంగంలో ఉన్న పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులు.. వారికి మద్దతుగా కుటుంబ సభ్యులు ప్రచారం ముమ్మరం చేశారు. మరోవైపు అన్ని నియోజకవర్గాల్లోనూ వైసీపీ నుంచి పెద్దసంఖ్యలో వివిధ స్థాయి నేతలు, క్రియాశీల కార్యకర్తలు టీడీపీలోకి వచ్చి చేరుతున్నారు. అలా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో శుక్రవారం కూడా పెద్దసంఖ్యలోనే చేరికలు జరిగాయి.



ప్రచారంలో భాగంగా ఒంగోలులో స్విచ్‌బోర్డులు తయారు చేసే దుకాణంలో యంత్రంతో ప్లేవుడ్‌ను కట్ చేస్తున్న జనార్దన్

జనం మధ్యలోనే టీడీపీ అభ్యర్థులు

జిల్లాలోనే టీడీపీ అభ్యర్థులంతా జనం మధ్యనే గడుపుతున్నారు. శుక్రవారం కూడా వారు ముమ్మర ప్రచారంలో నిమగ్నమై కనిపించారు. ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, కనిగిరి అసెంబ్లీ అభ్యర్థి ముక్కు ఉగ్రనరసింహారెడ్డిలు శుక్రవారం పీసీపల్లి, పామూరు పట్టణంలో రోడ్‌షోలు నిర్వహించారు. కొండపి ఎమ్మెల్యే, అక్కడి టీడీపీ అభ్యర్థి అయిన డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి జరుగుమల్లి మండలంలో దాదాపు పది గ్రామాల్లో రోడ్‌షోలు, వీధి మీటింగ్‌లు నిర్వహించారు. రాత్రికి సింగరాయకొండలో యువనేత దామచర్ల సత్య సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వస్తున్న నేతల చేరికల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్ నగరంలోని 23వ డివిజన్‌లో రోడ్‌షోతోపాటు ఇంటింటి ప్రచారం చేపట్టారు. సంతనూతలపాడు అభ్యర్థి బీఎన్ విజయ్‌కుమార్ మద్దిపాడు మండలం నందిపాడులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గిద్దలూరు అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి గిద్దలూరు పట్టణంలోని పలు వార్డులలో పర్యటించి ఓట్లు అభ్యర్థించారు. దర్శి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి దర్శి మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఎర్రగొండపాలెం అభ్యర్థి ఎరిక్షన్‌బాబు.. కొలుకుల, గంజివారిపల్లి గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన వారిని వై.పాలెంలోని తన కార్యాలయంలో సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎన్నికల ప్రచారం కూడా నిర్వహించారు. మార్కాపురం అభ్యర్థి కందుల నారాయణరెడ్డి తర్లుబాడు మండలం మీర్జాపేట, గొల్లపల్లి, నాగెళ్లముడుపు తదితర గ్రామాల్లో ప్రచారం చేపట్టారు.

18,22,470

జిల్లాలో తాజా ఓటర్ల సంఖ్య ఇదీ..

- మహిళలే అధికం
- ఒంగోలు నియోజకవర్గం ఫస్ట్.. ఎర్రగొండపాలెం లాస్ట్

ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 26 : జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 18,22,470 మందికి చేరింది. సాధారణ ఎన్నికల నేపథ్యంలో కొత్త ఓట్ల నమోదు కోసం ఈనెల 16వ తేదీ వరకు ఎన్నికల కమిషన్ అవకాశం ఇచ్చింది. శుక్రవారం తుది జాబితా ప్రకటించింది. జనవరిలో ప్రకటించిన జాబితాలో మొత్తం 18,14,371 మంది ఓటర్లు ఉన్నారు. తాజాగా 8,099 ఓట్లు పెరిగి ఆ సంఖ్య 18,22,470కి చేరింది. వీరిలో పురుష ఓటర్లు 9.07,980, మహిళా ఓటర్లు 9,14,379, ఇతరులు 111 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు 6,369 మంది అధికం. అసెంబ్లీ నియోజకవార్గల వారీగా చూస్తే 2,40,242 మంది ఓట్లతో ఒంగోలు ప్రథమస్థానంలో ఉండగా, 2,07,214 మంది ఓటర్లతో ఎర్రగొండపాలెం చివరి స్థానంలో ఉంది.



అసెంబ్లీ నియోజకవర్గాల వారీ ఓటర్ల వివరాలు ఇవీ..

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
ఎర్రగొండపాలెం	1,05,230	1,01,982	02	2,07,214
దర్శి	1,14,233	1,12,129	08	2,26,370
సంతనూతలపాడు	1,05,497	1,09,137	04	2,14,638
ఒంగోలు	1,15,495	1,24,694	53	2,40,242
కొండపి	1,18,624	1,20,982	03	2,39,609
మార్కాపురం	1,08,043	1,06,557	08	2,14,608
గిద్దలూరు	1,19,502	1,20,188	20	2,39,710
కనిగిరి	1,21,356	1,18,710	13	2,40,079
మొత్తం	9,07,980	9,14,379	111	18,22,470

ఎన్నికల నిబంధనలపై
అవగాహన కలిగి ఉండాలి : ఎస్పీ


పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ సుమిత్‌సునీల్

ఒంగోలు(క్రైం), ఏప్రిల్26 : ఎన్నికల నిబంధనల పట్ల పోలీసులు అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ గరుడ్‌సుమిత్‌సునీల్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి ఒంగోలు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గత ఎన్నికలలో నమోదైన కేసులను పరిశీలించారు. త్వరలో జరగనున్న ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని సిబ్బందిని కోరారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తులు, పోలీస్ స్టేషన్‌లో ఉన్న రౌడీషీట్లు ఉన్న వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని తెలిపారు. సిబ్బందికి కేటాయించిన ప్రాంతాలపై నిరంతరం నిఘా ఉంచి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఎస్పీ కిషోర్‌బాబు, టూటౌన్ సీఐ జగదీష్ పాల్గొన్నారు.

జేఈఈలో శ్రీప్రతిభ విద్యార్థుల సత్తా


జయచంద్రారెడ్డి, పూజిత

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 26: జేఈఈ మెయిన్స్-2024 ఫలితాల్లో ఒంగోలులోని శ్రీప్రతిభ విద్యా సంస్థల విద్యార్థులు సత్తా చాటారు. వెన్న జయచంద్రారెడ్డి 535 ర్యాంకు, కె.పూజిత 1,423ర్యాంకు సాధించారు. అలాగే 6,640, 8,735, 10,669, 11,253, 15,454, 17,044 ర్యాంకులను విద్యార్థులు కైవసం చేసుకున్నారు. ఎన్.వెంకటతరుణ్‌కృష్ణ 97.98, వి.గోవర్ధన్ 97.3, ఆర్.మహేష్‌చౌదరి 95.7, జి.మోహితసాయి 95.56, టి.అవినాష్‌నాయుడు 92.84, జి.ప్రియాంక 93.23, వి.నందినిచౌదరి 91.47, పి.శ్రీనివాసరెడ్డి 90.83, ఎ.శ్వేత 90.53 పర్సంటైల్ సాధించినట్లు శ్రీప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ సీతారామాంజనేయులు, సీఈవో జయప్రకాష్‌నారాయణ విద్యార్థులను అభినందించారు.

జేఈఈలో నారాయణ ప్రభంజనం

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 26: జేఈఈ మెయిన్స్-2024 ఫలితాల్లో ఒంగోలులోని నారాయణ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించి ప్రభంజనం సృష్టించినట్లు విద్యాసంస్థల డీన్ పిచ్చిరెడ్డి తెలిపారు. వెంకటనిఖిల్ 388 ర్యాంకు, సీహెచ్‌బీ.ఓంకార్‌వరుణ్, కాశీవిశ్వనాథ్ 1,759, కె.సాయి మౌనిక 4,009, డి.నిఖిలేశ్వర్ 4,109, ఎం.జోషితలక్ష్మి 4,641, పి.తేజశ్వి 6,320, ఎన్.సంజయ్ 7,011, పి.సాత్విక్ 8,333, ఎస్.హాసిని 9,250, పి.శైలేష్‌సాయి 23,153 ర్యాంకులు సాధించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను శుక్రవారం స్థానిక కాలేజీలో డీన్ పిచ్చిరెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సుజాత, యాసిన్‌లు అభినందించారు. నారాయణ విద్యాసంస్థల్లో అందించిన నాణ్యమైన విద్యతోనే విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు పిచ్చిరెడ్డి పేర్కొన్నారు.

'అరాచక పాలన అంతం' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 26: వైసీపీ పాలన అంతం-టీడీపీ కూటమి పంతం పుస్తకాన్ని శుక్రవారం తెలుగుదేశం పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఒంగోలు నగరం భాగ్యనగర్‌లోని టీడీపీ ఒంగోలు పార్లమెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రం విధ్వంసం అయిందన్నారు. విశ్వసనీయత, నైతికత లేని జగన్ రెడ్డికి ఓట్లు అడిగే అర్హత లేదని, మద్యం రేట్లు పెంచి లక్షల కోట్లు దోపిడీ చేసిన తాడేపల్లి ఘనుడు అని వారు విమర్శించారు. పదిసార్లు కరెంటు బిల్లులు పెంచి ప్రజలపై ఆర్థిక భారాలు మోపారని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందాల్సిన సబ్‌ప్లాన్ నిధులు దోచేసి సబ్‌ప్లాన్ రద్దు చేసిన దుర్మార్గుడన్నారు. కార్యక్రమంలో నాయకులు కామేపల్లి శ్రీనివాసరావు, పాలూరి వెంకటేశ్వరరెడ్డి, దాయనేని ధర్మ, గంగవరపు పద్మ తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రత ఏర్పాట్ల పరిశీలన


స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద రికార్డులను పరిశీలిస్తున్న అబ్జర్వర్ హసీబ్‌ఉర్ రెహమాన్

ఒంగోలు(క్రైం), ఏప్రిల్ 26: జిల్లాలో ఎన్నికల అనంతరం ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను పోలీసు అబ్జర్వర్ ఐపీఎస్ అధికారి హసీబ్‌ఉర్ రెహమాన్ శుక్రవారం పరిశీలించారు. ఒంగోలులోని రైజ్ ఇంజనీరింగ్ కాలేజీలో స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా సిబ్బందితో మాట్లాడారు. విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల నిర్వహణ పూర్తి అయ్యే వరకు భద్రత సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఏఎస్పీ అశోక్‌బాబు, సింగరాయకొండ సీఐ రంగనాథ్, జరుగుమల్లి ఎస్సై వెంకటేశ్వర్లు, మద్దిపాడు ఎస్సై మహేష్ పాల్గొన్నారు.

ఆమంచి నామినేషన్‌పై ఫిర్యాదు

చీరాల, ఏప్రిల్ 26 : కాంగ్రెస్ పార్టీ తరపున చీరాల నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన ఆమంచి కృష్ణమోహన్ తన అఫడవిట్‌లో వాస్తవాలను పూర్తి స్థాయిలో తెలియరపరచలేదని నాయుడు నాగార్జునరెడ్డి అనే వ్యక్తి శుక్రవారం ఈఆర్వో సూర్యనారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఇటీవల నాగార్జునరెడ్డి ఆమంచిపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి కూడా ఫిర్యాదు చేసిన నేపథ్యంలో అందుకు సంబంధించిన ఆధారాలను కూడా నాగార్జునరెడ్డి ఈఆర్వోకు అందజేశారు. పరిశీలించి చర్యలు చేపడతామని ఈఆర్వో తెలిపారు.

వలస ఓటర్లకు వైసీపీ నాయకుల ఎర

మద్దిపాడు, ఏప్రిల్ 26: నామినేషన్ల పర్వం పూర్తియింది. ఎన్నికల సమయం దగ్గరపడింది. దీంతో వైసీపీ నాయకులు వలస ఓటర్లపై కన్నేశారు. బతుకు తెరువు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన మద్దిపాడు మండలానికి చెందిన వారిని సంప్రదించి వారిని ప్రసన్నం చేసుకునేందుకు వారి బంధువులను ఆశ్రయిస్తున్నారు. ఇందుకోసం ఏసీ రైలు టిక్కెట్ సైతం తీసుకునేందుకు వారి అంగీకారంతో ముందుగా నేతలు డబ్బులు పంపుతున్నారు. మే 13న పోలింగ్ రోజుకు స్వగ్రామానికి రప్పించే బాధ్యత గృహసారథులకు గ్రామస్థాయి వైసీపీ నాయకులు అప్పగించారు. రానుపోను టిక్కెట్లు, భోజనం వసతి కల్పిస్తామని, దారి ఖర్చులు ఇస్తామని చెబుతూ వారిని లోబర్చుకునే ప్రయత్నం ముమ్మరంగా చేస్తున్నారు. మండలంలోని దొడ్డవరం, ఇనమనమెళ్లూరు, రాచవారిపాలెం, లింగంగుంట, పెద్దకొత్తపల్లి గ్రామాల్లో ఎక్కువమంది బేల్దారి కూలి పనుల నిమిత్తం హైదరాబాదు, విజయవాడ, బెంగళూరు తదితర ప్రాంతాలలో ఉంటున్నారు. ప్రస్తుతం గట్టిపోటీ తప్పదని భావిస్తున్న అభ్యర్థులు ఒక్క ఓటు కూడా విడిచిపెట్టకూడదని అనుకుంటున్నారు. ఇందుకోసం ఓటరు ఎంత దూరంలో ఉన్నా ఖర్చుకు వెనకాడకూడదని రప్పించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భవన నిర్మాణ కార్మికులుగా పనిచేసేందుకు వెళ్లిన వారు, ఉద్యోగరిత్యా, వృత్తిపనులు, పిల్లల చదువు నిమిత్తం వివిధ నగరాలు, పట్టణాలకు వెళ్లిన వారి వివరాలను సైతం సేకరిస్తున్నారు. ఫోన్ నెంబర్, గుర్తింపు కార్డు నెంబర్‌లతో జాబితాలు రూపొందించారు. ముందుగా మాట్లాడి వారికి ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా డబ్బులు పంపించే పని అప్పగించినట్లు తెలుస్తున్నది. కొందరు గ్రామ నాయకుల పనులను వలంటర్ల భుజాన వేస్తున్నారు. ఎక్కువమంది ఒకే చోట ఉన్న ప్రాంతాలకు అవసరమైతే స్థానిక నాయకులను పంపించాలని యోచిస్తున్నారు.

సంక్షేమ పాలన టీడీపీతోనే సాధ్యం

తెలుగుదేశం కూటమి ఒంగోలు అభ్యర్థి దామచర్ల ● 23వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం ● ప్రజల నుంచి అనూహ్య స్పందన


మహిళలతో మాట్లాడుతున్న దామచర్ల జనార్దన్


దామచర్లను సత్కరిస్తున్న అభిమానులు

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 26 : ప్రజా సంక్షేమ పాలన తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం నగరంలోని 23వ డివిజన్ కోటవీధిలో జనం కోసం జనార్ధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల ప్రతి ఇంటికీ వెళ్ళి సూపర్ సిక్స్ పథకాలను ప్రచారం చేశారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే వలంటీర్లకు నెలకు రూ.10వేలు గౌరవ వేతనం, అర్హులైన ప్రతి ఒక్కరికీ నెలకు రూ.4వేలు పింఛను, దివ్యాంగులకు రూ.6వేలు పింఛను, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. వాటితో పాటు ప్రతి ఇంటికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామన్నారు. అలాగే నిరుద్యోగులకు నెలకి రూ.3వేలు భృతితోపాటు, అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ ప్రకటిస్తామని, 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఒంగోలు నియోజకవర్గం అభివృద్ధి తాను ఎమ్మెల్యేగానే ఉన్నపుడు జరిగిందన్నారు. నగర సుందరీకరణ, వేసవిలోనూ తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నట్లు దామచర్ల తెలిపారు. నియోజకవర్గ పరిధిలో బ్రిడ్జిలు, సబ్‌స్టేషన్ల నిర్మాణం, పోతురాజు కాలువ ఆధునికీకరణకు నిధులు మంజూరు, అలాగే గుండ్లకమ్మ నుంచి ఒంగోలుకు పైపులైన్‌కోసం రూ.163 కోట్లు మంజూరు చేయించిన పనులు కూడా చేపట్టినట్లు గుర్తు చేశారు. ప్రజలు ఆశీర్వదించి నగరాన్ని అభివృద్ధి చేసే అవకాశం మరోసారి ఇవ్వాలని కోరారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అరాచక పాలన సాగుతోందని విమర్శించారు. ఇలాంటి దుర్మార్గ ప్రభుత్వం మరోసారి వస్తే సామాన్యుడు సంతోషంగా జీవించలేడని తెలిపారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని ప్రజలు దామచర్లకు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, బీజేపీ నాయకులు యోగయ్యయాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


దామచర్లను ఆప్యాయంగా పలకరిస్తున్న వృద్ధురాలు

చంద్రబాబుతోనే అన్ని వర్గాల అభివృద్ధి

టీడీపీ కూటమి సంతనూతలపాడు అభ్యర్థి విజయ్‌కుమార్ ● నందిపాడులో ప్రచారం ● పలువురు తెలుగుదేశంలో చేరిక


కరపత్రాలను అందజేస్తున్న విజయ్‌కుమార్


బీఎన్ సమక్షంలో పార్టీలో చేరిన పలువురు నాయకులు

మద్దిపాడు, ఏప్రిల్ 26: చంద్రబాబునాయుడుతోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని టీడీపీ కూటమి సంతనూతలపాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మద్దిపాడు మండలం నందిపాడులో బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎన్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలంటే మళ్లీ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. డ్వాక్రా గ్రూపుల ద్వారా ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తూ ఆర్థిక అభివృద్ధి చెందే వరకు టీడీపీ ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని చెప్పారు. దళితుల పట్ల వైసీపీ ప్రభుత్వం వివక్షత చూపుతున్నదని ఆయన విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలపై చంద్రబాబు నాయుడు తొలి సంతకం చేస్తారన్నారు. ఈ సందర్భంగా నందిపాడు గ్రామానికి చెందిన 10 కుటుంబాలకు చెందిన వైసీపీ నాయకులు బీఎన్.విజయ్‌కుమార్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన పోతుల శ్రీరామమూర్తి, మండవ ప్రతాప్, కాకి నాగేశ్వర రావు, వెంకటేష్ తదితరులకు విజయ్‌కుమార్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. గత టీడీపీ పాలనలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమాన్ని గుర్తించాలని, త్వరలో జరిగే ఎన్నికల్లో తనను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, మండల వెంకటస్వామి, కొర్రపాటి మాధవరావు, మన్నే శేషయ్య, కోడూరి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలి రూ.300 వచ్చేలా చూడాలి

● డ్వామా పీడీ అర్జున్‌రావు


కనపర్తిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ అర్జున్‌రావు

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 26: ఉపాధి కూలీలకు రోజుకు రూ.300 కూలి దక్కేలా పనులు చేయించాలని డ్వామా పీడీ అర్జున్‌రావు సూచించారు. కనపర్తి పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న చేపల చెరువుల పనులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ కూలీలు సమయ పాలన పాటించాలన్నారు. ఉదయం 6 గంటల నుంచి పనులు ప్రారంభించాలన్నారు. నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేయాలని, ఒక్కో కూలీ రోజుకు రూ.300 కూలి పొందేలా పనులు చేయాలని, అంతకంటే తక్కువ చెల్లింపులు జరిగితే టెక్నికల్ అసిస్టెంట్‌లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పని ప్రదేశంలో కూలీలకు టెంట్లు, మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. మస్టర్‌లలో అవకతవకలు జరిగితే బాధ్యులను విధుల నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు. అనంతరం నాగులుప్పలపాడులోని ఉపాధి హామీ కార్యాలయంలో సమీక్ష చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.వెంకటస్వామి, ఎంపీడీవో మహాలక్ష్మి, ఏపీవో రవి పాల్గొన్నారు.

559మంది శ్రీహర్షిణి విద్యార్థులకు ఉద్యోగాలు

● చైర్మన్ రవికుమార్ అభినందన


ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కళాశాల నిర్వాహకులు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 26: ఒంగోలులోని శ్రీహర్షిణి డిగ్రీ, పీజీ కళాశాలల క్యాంపస్‌లో శుక్రవారం జరిగిన ప్రాంగణఎంపికలో 559 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. చెన్నై కేంద్రంగా ఉన్న టెక్ మహీంద్ర కంపెనీకి 145 మంది విద్యార్థులు ఎంపికయ్యారు వీరికి వార్షిక వేతనంగా రూ.1.8లక్షల నుంచి రూ.2.2 లక్షల వార్షిక వేతనం చెల్లిస్తారు. ఎంఫసిస్ కంపెనీకి 85 మంది ఎంపిక కాగా వీరికి రూ.1.8 లక్షల వార్షిక వేతనం లభిస్తుంది. బెంగళూరు కేంద్రంగా ఉన్న విస్ట్రాన్(టాటా) కంపెనీకి 300 మంది ఎంపిక కాగా వారికి వార్షిక వేతనంగా రూ.2.3లక్షలు చెల్లిస్తారు. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న టెలిపెర్ఫార్మెన్స్ కంపెనీకి 29మంది ఎంపిక కాగా వార్షిక వేతనం రూ.2లక్షల నుంచి రూ.2.5 లక్షల వరకు ఇస్తారు. ఎంపికైన విద్యార్థులు మే 15 తర్వాత ఉద్యోగంలో చేరాల్సి ఉటుంది. ఈ సందర్భంగా స్థానిక కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను చైర్మన్ గోరంట్ల రవికుమార్ అభినందించారు. విద్యార్థులకు డిగ్రీ మొదటి సంవత్సరం నుంచి ప్రాంగణ ఎంపికలకు శిక్షణ ఇస్తున్నందున ఇంతమంది ఉద్యోగాలు సాధించగలిగారన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ గోరంట్ల కవిత, ప్రిన్సిపాల్ డి.అంజనేయులు, శ్రీనివాసరావు, వీఎల్.శ్రీనివాసులురెడ్డి, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

గుండ్లకమ్మలో జోరుగా ఇసుక తవ్వకాలు

● వైసీపీ కీలకనేత అండతో దందా

మద్దిపాడు, ఏప్రిల్ 26: మద్దిపాడు మండలంలోని మల్లవరం, కొలచనుకోట, నందిపాడు, ఇనమనమెళ్లూరు గ్రామాల్లోని గుండ్లకమ్మ పరివాహక ప్రాంతాలలో ఇసుక మాఫియా దోపిడీ రాజ్యమేలుతోంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటాన్ని ఆసరాగా తీసుకున్న దళారులు, ప్రజాప్రతినిధి అండదండలతో యథేచ్ఛగా గుండ్లకమ్మ నది పరివాహక ప్రాంతంలోని ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు వైసీపీ నేతలు బరితెగించి మరీ పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. ప్రధానంగా మల్లవరం, కొలచనకోట గ్రామాల్లో ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు చేస్తూ ఇసుకను టిప్పర్లు, ట్రాక్టర్లతో యథేచ్ఛగా రవాణా చేస్తున్నారు. వైసీపీ నాయకులకు అధికార యంత్రాంగం అండగా నిలుస్తోంది. ఎన్నికల కోడ్ అమల్లోకి ఉన్నప్పటికీ అధికార యంత్రాంగం నిద్రమత్తులో ఉందని, రెవెన్యూ, పోలీస్, ఎస్ఈబీ అధికారులు దృష్టికి వెళ్లిన వారు ఏమాత్రం స్పందించడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ ఇసుక తవ్వకాలు నిర్వహించే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



గుండ్లకమ్మ పరివాహకంలో జరిగిన ఇసుక తవ్వకాలు, ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

అవీ..ఇవీ..

చీమకుర్తిలో వైసీపీ, టీడీపీ వర్గీయుల ఘర్షణ

● ఇరువర్గాలపై బైండోవర్ కేసు

చీమకుర్తి, ఏప్రిల్26 : చీమకుర్తి పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌లో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య గురువారం రాత్రి ఘర్షణ నెలకొంది. బీఎన్.విజయ్‌కుమార్ నామినేషన్ సందర్భంగా బైక్‌ర్యాలీగా వెళ్తున్న టీడీపీ అనుచరులను వైసీపీ వర్గీయులు అడ్డుకున్నారు. దానికి ప్రతిస్పందనగా ఆదేరోజు రాత్రి వైసీపీ ప్రచారాన్ని టీడీపీ వర్గీయులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది. ఈక్రమంలో శుక్రవారం ఇరువర్గాల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు సీఐ దుర్గాప్రసాద్ విచారణ చేశారు. ఇరువర్గాలపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. భవిష్యత్‌లో ఘర్షణకు దిగితే కఠినచర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

నేడు హైదరాబాద్‌లో దామచర్ల ఆత్మీయ సమావేశం

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 26: టీడీపీ కూటమి ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్ శనివారం హైదరాబాద్‌లో జిల్లాకు చెందిన పలువురు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొననున్నారు. ఒంగోలు నియోజకవర్గానికి చెంది, వివిధ వృత్తుల్లో స్థిరపడి అక్కడ నివసిస్తున్న వారితో దామచర్ల కలిసి మాట్లాడనున్నారు. శనివారం సాయంత్రం 5 గంటలకు కూకట్‌పల్లిలో గల ఎన్‌కేఎస్‌ఆర్ గార్డెన్స్‌లో ఈ సమావేశం జరగనుంది.

పేస్‌లో అవగాహన సదస్సు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 26: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో డిజిటల్ స్కిల్స్ ఫర్ లైఫ్ అనే అంశంపై అగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన హెచ్ఎస్‌వోసీ సీనియర్ కన్సల్టెంట్ వి.లక్ష్మీదుర్గ మాట్లాడుతూ యువతులు, బాలికలు ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ రంగాల్లో ముందుకు సాగాలే ప్రోత్సహించాలన్నారు. మహిళలు పురుషులతో సమానంగా అవకాశాలు అందిపుచ్చుకుంటూ స్వతంత్రంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్ ఆర్.వీరాంజనేయులు, ఏవో ఎం.రమణబాబు, డీన్ రూప, అప్పారావు, చైతన్య, ఎన్.వైష్ణవి పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

● ఎంపీ మాగుంట

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 26 : ముస్లింల అభివృద్ధి, సంక్షేమానికి టీడీపీ కూటమి కట్టుబడి ఉందని తెలుగుదేశం పార్టీ ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. ఒంగోలులోని రామనగర్‌లోని గల మాగుంట కార్యాలయంలో ముస్లింల సంక్షేమానికి కూటమి ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ పథకాలను తెలియజేస్తూ ప్రచురించిన పోస్టర్‌ను శుక్రవారం ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు షేక్ మస్తాన్‌వలి, షేక్ పఠాన్‌అహ్మద్ ఖాన్, అబూబకర్, తోహిద్, షేక్‌బాబాలు పాల్గొన్నారు. అనంతరం వారు తెలుగుదేశం ప్రభుత్వంలో ముస్లింలకు అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. దుల్హన్ స్కీం, ఇమామ్ మౌజన్లకు గౌరవ వేతనాలు, చంద్రన్న బీమా, విద్యావ్యాప్తి, దుకాన్ ఔర్ మకాన్, స్వయం ఉపాధి, విదేశీ విద్య స్కీం, సబ్సిడీ రుణాల పథకాలను అమలు చేశారని, వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని వారు కోరారు.

రేపు న్యాయవాదుల ఆత్మీయ సమావేశం

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 26: తెలుగుదేశం పార్టీ ఒంగోలు పార్లమెంట్ లీగల్ సెల్ ఆత్మీయ సమావేశం ఈనెల 28వ తేదీన ఒంగోలు బైపాస్ రోడ్డులోని ఆస్టోనా హోటల్ జరుగుతుందని లీగల్ సెల్ అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10-30 గంటలకు జరిగే ఈ సమావేశానికి టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, టీడీపీ, జనసేన, బీజేపీ న్యాయవాదులు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

ఎస్ఎన్‌పాడు నియోజకవర్గంలో 5 నామినేషన్లు తిరస్కరణ

● ఆర్వో గోపాలకృష్ణ

చీమకుర్తి, ఏప్రిల్ 26 : సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలో ఐదు నామినేషన్లు తిరస్కరణకు గురైనట్లు ఆర్వో గోపాలకృష్ణ శుక్రవారం తెలిపారు. చీమకుర్తి మున్సిపల్ కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో నామినేషన్ల పరిశీలన వివరాలు వెల్లడించారు. మొత్తం 17మంది అభ్యర్థులు 35నామినేషన్లను దాఖలు చేసినట్లు చెప్పారు. వాటిని పరిశీలన చేయగా ముగ్గురు అభ్యర్థులకు సంబంధించి ఐదు నామినేషన్లను తిరస్కరించినట్లు వెల్లడించారు. అందులో అఫిడవిట్ దాఖలు చేయకపోవటం, ప్రపోజర్స్ సరిపడా లేకపోవటం వల్ల తిరస్కరణకు గురయ్యాయని పేర్కొన్నారు. ఇక మొత్తం 14మంది మిగిలారు. వీరిలో ఎవరైనా 29వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలలోపు తమ నామినేషన్‌ను ఉపసంహరించుకొనే అవకాశం ఉందన్నారు. కాగా తదుపరి ఎన్నికల బరిలో నిలిచేది ఎంత మంది అన్నది లెక్క తేలుతుంది. ప్రధాన పార్టీలకు సంబంధించిన అందరి నామినేషన్లు సక్రమంగా ఉన్నాయి.

టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలి



ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న సభ్యులు

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 26: త్వరలో జరిగే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని టీపీడబ్ల్యూ టీం సభ్యులు ప్రచారం నిర్వహించారు. ఉప్పుగుండూరు గ్రామంలోని ఎస్సీకాలనీలో తెలుగు ప్రొఫెషనల్ వింగ్ (టీపీడబ్ల్యూ) టీం ఆధ్వర్యంలో టీం అధ్యక్షులు ఆర్కె మన్నం, హరీష్ రాయపాటి, గొగినేని సుబ్బయ్య, పాతూరి సందీప్, శ్రీరాముల రమేష్ తదితరులు సంతనూతలపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్, బాపట్ల పార్లమెంట్ అభ్యర్థి తేనేటి కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారపత్రాలను ఇంటింటికి అందజేశారు. టీడీపీ అధికారంలో ఉంటేనే అన్ని వర్గాల అభివృద్ధి జరుగుతుందన్నారు. సామాజిక న్యాయం, అభివృద్ధి జరగాలన్నా చంద్రబాబుతో సాధ్యమని చెప్పారు. ఎస్సీలు, ఉపకులాల అభివృద్ధి టీడీపీ హయాంలోనే జరిగిందని వివరించారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు తేనేటి కృష్ణప్రసాద్, బీఎన్‌విజయ్‌కుమార్‌లను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. సూపర్ సిక్స్ పథకాలను వివరించారు.

మద్దిపాడులో దొంగతనం

మద్దిపాడు, ఏప్రిల్ 26: మద్దిపాడు గ్రామానికి చెందిన పెట్టేటి సత్యనారాయణ ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగలకొట్టి బీరువాలో ఉన్న రెండు సవర్ల బంగారు ఆభరణాలు, రూ.20 వేల నగదును తస్కరించినట్లు శుక్రవారం వెలుగులోకి వచ్చింది. సత్యనారాయణ ఇంటిలో ఎవరూ లేరని నిర్ధారించుకున్న దుండగులు లోపలికి ప్రవేశించి బీరువా తాళం పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఎస్ఐ మహేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

తనిఖీల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు


చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న పరిశీలకులు

మద్దిపాడు, ఏప్రిల్ 26: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రైజ్ ఇంజనీరింగ్ కాలేజీలో ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూములను ప్రకాశం జిల్లా పార్లమెంటరీ నియోజకవర్గం పోలీస్ అబ్జర్వర్ హసీబ్ ఉర్ రెహమాన్ శుక్రవారం తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు భద్రత సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలన్నారు. అనంతరం మద్దిపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రోత్ సెంటర్ చెక్‌పోస్టును తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించి, శాంతిభద్రతలపై ఎటువంటి సమస్యలు ఉన్నా 9281034495 సెల్ నెంబరుకు సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు ఫిర్యాదు చేయవచ్చని ఆయన సూచించారు. ఆయన వెంట ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు, మద్దిపాడు ఎస్సై మహేష్ తదితరులు ఉన్నారు.

జనసేనలో వైసీపీ నాయకుల చేరిక

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 26 : టంగుటూరు మండలం మర్లపాడు గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు మేళం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు జనసేన పార్టీలో చేరారు. ఒంగోలులోని జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వైసీపీ కార్యకర్తలకు జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ సమక్షంలో పార్టీలో చేరగా వారికి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు నచ్చి పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. తనతో పాటు మరో 15 కుటుంబాలు చేరినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మేడ రమేష్ నాయుడు, కె.రాంబాబు, ఎం.చంద్రశేఖర్, ఎల్.చంద్రవాసు, బాబ్జి, రమేష్, టి.రవి, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంత స్వామిభక్తా!

ఒంగోలు ఆర్వో వైసీపీకి వత్తాసు..

చెల్లని నామినేషన్ కూడా పరిగణనలోకి

ఈసీకి ఫిర్యాదు చేయనున్న టీడీపీ

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 26: ఒంగోలు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికార వైసీపీకి వత్తాసు పలుకుతున్నారు. నిబంధనలను అధికారపార్టీకి అనుకూలంగా మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని టీడీపీ వర్గీయులు ఆరోపిస్తున్నారు. ఈనెల 18 నుంచి 25వతేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ ముగియగా, పలువురు రాజకీయ పార్టీల నేతలు, ఇండిపెండెంట్ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. కాగా వైసీపీకి అనుకూలంగా కొందరు ఇండిపెండెంట్లు నామినేషన్ దాఖలు చేశారు. ఇందులో కంకణాల గోపీచంద్ అనే అభ్యర్థి జాతీయ జనసేన పేరుతో నామినేషన్ దాఖలు చేయగా, పేరు నామినేషన్‌లో ఒకలా, సంతకం ఒకలా, అఫిడవిట్‌లో ఒకలా ఉండటంతో ఎన్నికల నిబంధనల మేరకు తిరస్కరించాల్సి ఉంది. అదేవిధంగా వజ్జల మహేశ్వరరెడ్డి, పటాపంజుల శ్రీనివాసరావు ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేయగా దరఖాస్తును ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వదిలేశారు. అయితే ఒంగోలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న ఆర్డీఓ జీవీ.సుబ్బారెడ్డి ఆ దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుని అనుమతించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది ఎన్నికల నిబంధలనకు విరుద్ధమని టీడీపీకి చెందిన వారు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదని చెబుతున్నారు. ఏకపక్షంగా అధికారపార్టీకి వత్తాసు పలుకుతూ వారి నామినేషన్లను ఆమోదించడంపై అభ్యంతరం తెలియజేస్తున్నారు. ఒంగోలు ఎన్నికల రిటర్నింగ్ అధికారి తీరుపై రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు, అలాగే కోర్టును ఆశ్రయించేందుకు టీడీపీ నాయుకులు సిద్ధమవుతున్నారు.



సీఎం జగన్ అవినీతి చర్యలను బుడబుక్కల కాలనీలో వివరిస్తున్న కూటమి నాయకులు

సంక్షేమం చంద్రబాబుకే సాధ్యం

టంగుటూరు, ఏప్రిల్ 26 :సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుకే సాధ్యమని టీడీపీ కూటమి నాయకులు ప్రజలకు వివరించారు. టంగుటూరు బుడబుక్కలపాలెం, రావివారిపాలెంలో శుక్రవారం ఇంటింటికీ తెలుగుదేశం శంఖారావం కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి గ్రామ మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, పార్టీ సీనియర్ నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. కూటమి నాయకులు ఇంటింటికీ తిరుగుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్నా, ప్రజలు సుఖసంతోషాలతో కొనసాగాలన్నా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని సూచించారు. జగన్ పాలన సమస్తం రౌడీరాజ్యం, గుండాగిరి, దౌర్జన్యాలు దోపిడీలు, ఆక్రమణలేనని, ఇలాంటి దుశ్చర్యలు నిత్యకృత్యమయ్యాయన్నారు. ఇసుక ధరలకు రెక్కలు రావడంతో ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయని, సామాన్యులు ఇళ్లు నిర్మించుకునే పరిస్థితులు కరువయ్యాయని విమర్శించారు. తాను అధికారంలోకి వస్తే మద్యనిషేదం ప్రకటిస్తానని చెప్పి అధికారం చేపట్టిన నాటి నుంచి మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని, ప్రభుత్వమే మద్యం అమ్మకాలు చేపట్టిందని, ఇంకా జగన్ మాటతప్పనిది, మడెం తిప్పనిది ఎక్కడని వారు ప్రశ్నించారు. ఇళ్ల స్థలాల పేరున స్థలాలకు నాలుగు రెట్లు ధరలు పెంచి దోచుకున్నారని విమర్శించారు. ఇలాంటి దుర్మార్గపు పాలనను అంతమొందించి ప్రజా ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, అందుకే తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామికి, ఎంపీగా మాగుంట శ్రీనివాసులరెడ్డికి ఓట్లేసి అధిక మెజార్టీతో గెలిపించాలని వారు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మొలకలపల్లి శ్రీనివాసరావు, భానుచందర్, దయానందం, జక్కుల శ్రీను, కుందేటి వెంకట్రావు, పెద్దోడు పాల్గొన్నారు.



కొనసాగుతున్న పొగాకు వేలం

టంగుటూరులో పొగాకు కిలో గరిష్ఠ ధర రూ. 290

టంగుటూరు, ఏప్రిల్ 26 : టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం జరిగిన పొగాకు వేలంలో కిలోకు గరిష్ఠ ధర రూ. 290 పలికింది. వేలం కేంద్రానికి కమ్మవారిపాలెం, కట్టుబడివారిపాలెం రైతుల 1,073 పొగాకు బేళ్లు అనుమతించారు. అందులో 1,000 బేళ్లు కొనుగోలు కాగా వివిధ కారణాలతో 73 బేళ్లు మాత్రమే తిరస్కరణకు గురయ్యాయి. వీటిలో కేవలం 16 బేళ్లు మాత్రమే ఎన్‌బీ కాగా ఆర్ఆర్-5 బేళ్లు, సీఆర్-28 బేళ్లు జరిగింది. వేలంలో గరిష్ఠ ధర రూ. 290 లభించగా కనిష్ఠ ధర రూ. 218కి దిగజారింది. సరాసరి ధర రూ. 253.49 రైతులకు దక్కింది. గరిష్ఠ ధర పెరగడం పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

21 నామినేషన్లు ఓకే.. నాలుగు తిరస్కరణ

కొండపి,ఏప్రిల్ 26: కొండపి అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 47 సెట్ల నామినేషన్లను అభ్యర్థులు దాఖలు చేశారు. వీటిలో 25మందికి చెందిన 21 నామినేషన్లు పరిశీలన అనంతరం ఓకే అయ్యాయి. మరో నలుగురు టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ పార్టీలకు డమ్మీలుగా వేసిన అభ్యర్థులు ఏ.బీ ఫారాలు ఇవ్వకపోవడంతో వీటిని తిరస్కరించామని ఆర్వో కుమార్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ప్రకటించారు. ప్రధాన పార్టీలైన టీడీపీ అభ్యర్థి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, వైసీపీ అభ్యర్థి ఆదిమూలపు సురేష్‌తోపాటు వివిధ జాతీయ, రాష్ట్ర, ఇతర రాష్ట్ర పార్టీల తరుపున నామినేషన్లు వేసిన 10 నామినేషన్లు, ఇండిపెండెంట్‌లుగా వేసిన మరో 9 మందివి సరిగా ఉన్నాయని ఆర్వో ప్రకటించారు.

30న టంగుటూరులో సీఎం ప్రచార సభ

టంగుటూరు, ఏప్రిల్ 26 : ముఖ్యమంత్రి జగన్ ప్రచార సభ ఈనెల 30న టంగుటూరులో నిర్వహించనున్నట్లు శుక్రవారం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి, కొండపి వైసీపీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ప్రకటించారు. ఉదయం 10గంటలకు ప్రచార సభ ప్రారంభం అవుతుందన్నారు. తొలుత కొండపిలో అనుకున్న ఈసభను టంగుటూరుకు మార్చారు. టంగుటూరు అయితే జాతీయ రహదారిపై ఉన్నందున జన సమీకరణకు అనుకూలంగా ఉంటుందని భావించి మార్చినట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

దర్శి, ఏప్రిల్ 26: మండలంలోని రాజంపల్లి పంచాయతీలోని మునినది వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పొదిలి మండలం కుంచేపల్లికి చెందిన పాణెం రామాంజనేయరెడ్డి (29) మోటార్ సైకిల్‌పై దర్శికి వచ్చి పనులు చూసుకుని తిరిగి వెళుతున్నాడు. ఈక్రమంలో ముసి నది వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన యువకుడిని పొదిలి ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. దర్శి ఎస్సై సుమంత్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధికి చిరునామా టీడీపీ

ఎమ్మెల్యే స్వామి

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

జరుగుమల్లి (కొండపి), ఏప్రిల్ 26: అభివృద్ధి, సంక్షేమానికి చిరునామా టీడీపీయేనని కొండపి ఎమ్మెల్యే, టీడీపీ ఉమ్మడి కొండపి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ఎన్‌డీఏ కూటమి పార్టీలైన జనసేన, బీజేపీ నాయకులతో కలిసి మండలంలోని నందనవనం, బిట్రగుంట, దావగూడూరు, చింతలపాలెం, పంగులూరివారిపాలెం, జరుగుమల్లి, వావిలేటిపాడు గ్రామాల్లో స్వామి శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన పలు గ్రామాల్లో ప్రచార రథంపై నుంచి గ్రామస్థులను ఉద్దేశించి మాట్లాడారు. కొండపి నియోజకవర్గం టీడీపీ హయాంలోనే అభివృద్ధి సాధించిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడిపోయాయన్నారు. గడచిన ఐదేళ్లలో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయన్నారు. గ్రామాలకు అందుబాటులో ఇసుక ఉన్నా, వైసీపీ విధానాల కారణంగా ఇసుకను ఇళ్ల నిర్మాణాలకు వాడుకోలేని దుస్థితి నెలకొన్నదని విమర్శించారు. తప్పుడు మైనింగ్ పాలసీల ద్వారా ఇసుకను అక్రమార్కులు వేల రూపాయలకు అమ్ముకుని సొమ్ము చేసుకున్నారని విమర్శించారు. టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఉచితంగా ఇసుకను అందించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా వృద్ధులకు నాలుగు వేల రూపాయలు పెన్షన్‌తోపాటు ఏప్రిల్,మే, జూన్ మూడునెలలు అదనంగా మూడు వేల రూపాయలు కలిపి తొలి నెలలో ఏడు వేల రూపాయలు పింఛన్‌దారులకు నేరుగా ఇంటివద్దనే అందించడం జరుగుతుందన్నారు. బీసీలకు 50 సంవత్సరాలకే పింఛన్ అందించడం జరుగుతుందన్నారు. సూపర్‌సిక్స్ పథకాల ద్వారా అన్ని వర్గాల సంక్షేమానికి టీడీపీ కృషి చేస్తుందన్నారు. మహిళలకు పలు సంక్షేమ కార్యక్రమాలు, బీసీలకు ప్రత్యేక రక్షణ చట్ట, నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు వచ్చేవరకు నిరుద్యోగభృతి యువకులకు అందించడం జరుగుతుందన్నారు. రైతులకు పెట్టుబడి సాయం కింద 20 వేల రూపాయల ఆర్థిక సాయం ప్రతి ఏడాది అందిస్తామన్నారు. ఈసందర్భంగా పలు గ్రామాల్లో సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి ప్రజలు తీసుకువచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీనిచ్చారు.



నందనవనం గ్రామంలో ప్రచార రథంపై నుంచి అభివాదం చేస్తున్న స్వామి

టీడీపీలోకి చేరికలు...

ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాత్రి పొద్దుపోయాక పొన్నలూరు మండలంలోని బోగనంపాడు గ్రామంలో పది కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. వైసీపీ నుంచి మాతంగి మల్లికార్జున, మాల్యాద్రి, నరేంద్ర, పద్మ, నాని, మధు, ముండ్లమూరి పిచ్చయ్యల కుటుంబాలతోపాటు మరికొంత మంది చేరారు. అదేవిధంగా శుక్రవారం దావగూడూరు గ్రామంలో వైసీపీకి చెందిన 25 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో స్వామి సమక్షంలో చేరాయి. కంకిపాటి నాగేశ్వరరావు, చిన్నపుల్లయ్య, పురుషోత్తం, ఆశీర్వాదం, పున్నయ్య, పిడతల నారాయణ, ఆదాం, ఇషాకు, తాళ్లూరు వెంకయ్య, దాసు, గోచిపాతల సామేలులకు పార్టీ కండువాలు కప్పి స్వామి స్వాగతం పలికారు. ప్రచార కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, జనసేన మండల అధ్యక్షుడు గూడా శశిభూషణ్, బీజేపీ నాయకుడు బాలకోటయ్య , టీడీపీ సీనియర్ నాయకుడు పోటు పెదబాబు, మాజీ ఎంపీపీ బెల్లం సత్యన్నారాయణ, నాయకులు పేముల విజయనిర్మల, పాతూరి కోటేశ్వరరావు, సుబ్బారెడ్డి, చదలవాడ బ్రహ్మేంద్రం తదితరులు పాల్గొన్నారు.



దావగూడూరులో పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న స్వామి

సింగరాయకొండలో వైసీపీకి భారీ షాక్

ఆ పార్టీని వీడిన 120 కుటుంబాలు

ఎమ్మెల్యే స్వామి, సత్య, రాఘవరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరిక

సింగరాయకొండ, ఏప్రిల్ 26 : సింగరాయకొండ మండలంలో అధికారపార్టీ వైసీపీకి భారీ షాక్ తగిలింది. మండలంలోని సింగరాయకొండ, మూలగుంటపాడు, పాకల తదితర గ్రామాల నుంచి వైసీపీకి చెందిన కీలక నాయకులు, కార్యకర్తలు ఆపార్టీకి గుడ్‌బై చెప్పారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య, మాగుంట రాఘవరెడ్డి ఆధ్వర్యంలో 120 కుటుంబాల వారు తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. వారికి కండువాలు కప్పి సాదరంగా టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించటానికి ప్రజలు టీడీపీ కూటమికి మద్దతుగా నిలవాలని కోరారు. రాష్ట్ర భవిష్యత్‌ను కోరుకునే చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాలని పిలుపునిచ్చారు. వైసీపీని వీడి టీడీపీలోకి వచ్చిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే స్వామి, సత్య, రాఘవరెడ్డి

దామచర్ల, మాగుంట కుటుంబాలకు అభివృద్ధే అజెండా

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య మాట్లాడుతూ దామచర్ల, మాగుంట కుటుంబాలు అభివృద్ధే ఆజెండాగా రాజకీయాలలో కొనసాగుతున్నాయని అన్నారు. ఈ రెండు కుటుంబాలకు వైసీపీ నేతలలా దోచుకోవడం, దాచుకోవడం తెలియదని, ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం పనిచేయటమే తెలుసని తెలిపారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో అన్ని రంగాలు కుదేలయ్యాయని విమర్శించారు. మూర్ఖపు జగన్‌రెడ్డి పాలనలో ఉద్యోగ అవకాశాలు లేక యువత రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాండేజ్ వేసుకొని నాటిస్తున్న జగన్‌రెడ్డి కావాలా.. రాష్ట్రాన్ని పునర్ నిర్మించే చంద్రబాబు కావాలో ప్రజలే తెల్చుకోవాలన్నారు. వైసీపీ ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా యర్రచందనం, గంజాయి స్మగ్లర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైసీపీ కొండపి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆదిమూలపు సురేష్ పోటీచేస్తున్నారని, ఆ ఇరువురు వలస నేతలను ఓడించాలని సత్య పిలుపునిచ్చారు. స్థానికులైన ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే స్వామిలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సత్య కోరారు.

మాగుంట కుటుంబాన్ని అభిమానించే ప్రతి ఒక్కరూ టీడీపీలోకి రావాలి - రాఘవరెడ్డి

మాగుంట రాఘవరెడ్డి మాట్లాడుతూ సింగరాయకొండ మండలంతో మాగుంట కుటుంబానికి ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. స్థానికంగా పెరల్ డిస్టలరీని ఏర్పాటు చేసి వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించామని గుర్తుచేశారు. మాగుంట కుటుంబాన్ని అభిమానించే ప్రతి ఒక్కరూ టీడీపీలోకి రావాలని కోరారు. కొండపిలో 20 వేల పైచిలుక మెజారిటీ వచ్చే విధంగా టీడీపీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు యన్నాబత్తిన మురళి, నేలపాటి శంకర్, మూలగుంటపాడు మాజీ వైస్ సర్పంచ్ మూళ్లపూడి సత్యనారాయణ, వైసీపీ మండల జేసీఎస్ కన్వీనర్ తన్నీరు సుబ్బారావు, వార్డు సభ్యులు పాదర్తి కోటేశ్వరరావు, మోటుపల్లి గోవిందరావు, షేక్ మున్నా వారి ఆధ్వర్యంలో 50 కుటుంబాల వారు, పాకల పోతయ్యగారి పట్టపుపాలెంకు చెందిన ప్రళయకావేరి రోశయ్య ఆధ్వర్యంలో 50 కుటుంబాల వారు, షేక్ జిలానీబాషా వారు అనుచరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు అడకా స్వాములు, టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు చీమకుర్తి కృష్ణ, షేక్ సందానీబాషా, కూనపురెడ్డి సుబ్బారావు, పాకల సర్పంచ్ సైకం చంద్రశేఖర్, గోళ్లమూడి శ్రీనివాసరెడ్డి, మందలపు గాంధీ చౌదరి, చంటి, మించల బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మాగుంటకు కలిసొస్తున్న కరోనా సేవలు

భారీ వ్యయంతో

ఆక్సిజన్ అందించిన వైనం

ప్రచారంలో దూసుకుపోతున్న ఎంపీ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా మహమ్మారీ ప్రజలను పీడించిన సమయంలో సేవలందించిన నాయకులు ప్రస్తుతం ప్రజలు గుర్తుపెట్టుకుంటున్నారు ఆ విషయంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి సొంత నిధులతో సేవా కార్యక్రమాలు, వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచిన తీరు ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గ ప్రజానీకంలో విస్తృతంగా చర్చనీయాంశమైంది. ప్రజలు లాక్‌డౌన్‌తో ఇటు ఉపాధి అవకాశాలు కోల్పోవటం అటు వైద్యసేవలు అందక విలవిలాడిపోయారు. ఒకానొక సమయంలో ఆక్సిజన్ అందుబాటులో లేక కరోనా బాధితులు భారీగా ప్రాణాలు కోల్పోయారు. ఆ సమయంలో నేనున్నానంటూ మాగుంట కుటుంబం ముందుకొచ్చి సేవా కార్యక్రమాలు నిర్వహించింది. ఆక్సిజన్ అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో మాగుంట సొంత నిధులతో ఆక్సిజన్ అందుబాటులోకి తేవటం రాష్ట్రవ్యాప్తంగా కరోనా సేవచేసే వారందరినీ ప్రోత్సహించేందుకు తోడ్పడింది. రూ.60లక్షల వ్యయంతో ఒక ఆక్సిజన్ ట్యాంకర్‌ను ఒంగోలు రిమ్స్‌లో ఆయన సిద్ధంగా ఉంచగలిగారు. మాగుంట చేసిన ఈ బృహత్తర కార్యక్రమం ఎందరికో స్ఫూర్తినిచ్చి తదనంతరం వారు సేవ చేసేందుకు ముందుకొచ్చిన విషయం జగమెరిగిన సత్యం. ఇక లాక్‌డౌన్‌తో పాటు బయట తిరగలేని పరిస్థితుల్లో పనులు లేక ఉపాధి కోల్పోయిన రెక్కాడితే డొక్కాడని ప్రజలకు నిత్యావసర వస్తువులను సరఫరా చేశారు. ఒంగోలు, మార్కాపురం, దర్శి, వైపాలెం, గిద్దలూరు, కనిగిరి, సింగరాయకొండ తదితర ప్రభుత్వం వైద్యశాలలకు, ప్రభుత్వ అధికారులకు వైద్య సేవలందించే సిబ్బందికి, సాధారణ ప్రజానీకానికి పెద్దస్థాయిలో మాస్కులు, బెడ్లు, ఆక్సీజన్ సిలిండర్లు, రెగ్యులేటర్లు, శానిటైజర్లు యుద్ధప్రాతిపదికన అందజేశారు. మధ్యలో ప్రజలకు ఉపయోగపడుతున్నట్లు పేరొచ్చిన నెల్లూరు ఆనందయ్య మందును ఒంగోలు లోక్‌సభ పరిధిలో ప్రజలకు విరివిగా పంపిణీ చేయించారు. అదేసమయంలో రంజాన్ రాగ, పండుగ చేసుకోలేక ఇబ్బందిపడుతున్న ముస్లింలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేసి చేయూతనిచ్చారు. దివ్యాంగుల కోసం ఒంగోలులోని సీతారామకల్యాణ మండపంలో ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేసి ఎంత వ్యయమైన వెనుకంజ వేయకుండా వారికి ఆశ్రయం కల్పించారు. ఇలా కరోనా సమయంలో ప్రజలకు చేయూతగా నిలవటమే కాక ఎక్కువ రోజులు ప్రజల్లో తిరుగుతూ వైద్యశాలలకు వెళ్లే పరిస్థితులు సమీక్షిస్తు అటు అధికారులకు, ప్రజలకు మనోధైర్యం కల్పించేలా ముందుకు సాగారు. కరోనా అనంతరం కొత్తపట్నం మండలంలో మత్యకారులు కంటి సమస్యతో బాధపడుతున్నారని తెలిసి ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేసి ఉచితంగా మందులు, కళ్లద్దాలు పంపిణీ చేయించారు. ప్రస్తుతం ఆయన కుటుంబం నియోజకవర్గం అంతా పర్యటిస్తున్న నేపథ్యంలో ఈ అంశాలను పలువురు ప్రస్తావిస్తున్నారు.



కరోనా సమయంలో రిమ్స్‌లో రోగుల కోసం బెడ్‌లను అందజేసిన ఎంపీ మాగుంట (ఫైల్)

ఆర్యవైశ్యులకు జే ట్యాక్స్ దెబ్బ

- వైసీపీ పాలనలో వ్యాపారాలు, పరిశ్రమలు నాశనం
- అందరికీ అండగా ఉంటాం
- టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి

అద్దంకి, ఏప్రిల్ 26 : చిరు వ్యాపారులకు, దినసరి కూలీలకు టీడీపీ అండగా ఉంటుందని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఉదయం అద్దంకి పట్టణంలోని 15వ వార్డు, రాత్రి మండలంలోని కొటికలపూడిలో ఎమ్మెల్యే పర్యటించారు. ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ఈ సం దర్భంగా గొట్టిపాటి మాట్లాడుతూ వైసీ పీ అధికారం చేపట్టిన తరువాత అద్దంకి పట్ట ణం, బల్లికురవ, మేదరమెట్లలో రోడ్లకు ఇరువైపులా చిరు వ్యాపారుల భవనాలు ఇష్టారీతిన ఖాళీ చేయించి వా రి పొట్టకొట్టారన్నారు. ఇలాం టి చర్యలను తీవ్రంగా ఖం డించామన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ నుంచి ఈ ఐదేళ్లలో ఒక్క రూపాయి లబ్ధి చేకూరలేదన్నారు. కేంద్రం తె చ్చిన ఈబీసీ చట్టంలో ఆర్యవైశ్యులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కషిచే స్తానన్నారు. పేద ఆర్యవైశ్యులకు టీడీపీ పాలనలో కేటాయించిన టిడ్కో ఇళ్లు, రేషన్ కార్డులు వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రద్దు చేసిందన్నారు. పే ద ఆర్యవైశ్యుల విద్యార్థుల విదేశీ విద్య అం దించడానికి కార్పొరేషన్ ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించేలా టీడీపీ చర్యలు తీసుకుంటుందన్నారు. జగన్ అండ్ కో జే ట్యాక్స్ విధానాల కారణంగా ఆర్యవైశ్యులు తీవ్ర ఇబ్బందులు ఎ దుర్కొన్నారన్నారు. రకరకాల పన్నులతో వ్యాపారులను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తరువా త ఆర్యవైశ్యులు స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకునే అవకాశం కల్పిస్తామన్నారు. ముందుగా కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



15వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్



గజమాలతో ఘనస్వాగతం పలుకుతున్న మహిళలు

ఏలూరికి బ్రహ్మరథం

- ఆకట్టుకున్న ఎడ్లబండి ప్రచారం
- ఘనస్వాగతం పలికిన కుంకలమర్రు గ్రామస్థులు

కుంకలమర్రు(పర్చూరు), ఏప్రిల్ 26 : కారంచేడు మండలం కుంకలమర్రులో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న ఏలూరికి ప్రజలు ఘనస్వాగతం పలికారు. అడుగడుగునా పూలవర్షంతో గ్రామంలోకి సాధరంగా ఆహ్వానించి అభిమానం చాటుకున్నారు. పెద్దఎత్తున మహిళలు తరలి వచ్చి హారతులతో దీవించారు. అభివృద్ధి ప్రదాత మా ఏలూరి అంటూ యువత జేజేలు పలికారు. ఏలూరికి గజమాలతో మహిళలు సత్కరించి అభిమానం చాటుకున్నారు. ఏలూరి ప్రచారానికి పెద్ద ఎత్తున తెలుగుదేశం, జనసేన, బీజేపీతోపాటు, ఏలూరి అభిమానులు తరలి రావడంతో ప్రధాన వీధులన్నీ జనసంద్రాన్ని తలపించాయి. కార్యక్రమంలో భాగంగా మసీదులో ముస్లింలు ఏలూరి గెలవాలని ప్రత్యేక పూజలు చేశారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఏలూరికి కుంకలమర్రు గ్రామస్థులు అడ గడునా నీరాజనాలు పలికారు. మాటిచ్చు మీకేనయ్యా అంటూ వృద్ధులు ఏ లూరిని ఆప్యాయంగా పలుకరిస్తూ దీవించారు. ఈ సందర్భంగా ఏలూరి కుం కలమర్రులో ఎడ్లబండిపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ బా పట్ల పార్లమెంట్ అధ్యక్షుడు సలగల రాజశేఖర్‌బాబు, తెలుగుదేశం, జనసేన, బీసేపీ ప్రజా కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.




పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఏఎస్పీ

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు

- సిబ్బందికి ఏఎస్పీ సూచన - సమస్యాత్మక ప్రాంతాలపై అప్రమత్తం

చీరాలటౌన్, ఏప్రిల్ 26 : ఎన్నికల విధుల్లో సిబ్బంది అలసత్వం వహించరాదని, సమస్యాత్మక ప్రాంతాలలో అప్రమత్తంగా ఉండాలని ఏఎస్పీ టీపీ విఠలేశ్వర్ అన్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో శుక్రవారం కారంచేడు పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. అనంతరం స్వర్ణ గ్రామంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అలాగే చీరాల వన్‌టౌన్, టూటౌన్ స్టేషన్‌ల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సెయింట్ ఆన్స్ కళాశాలలోని స్ట్రాంగ్ రూం వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తును పరిశీలించి సూచనలు చేశారు. అన్ని ప్రాంతాల్లో భద్రతాపరమైన లైటింగ్ ఉంచాలన్నారు. కేద్రాల వద్ద విధులు నిర్వహించే వారికి పలు హెచ్చరికలు జారీ చేశారు. స్వేచ్ఛాయుత పోలింగ్ జరిగేందుకు అన్నిరకాల జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఏఎస్పీ తెలిపారు. ఆయనవెంట చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్, సీఐలు శేషగిరిరావు, సోమశేఖర్, సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



రాజకీయ సిత్ర విసిత్రాలు

కాంట్రాక్ట్ ప్రచారం



చీరాలలో ఓ ప్రధాన పార్టీ నామినేషన్ కార్యక్రమంలో డ్యాన్సర్లు

ఎన్నికల ప్రచారంలో కాంట్రాక్ట్ పద్ధతి వచ్చింది. ఆయా పార్టీల నాయకులు రోజువారీ ఒప్పందాలకు కొందరితో, ఎన్నికల ప్రచారం పూర్తయ్యే వరకు ఇంకొందరితో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. ఆయా సందర్భాలను బట్టి వచ్చే కూలీలకు రోజుకు రూ.300 నుంచి రూ.400 వరకు చెల్లిస్తున్నారు. పోలింగ్ ముందు రోజు వరకు ఒక్కొక్కరికీ ఎంత చెల్లించాలనేది కాంట్రాక్టు పద్ధతిలో మాట్లాడుకున్నారు. వీరు ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులు చెప్పినట్లు ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ప్రధానంగా ఇంటింటి ప్రచారం చేసే వారికి గిరాకీ ఎక్కువగా ఉంది. ఎంతో కొంత డబ్బు వస్తుండడంతో మైనర్లు నుంచి పండు ముసలి వరకు ఆయా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో పార్టీల అభ్యర్థులు మాత్రం ఎప్పుడు ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందా అని ఎదురు చూస్తున్నారు. మొన్నటితో పూర్తయిన నామినేషన్ల కార్యక్రమానికి వెళ్లిన వారికి చేతిలో ఎంతోకొంత పడితేనే కదిలారు. - చీరాల

మందుబాబులకు గ్రహచారం



ఎన్నికల నిబంధనల వల్ల సాధారణ మందుబాబులు బేజారెత్తుతున్నారు. రోజువారీ అమ్మకాల లక్ష్యం పూర్తయితే ప్రభుత్వ మద్యం దుకాణాలను మధ్యాహ్నానికే మూసివేస్తున్నారు. దీంతో మందుబాబులు అనివార్యంగా బెల్ట్‌షాపులను ఆశ్రయించాల్సి వస్తోంది. మద్యం దుకాణాల సిబ్బంది ముందు రోజు రాత్రి వారికి ఉన్న డిమాండ్‌ను బట్టి బెల్ట్‌షాపులకు ఉదయాన్నే మద్యం తరలిస్తున్నారు. సదరు బెల్ట్ షాపుల నిర్వాహకులు ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బందికి ఒక్కో క్వార్టర్ బాటిల్‌కు రూ.10 నుంచి రూ.20 అదనంగా చెల్లిస్తున్నారు. బెల్ట్‌షాపుల వారు రూ.50 లాభం చూసుకుని విక్రయిస్తున్నారు. రోజువారీ అలవాటు ఉన్న వారు చేసేదిలేక అంతబెట్టి కొనుగోలు చేస్తున్నారు. ఆ దందాను నియంత్రించాల్సిన అధికారులు ఆవైపు కన్నెత్తి చూడడం లేదని వారు ఆరోపిస్తున్నారు. - చీరాల

వలస ఓట్లకు తప్పని ఆచారం



సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్నకొద్దీ ప్రధాన పార్టీల వారు వలస ఓటర్లపైనా దృష్టి సారిస్తున్నారు. ఎన్నికలలో వారి ఓట్లు కూడా కీలకంగా మారనున్నాయి. దొనకొండ మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో 37,488 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో సుమారు 7 వేల నుంచి 8 వలే మంది ఓటర్లు బయట ప్రాంతాలకెళ్లారు. పొట్టకూటి కోసం కొందరు, విద్య, ఉద్యోగం, వ్యాపారాల నిమిత్తం మరికొందరు గుంటూరు, విజయవాడ, విశాఖపట్టణం, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల్లో నివసిస్తున్నారు. వలస ఓటర్లను ప్రలోభపెట్టి తమ వైపునకు తిప్పుకునేందుకు ప్రధానపార్టీల నేతలు ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారు. మండలంలోని గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్లు ఎక్కడెక్కడ ఉన్నారనే వారికి సంబంధించిన పూర్తి వివరాలను నాయకుల ద్వారా ఆరా తీసి వారి నివేదిక సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. వలస ఓటర్లను ఎలా తమకు అనుకూలంగా మార్చుకోవచ్చనే అంశాలను పరిగణనలోకి తీసుకొని వారి సమాచారాన్ని సేకరిస్తున్నారు. - దొనకొండ

వాకింగ్.. కేన్వాసింగ్...!

దామచర్ల గెలుపు కోరుతూ ప్రచారం



రంగారాయుడు చెరువు వద్ద ప్రచారం నిర్వహిస్తున్న శ్రేణులు

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 26 : టీడీపీ కూటమి ఒంగోలు నియోజకవర్గ అభ్యర్థి దామచర్ల జనార్దన్ గెలుపు కోరుతూ ఆ పార్టీ నాయకులు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక రంగారాయుడు చెరువు కట్ట మీద శుక్రవారం టీడీపీ నేతలు దమ్మాలపాటి రమేష్, చెంగలశెట్టి అశోక్, సోమిశెట్టి సుబ్బారావు గుప్తాలు వాకర్స్‌కు సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ప్రచార కరపత్రాలను పంచిపెట్టారు. దామచర్ల హయాంలోనే ఒంగోలు అభివృద్ధి చెందిందని తెలిపారు. వైసీపీ పాలనలో నగర అభివృద్ధి శూన్యమన్నారు. మరోసారి వైసీపీ అధికారంలోకి వస్తే దాడులు, ఆక్రమణలు, భూ కబ్జాలు పెరిగిపోతాయని చెప్పారు. వైసీపీ పాలన అంతా అవినీతిమయం అని విమర్శించారు. అలాంటి పాలకులను గెలిపిస్తే సామాన్యుడు సంతోషంగా జీవించే పరిస్థితి లేదన్నారు. ప్రజలు వాస్తవాలను గుర్తించాలని, నగర అభివృద్ధి కోసం దామచర్లను గెలిపించాలని కోరారు.

కానిస్టేబుల్ వేణు సస్పెన్షన్?

ఎన్నికల కమిషన్‌కు నివేదిక పంపిన ఎస్పీ

ఈ నెల 3 నుంచి విధులకు గైర్హాజరంటూ ఫైల్

ఒంగోలు(క్రైం), ఏప్రిల్ 26 : కానిస్టేబుల్ వేణు ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత కూడా విధులకు గైర్హాజరు కావడంతో ఎస్పీ గరుడ్ సుమిత్‌సునీల్ సీరియస్ అయ్యారు. అతనిపై ఎన్నికల కమిషన్‌కు నివేదిక పంపించారు. అతను ఈ నెల 3 నుంచి విధుల్లో లేడని, పోలీసుస్టేషన్ జనరల్ డైరీ ప్రకారం సింగరాయకొండ సీఐ రంగనాథ్ నివేదక ఇచ్చారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగి ఎలాంటి అనుమతులు లేకుండా 21 రోజులు విధులకు గైర్హాజరు కాకూడదు. సీఐ ఇచ్చిన నివేదకను ఎస్పీ పరిశీలించి ఎన్నికల కమిషన్‌కు పంపించారు. దీంతో కానిస్టేబుల్‌పై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకునే అవకాశం ఉంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బాలినేని తనయుడు ప్రణీత్‌రెడ్డి సేవలో వేణు తరిస్తుండడం జగమెరిగిన సత్యం. అతను ఇప్పటికీ యూనిఫాం లేకుండా ప్రణీత్‌రెడ్డి వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వేణు విధులకు గైర్హాజరవుతున్నాడు అనేది పోలీసు అధికారులందరికీ తెలిసిన విషయమే. దీనిని ఎవరూ ప్రశ్నించేందుకు సాహసించలేకపోయారు. వేణు విధులకు గైర్హాజరుపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం రావడంతో అప్పుడు స్పందించారు. ఈ క్రమంలో టంగుటూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి సీఐ ఈ నెల 3 నుంచి కానిస్టేబుల్ వేణు విధులకు గైర్హాజరయ్యాడు అని నివేదక ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందని ఆశాఖలోనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీఐ రంగనాథ్ ఈనెల 3 నుంచి ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకున్నప్పటికీ, కానిస్టేబుల్ వేణు అంతకుముందు పోలీసుస్టేషన్‌లో ఎలాంటి విధులు నిర్వహించాడు అనేది జనరల్ డైరీ పరిశీలిస్తే తెలుస్తుంది. ఏదేమైనప్పటికీ ఎస్పీ కోరిన మేరకు ఈనెల 3 నుంచి విధులకు గైర్హాజరైనట్లు సీఐ నివేదిక ఇచ్చారు. దీని ఆధారంగా ఎన్నికల కమిషన్‌కు నివేదిక సమర్పించారు. నేడోరేపో చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

ఎరిక్షన్.. పరఫెక్షన్...!

ప్రచారంలో దూసుకుపోతున్న ఎర్రగొండపాలెం టీడీపీ అభ్యర్థి

ఒకటికి రెండుమూడు సార్లు ఊళ్లన్నీ చుట్టేసిన వైనం


ప్రస్తుతం ఆయనతో పాటు పిల్లలూ ఇంటింటి ప్రచారం

ఆలస్యంగా వచ్చిన వైసీపీ అభ్యర్థి అన్ని గ్రామాలు తిరగలేని పరిస్థితి

నేతల మధ్య విభేదాల పరిష్కారానికే తాటిపర్తి ప్రాధాన్యత

ఆంధ్రజ్యోతి, ఒంగోలు :

ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో నామినేషన్ల అనంతరం ప్రచార కార్యక్రమం హోరెత్తుతోంది. అయితే ఇప్పటికే జరిగిన, జరుగుతున్న ప్రచార కార్యక్రమం పరిశీలిస్తే తెలుగుదేశ కూటమి అభ్యర్థి ఎరిక్షన్‌బాబు దూకుడుగా ముందుకు సాగుతున్నారు. ఈపాటికే ఆయన రెండు మూడు పర్యాయాలు గ్రామాలన్నీ చుట్టేసి ప్రజలతో మమేకమయ్యారు. ప్రసుత్తం ఆయనతో పాటు ఆయన కుమారుడు, కుమార్తె కూడా ప్రచారంలోకి రావటంతో ముగ్గురు మూడు వైపులా ఊరూవాడా పర్యటిస్తున్నారు. మూడేళ్ల క్రితమే ఆయన నియోజకవర్గానికి వచ్చి అక్కడ వారినే అంటిపెట్టుకొని ఉండటం కలసివచ్చింది. తాజాగా హైదరాబాద్ నుంచి రంగంలోకి వచ్చిన వైసీపీ అభ్యర్థి చంద్రశేఖర్ పార్టీలో పరిస్థితులు చక్కబెట్టేందుకే సమయమంతా సరిపోవటంతో ప్రచార కార్యక్రమాల్లో వెనుకబడిపోయారు.



వైసీపీ నుంచి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎరిక్షన్‌బాబు, మన్నె రవీంద్ర

వైసీపీ నుంచి భారీగా చేరికలు

నియోజకవర్గంలో సుమారు 10వేల మందికి పైగా గిరిజన ఓటర్లు ఉండగా 50వేలకు పైగా దళిత ఓటర్లు ఉన్నారు. దళితుల్లో ఆయన సామాజిక వర్గానికి చెందిన మాదిగ వర్గం వారే 40వేలకు పైగా ఉన్నారు. నాయకుడు కన్నా మీలో ఒకడిని అంటూ ఆయన గతంలో అక్కడ పనిచేసిన దళిత నాయకులకన్నా మరింత చొరవతో ముందుకు సాగి వారిలో ఒకరుగా మారారు. దళితవాడలన్నీ ఆయన్ను అక్కున చేసుకునే పరిస్థితి వచ్చింది. ఇంకోవైపు రాజకీయంగా పెత్తనం చెలాయించే నాయకులు కూడా ఆయన పట్టుదలను గుర్తించి చేరువయ్యారు. ఏదైనా ఒక పని పట్టుదలతో సాధిస్తున్న ఆయన తత్వం పట్ల నాయకులు ఆకర్షితులై వైసీపీ నుంచి భారీగా టీడీపీలోకి వలసలు జోరుగా సాగుతున్నాయి.

డాక్టర్ మన్నె రవీంద్ర తోడుగా ప్రచారం...

చంద్రబాబు కూడా గతేడాది ఏప్రిల్ 27న ఎర్రగొండపాలెం వచ్చినప్పుడే ఎరిక్షన్‌బాబును అభ్యర్థిగా ప్రకటించటంతో ఆయన మరింత వ్యూహాత్మకంగా సమరానికి సన్నద్ధం కాగలిగారు. ప్రసుత్తం జనసేన, బీజేపీలు కలవటంతోపాటు ఆ పార్టీల నాయకులు నియోజకవర్గ ప్రజలకు సుపరిచితుడైన టీడీపీ స్థానిక నాయకుడు డాక్టర్ మన్నె రవీంద్ర ప్రచారం చేస్తున్నారు. వీరికి తోడు ఎరిక్షన్‌బాబు కుమారుడు, కుమార్తె కూడా మారుమూల పల్లెలకు వెళ్లి ప్రచారం చేస్తున్నారు. అన్నివైపులా టీడీపీ ప్రచార కార్యక్రమం దూకుడుగా కొనసాగుతోంది.

కొండేపి నియోజకవర్గానికి చెందిన కాంట్రాక్టర్‌గా హైదరాబాద్‌లో ఉంటున్న వైసీపీ అభ్యర్థి చంద్రశేఖర్ నియోజకవర్గానికి వచ్చి మూడు నెలల సమయం అయింది. స్థాక వైసీపీలో ఉన్న గ్రూపుల తగాదాలను సరిచేసుకునేందుకే ఆయన సమయం సరిపోతుంది. కొంతకాలంగా ఆయన ప్రచారం చేస్తున్నా నియోజకవర్గంలో సగం గ్రామాలను కూడా సందర్శించలేని పరిస్థితి ఎదురైంది. ఉదాహరణకు 46 గ్రామాలు ఉన్న ఒక మండలంలో ప్రతి గ్రామాన్ని ఒకటి రెండు సార్లు ఎరిక్షన్‌బాబు వెళ్లి రాగా వైసీపీ అభ్యర్థి చంద్రశేఖర్ 12 గ్రామాలకు మాత్రమే వెళ్లగలిగారు. అలా వెళ్లిన గ్రామాల్లో కూడా నాయకులను కలిసేందుకే ఆయన పరిమితమయ్యారు. దీంతో వ్యకిగత పరిచయాలు, సన్నిహిత సంబంధాలు టీడీపీ అభ్యర్థి ఎరిక్షన్‌బాబుకు బాగా ఉపయోగపడుతున్న వాతావరణం స్పష్టంగా కనిపిస్తోంది.

మూడేళ్ల క్రితమే బాధ్యతలు అప్పగించిన బాబు

2009 పునర్విభజన సమయంలో తిరిగి ఏర్పడిన ఎర్రగొండపాలెం నియోజకవర్గం దళితులకు రిజర్వు అయిన విషయం తెలిసిందే. స్థానిక నాయకత్వ సమస్యతో కొట్టుమిట్టాడుతున్న టీడీపీకి ఆ పార్టీ అధినేత చంద్రబాబు, లోకేష్ తెలుగుదేశానికి అంకితమై రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగిన ఎరిక్షన్‌బాబుకు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించారు. వ్యూహాత్మకంగా మూడేళ్ల క్రితమే బాధ్యతలు అప్పగించగా ఆయన కూడా స్థానికంగా ఉంటూ పార్టీ శ్రేణులతో పాటు పార్టీలో మమేకమయ్యేందుకు పూర్తి ప్రాధాన్యత ఇచ్చారు. నియోజకవర్గంలో 94 పంచాయతీలు సుమారు 200 గ్రామాలు ఉన్నాయి. అందులో నల్లమల్ల అటవీ ప్రాంతాన్ని ఆసరా చేసుకొని గిరిజన ప్రజలు నివసించే పల్లెలు అధికంగా ఉన్నాయి. దీంతో ఎరిక్షన్‌బాబు తొలి ఏడాదిలోనే ఒక పర్యాయం అన్ని గ్రామాలను సందర్శించి టీడీపీ నాయకులు, శ్రేణులతో పాటు ప్రజలను పరిచయం చేసుకున్నారు. అదే సమయంలో గ్రామాల వారీ సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి వినూత్న కార్యక్రమం చేపట్టారు. తొలివిడతగా తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన ప్రయత్నాలను ప్రజలకు వివరిస్తూ రెండో ఏడాదిలో మరోసారి గ్రామాలన్నీ చుట్టేశారు. ఈ ఏడాదిలో ఎన్నికల సమయం కళ్లముందు కనిపిస్తున్న నేపథ్యంలో ముచ్చటగా మూడోసారి గ్రామాలకు వెళ్లివచ్చారు. ఆయన గ్రామాలకు వెళ్లి మొక్కుబడిగా కొందరితో మాట్లాడి రావటానికే పరిమితం కాకుండా అన్ని వర్గాల ప్రజల వద్దకు వెళ్లి వారితో మమేకమవుతున్నారు. రాజకీయంగా పెత్తనం చేసే నాయకులకు అతీతంగా గిరిజనులు, దళితవాడల్లో ఆయన మకాం వేసి మరీ వాస్తవ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

పేరుకే శిలాఫలకాలు..

పనులకు తిలోదకాలు

సీఎం జగన్ ప్రారంభించిన పనులకూ దిక్కులేదు

ఇబ్బందులు పడుతున్న పొదిలి పంచాయతీ ప్రజలు

మధ్యలోనే ఆగిన పొదిలి పెద్దచెరువు పైపులైన్ పనులు




పొదిలి, ఏప్రిల్ 26 : పొదిలి నగర పంచాయతీని సమూలంగా మార్చి వేసి అభివృద్ధి చేస్తామని గతేడాది మార్కాపురం వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. దీనిలో భాగంగా ప్రజలకు శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు పొదిలి పెద్ద చెరువుకు సాగర్ కాలువ నుంచి పైపులైన్ ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. అంతేగాక మార్కాపురం అడ్డరోడ్డు నుంచి రోడ్డు విస్తరణ పనులు చేపడతానని ఆర్భాటంగా ప్రకటించారు. ఆ తర్వాత ఆ పనుల తాలూకు శిలాఫలకాలను తాడేపల్లి నుంచి వర్చ్యువల్ విధానంలో జగన్ ఆవిష్కరించారు. ఆ పనులు ఆర్భాటంగా ప్రారంభించి ఆపేశారు.

పొదిలి పెద్దచెరువుకు పైపులైన్ ద్వారా తాగు, సాగు నీరు అందిస్తామని అప్పటి ప్రతిపక్ష నేత ఇప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో హామీ ఇచ్చి ఆరేళ్లు అయ్యింది. పొదిలి పెద్దచెరువుకు దర్శి సాగర్ కెనాల్ నుంచి పైపులైన్ ద్వారా తాగు, సాగునీరు రావాల్సి ఉంది. దీని కోసం గతేడాది మార్కాపురం వచ్చిన సందర్భంలో వర్చ్యువల్ విధానంలో మార్కాపురంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అదే పనులకు ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి కూడా కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. ఈ క్రమంలోనే నాలుగు కిలోమీటర్ల మేర కాంట్రాక్టర్ పైపులైన్ కూడా వేశారు. దీనికోసం రూ.10 కోట్లు వెచ్చించినట్లు కాంట్రాక్టర్ తెలిపారు. అయితే ఒక్కరూపాయి కూడా విడుదల చేయలేదు. దీంతో కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపి వెళ్లిపోయారు. ఈ పైపులైన్ ఏర్పాటు క్రమంలో కాలువకు, పొదిలికి మధ్యలో ఉన్న మల్లవరం గ్రామస్థులు పైపులైన్ ఏర్పాటును అడ్డుకున్నారు. తమ నివాసాల మధ్య నుంచి పైపులైన్ వెళుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఆ సమస్యను పరిష్కరించకపోవడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.

11 కోట్లతో రోడ్ల విస్తరణ పనులు ఏవీ..

మార్కాపురం అడ్డరోడ్డు నుంచి కాటూరివారిపాలెం వరకు రోడ్డు విస్తరణ పనులకు రూ.11కోట్లు నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. నిధులు మంజూరైన తరువాత మూడు నెలల్లో పొదిలి పట్టణంలో రోడ్ల విస్తరణ చేపట్టి ఆరునెలల్లో పూర్తి చేస్తామని ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి కూడా హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఆ ఊసే లేకుండా పోయింది. సైడు కాలువలు లేకపోవడం, రోడ్డువిస్తరణ చేయకపోవడంతో మురుగునీటితోపాటు, వర్షపునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో ఇరుకు రోడ్లతో అవస్థలు పడుతున్న పొదిలి ప్రధాన రహదారి విస్తరణ పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఏది ఏమైనా మటతప్పడం, మడమ తిప్పడం జగన్మోహన్‌రెడ్డి అలవాటేనని పలువురు ప్రజలు విమర్శిస్తున్నారు.




పొదిలిలో కాలువలు నిండి రహదారులపైకి పొంగిపొర్లుతున్న మురుగునీరు

కంభం కథ...

ఆనాటి సంగతులు

- నాడు నియోజకవర్గ కేంద్రం - పునర్విభజనలో రద్దు
- 2009 వరకు 8 పర్యాయాలు ఎన్నికలు
- ప్రభావం చూపిన టీడీపీ, కాంగ్రెస్‌లు



కంభం మేజర్ పంచాయతీ

కంభం నియోజకవర్గం ఏర్పాటు నుంచి 2009 వరకు గెలిచిన అభ్యర్థులు

సంవత్సరం	గెలిచిన అభ్యరి	పార్టీ	సమీప ప్రత్యర్థి
1952	పిడతల రంగారెడ్డి	కాంగ్రెస్	ఎ.స్వామిరంగారెడ్డి
1978	కందుల ఓబులరెడ్డి	కాంగ్రెస్	షేక్ మహమ్మద్ షరీఫ్
1983	కందుల నాగార్జునరెడ్డి	కాంగ్రెస్	ఉడుముల వెంకటరెడ్డి
1985	ఉడుముల వెంకటరెడ్డి	టీడీపీ	కందుల నాగార్జునరెడ్డి
1989	కందుల నాగార్జునరెడ్డి	కాంగ్రెస్	ఉడుముల వెంకటరెడ్డి
1994	చప్పిడి వెంగయ్య	టీడీపీ	కందుల నాగార్జునరెడ్డి
1999	కందుల నాగార్జునరెడ్డి	కాంగ్రెస్	చప్పిడి వెంగయ్య
2004	ఉడుముల శ్రీనివాసులరెడ్డి	కాంగ్రెస్	చేగిరెడ్డి లింగారెడ్డి



కంభం, ఏప్రిల్ 26 : గతంలో ఉన్న కంభం నియోజకవర్గం ఘన చరిత్రను సొంతం చేసుకుంది. దాదాపు 51 సంవత్సరాలు ఈ నియోజకవర్గం కొనసాగింది. 2009 పునర్విభజనలో ఈ నియోజకవర్గం రద్దయింది. ప్రస్తుతం గిద్దలూరు నియోజకవర్గంలో ఉన్న కంభం మండలం ఒకప్పుడు నియోజకవర్గ కేంద్రంగా ఉండేది. సరిగ్గా 72 ఏళ్ల క్రితం యర్రగొండపాలెం నియోజకవర్గాన్ని రద్దు చేసి 1952లో కంభం నియోజకవర్గాన్ని ఏర్పాటు చేశారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజన వరకు కొనసాగింది. ఆ తరువాత కంభాన్ని రద్దుచేసి మళ్లీ యర్రగొండపాలెం నియోజకవర్గాన్ని పునరుద్ధరించారు. 1952 నుంచి 2004 వరకు ఎనిమిది పర్యాయాలు ఎన్నికలు జరగ్గా, ఆరుసార్లు అప్పటి కాంగ్రెస్ పార్టీ, రెండు పర్యాయాలు టీడీపీ విజయం సాధించాయి. 1983లో ఎన్‌టీఆర్ ప్రభంజనం కొనసాగిన సమయంలోనూ ఇక్కడ కాంగ్రెస్ తరఫున కందుల నాగార్జునరెడ్డి విజయం సాధించారు. 1952లో జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన పిడతల రంగారెడ్డి 1978లో గెలిచిన కందుల ఓబులరెడ్డి మంత్రులుగా పనిచేశారు. కందుల నాగార్జునరెడ్డి మాడుపర్యాయాలు ప్రాతినిధ్యం వహించారు.



ఎడ్ల బండిపై ఏలూరి ప్రచారం

టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు గ్రామీణవాతావరణం తరహాలోనే ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. కుంకలమర్రులో శుక్రవారం ఎడ్ల బండిపై ఎన్నికల ప్రచారం చేశారు. రైతులు, రైతు కూలీలు పెద్దఎత్తున తరలివచ్చి ఏలూరికి నీరాజనాలు పలికారు. ఎడ్ల బండిపై గ్రామమంతా తిరుగుతూ ఏలూరి వినూత్నంగా చేసిన ప్రచారం అందరినీ ఆకట్టుకుంది. అన్నదాతల సంక్షేమమే టీడీపీ కూటమి లక్ష్యమని ఏలూరి రైతులనుద్దేశించి ప్రసంగించారు.

- పర్చూరు

టీడీపీతోనే మైనారిటీల అభివృద్ధి

● ఆ పార్టీ మైనారిటీ విభాగం నాయకులు మౌలాలి, ఇబ్రహీంఖాన్



మాట్లాడుతున్న టీడీపీ మైనారిటీ నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 26: టీడీపీ హయాంలోనే మైనారిటీల అభివృద్ధి జరిగిందని టీడీపీ నాయకులు షేక్ మౌలాలి, పటాన్ ఇబ్రహీంఖాన్ స్పష్టం చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడారు. పట్టణంలో వైసీపీ నాయకులు ఓటమి భయంతో టీడీపీ-బీజేపీ పొత్తుపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. నిన్న మొన్నటి దాకా బీజేపీతో చట్టాపట్టాలేసుకు తిరిగిన వైసీపీ నాయకులు నేడు ఎన్డీఏ కూటమిపై విమర్శలు చేయడం తగదన్నారు. తమ అధినేత చంద్రబాబు హయాంలోనే హైదరాబాద్‌లో హజ్‌హౌస్, కడప, విజయవాడలలో హజ్‌హౌస్‌ల నిర్మాణాలు చేపట్టారన్నారు. వైసీపీ హయాంలో మైనారిటీల అభివృద్ధి శూన్యమన్నారు. మైనారిటీల అభివృద్ధికి షాదీఖానాలు కట్టించింది టీడీపీ హయాంలోనేనని, పట్టణంలోని షాదీఖానాకు వైసీపీ నాయకులు ఏ గతి పట్టించారో అందరికీ తెలుసన్నారు. టీడీపీ హయాంలో పేదల కోసం రంజాన్ తోఫా, విద్యార్థులకు విదేశీవిద్య చంద్రబాబుదేనని అన్నారు. మసీద్‌ల అభివృద్ధికి రూ.25 వేల చొప్పున రూ.35.94కోట్లు చంద్రబాబు కేటాయిస్తే వైసీపీ హయాంలో కేవలం రూ.87 లక్షలు మాత్రమే మంజూరయ్యాయన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి టీడీపీ ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందని అన్నారు. పేదల కోసం దుల్హాన్ పథకం ప్రవేశపెడితే వైసీపీ హయాంలో అనేక ఆంక్షలు పెట్టి పథకాన్ని నీరుగార్చారన్నారు. పట్టణంలో, నియోజకవర్గంలో కందుల నారాయణరెడ్డి ఖబరస్తాన్‌లకు నిధులు కేటాయించి ప్రహరీగోడల నిర్మాణం చేపట్టారన్నారు. వైసీపీ హయాంలోనే మైనారిటీలపై దాడులు పెరిగి కొన్ని కుటుంబాలు ఆత్మహత్యలు చేసుకున్న విషయం కూడా రాష్ట్ర ప్రజలకు గుర్తుందన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు మతపరమైన రాజకీయాలు మానాలని హితవు పలికారు. తమ నాయకుడు కందుల నారాయణరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు మొఘల్ ఫిదా హుస్సేన్ బేగ్, మహబూబ్ బాషా, పటాన్ గులాబ్ ఖాన్, మొఘల్ జాబీర్ హుస్సేన్ బేగ్, షేక్ నూరుల్లా, పఠాన్ హుస్సేన్ ఖాన్, షేక్ చిన్న మౌలాలి, ఆబీద్ బాషా, షేక్ ఆబీద్, షాలీ, మస్తాన్ వలి, నాగూర్ వలి, మహమ్మద్ రహీం, డాక్టర్ షేక్ కాశీం తదితరులు పాల్గొన్నారు.

● తర్లుపాడులో కందుల నారాయణరెడ్డి విస్తృత ప్రచారం

అవకాశం ఇవ్వండి.. మార్కాపురాన్ని అభివృద్ధి చేస్తా

తర్లుపాడు : ఒక్క అవకాశం ఇస్తే మార్కాపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని మార్కాపురం నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని మీర్జాపేట పంచాయతీలోని కారుమానుపల్లె, గొల్లపల్లె, నాగెళ్ల ముడుపు, తాడివారిపల్లెల్లో శుక్రవారం కందుల నారాయణరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లల్లోనే వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసి సాగు, తాగు నీరు అందిస్తామన్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు 85 శాతం పనులు పూర్తి అయితే వైసీపీ ప్రభుత్వం 15 శాతం కూడా పూర్తి చేయకుండా శిలాఫలకాలు వేసుకోవడం సిగ్గుచేటన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉడుముల చిన్నపురెడ్డి, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు కంచెర్ల కాశయ్య, పుచ్చనూతల గోపినాథ్ చౌదరి, మండల యూత్ అధ్యక్షులు మేకల వెంకట్, నాయకులు నరసింహులు, జాను, నారాయణరెడ్డి, చలమారెడ్డి, చిట్టిబాబు, శాంతయ్య, గురవయ్య, శ్రేణులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి, పార్టీలు చేరిన వారికి కండువాలు కప్పుతున్న కందుల

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

పొదిలి : టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమౌతుందని విఘ్నేష్‌రెడ్డి అన్నారు. ఇంటింటికి 'మన కందుల కార్యక్రమం' శుక్రవారం మండలంలోని కంభాలపాడు గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన విఘ్నేష్‌రెడ్డి మాట్లాడుతూ.. జనసేన, బీజేపీ పార్టీలు బలపరిచిన మార్కాపురం టీడీపీ అభ్యర్థిగా కందుల నారాయణరెడ్డి పోటీ చేస్తున్నారన్నారు. కనుక ప్రతి ఒక్కరు కందుల నారాయణరెడ్డిని రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలన్నారు. ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా తన తండ్రి కందుల నారాయణరెడ్డి ప్రజాసేవలోనే ఉన్నారని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రాభివృద్ధి యువతకు భరోసా టీడీపీ పాలనలోనే ఉంటుందనే విషయం గుర్తు చేసుకోవాలని కోరారు. వెలుగొండ ప్రాజెక్ట్, మార్కాపురం జిల్లా ఏర్పాటుకు చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఇంటింటికి తిరుగుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు పథకాలను చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టనున్నారని ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. వెలుగొండ ప్రాజెక్ట్ పూర్తయితే పొదిలి మండలానికి వెలుగొండ జలాలతోపాటు తాగు, సాగునీరు అందించేందుకు కృషి చేస్తారని ఆయన హామీ ఇచ్చారు. ప్రజలు గమనించి రాబోవు ఎన్నికల్లో తమకు మద్దతు పలకాలని ఆయన కోరారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వెలుగొండ ప్రాజెక్ట్ పూర్తి చేసి చంద్రబాబునాయుడు ప్రారంభిస్తారని, మార్కాపురం జిల్లా చేయడమే మొదటి లక్ష్యమన్నారు. కనుక ప్రతి ఒక్కరు ఉమ్మడి ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డిని, మార్కాపురం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా కందుల నారాయణరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో మండల, గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

● డాగ్‌స్క్వాడ్‌తో ఆధారాలు సేకరించిన పోలీసులు



హత్యకు గురైన వెలగల శ్రీనివాసులు

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 26 : మద్యం మత్తులో ఏర్పడిన వివాదంతో ఒకరిని హత్యచేసిన ఘటన మండల కేంద్రం ఎర్రగొండపాలెంలో చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎర్రగొండపాలెం నివాసి వెలగల శ్రీనివాసులు (38) ఎర్రగొండపాలెంలోని త్రిపురాంతకం కూడలి సమీపంలోని ఓ ప్రైవేటు వైద్యశాల సమీపంలో ఉన్నవీధిలో నిర్మాణంలో ఉన్న భవనంలో మద్యం సేవించడానికి వెళ్లారు. ఇదే క్రమంలో శ్రీనివాసులతో పాటు ఇతని సహచురులు కూడా ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇతనితో ఉన్న సహచరుడుతో గొడవ పడి మద్యం మత్తులో శ్రీనివాసులును బలంగా ముఖంపై కొట్టినట్లు పోలీసుల తెలిపారు. దీంతో ముక్కులు, నోటినుంచి రక్తం వచ్చి మృతి చెందాడు. ఘటనపై శుక్రవారం ఉదయం స్థానికులు పోలీసు స్టేషన్‌కు సమచారం ఇవ్వడంతో ఎర్రగొండపాలెం సీఐ రాములునాయక్, ఎస్‌ఐ సుదర్శన్ పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి ఘటన స్థలంలో ఆధారాలు సేకరించారు. ఘటన స్థలం నుంచి డాగ్ పట్టణంలోని ఓ పాత ఇనుము దుకాణానికి వెళ్లింది. అక్కడ పరిశీలించగా, హత్యకు ఉపయోగించిన ఇనుపరాడ్డు దొరికింది. పట్టణంలోని ఓ పారిశుధ్య కార్మికులు ఇక్కడ ఇనుపరాడ్డును విక్రయించినట్లు తెలిసింది. దీంతో రాడ్డును స్వాధీనం చేసుకొని దానికి అంటిన రక్తం మరకలను సీఐ గుర్తించారు. ఘటనలపై లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై హతుని సోదరుడు వెలగల వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాములు నాయక్ తెలిపారు.

పేకాటశిబిరంపై దాడి

బేస్తవారపేట, ఏప్రిల్ 26: బేస్తవారపేట శివారులోని పేకాట శిబిరంపై శుక్రవారం ఎస్సై బీ.నరసింహారావు ఆధ్వర్యంలో పోలీసులు దాడి నిర్వహించారు. అక్కడ పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. రూ.18510 నగదు స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమీక్షలు లేకుండానే ముగిసిన సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ బండి లక్ష్మీదేవి

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 26: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండల సర్వసభ్య సమావేశం ఎలాంటి సమీక్షలు లేకుండా శుక్రవారం ముగిసింది. స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో శుక్రవారం ఎంపీపీ బండి లక్ష్మీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో చందన అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించారు. ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం ఎటువంటి చర్చలు చేయకూడదని ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. సమావేశానికి మండలంలోని వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కారుబోల్తా - ఒకరికి స్వల్పగాయాలు

పొదిలి, ఏప్రిల్ 26 : కారు బోల్తాపడి ఒకరికి స్వల్పగాయాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే సలకనూతల గ్రామ సమీపంలో మోటార్‌సైకిల్‌ను తప్పించబోయి కారు బోల్తాకొట్టింది. ఈప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ప్రభుత్వ వైద్యాధికారి సీతారామిరెడ్డికి స్వల్పగాయాలయ్యాయి. ప్రయాణిస్తున్న కారు ఒక్కసారిగా పల్టీకొట్టిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అయితే అందులో ప్రయాణిస్తున్న సీతారామిరెడ్డికి స్వల్పగాయాలయ్యాయి. కారు పూర్తిగా దెబ్బతిన్నదని వారు తెలిపారు.

ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించండి



ప్రచారం నిర్వహిస్తున్న మాగుంట చందనారెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 26: రాష్ట్రంలో సంక్షేమం, మహిళల అభివృద్ధి జరగాలంటే ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని మాగుంట రాఘవరెడ్డి సతీమణి చందనారెడ్డి అన్నారు. స్థానిక 1వ వార్డులో ఎన్డీఏ కూటమి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి సతీమణి వసంతలక్ష్మీలతో కలిసి శుక్రవారం ఇంటింటికి మన కందుల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ఎన్‌డీఏ అభ్యర్థులు నారాయణరెడ్డి, మాగుంట శ్రీనివాసులరెడ్డిలను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

15 దళిత కుటుంబాలు టీడీపీలో చేరిక

తర్లుపాడు : మండలంలోని మీర్జాపేట పంచాయతీ కారుమానుపల్లె ఎస్సీ కాలనీలో 15 దళిత కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో మురారి మరియదాసు, మురారి అల్లూరయ్య, మూరారి చిట్టి, మురారి నాసరయ్య, మంచా సుబ్బయ్య, మురారి రమణ, మంచా కొండయ్య, మురారి అనిల్, వెంకట లక్ష్మమ్మలతో పాటు మరో ఐదు కుటుంబాలు టీడీపీలో చేరారు. వీరికి కందుల నారాయణరెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

టీడీపీలో చేరిన గిరిజన కుటుంబాలు



టీడీపీలో చేరిన గిరిజన కుటుంబాలతో ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 26 : మండలంలోని గంజివారిపల్లె పంచాయటీలోని గాంధీనగర్, శాంతినగర్ గిరిజనగూడెంలో 25 కుటుంబాలు, కొలుకుల పంచాయతీలోని చెన్నరాయునిపల్లె గ్రామంలో 15 కుటుంబాలు వైసీపీ పార్టీని వీడి మొత్తం 40 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరు ఎర్రగొండపాలెం టీడీపీ కార్యాలయానికి శుక్రవారం రాగా వీరందరికి టీడీపీ కండువాలు వేసి టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు టీడీపీ కండువాలు వేసి ఆహ్వానించారు. వైసీపీపై నమ్మకం పోయి టీడీపీలోకి వస్తున్నారన్నారు. వారి సమస్యలు పరిష్కరిస్తానని ఎరిక్షన్‌బాబు అన్నారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో వైసీపీపై పేద ప్రజలకు నమ్మకం పోయిందని అందరు టీడీపీలోకి వచ్చేందుకు సిద్ధం అవుతున్నారని అన్నారు. గిరిజనులు మాట్లాడుతూ 5 ఐదేళ్లుగా గిరిజనగూడేలలో ఉపాధి పనులు కూడ సక్రమంగా కల్పించలేదన్నారు. తమ గిరిజన గూడెంలలో పక్కాగృహాలు నిర్మించలేదని చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితే గిరిజన గూడెంలు అభివృద్ధి చెందుతాయని గిరిజనులు అన్నారు. ఎస్టీ సెల్ నాయకులు చెవుల అంజయ్య పాల్గొన్నారు.

కంభం పట్టణంలో టీడీపీ విస్తృత ప్రచారం



బస్టాండ్‌లో కార్మికులను ఓటు అభ్యర్థిస్తున్న జగన్నాథరెడ్డి

కంభం, ఏప్రిల్ 26 : ఎన్‌డీఏ కూటమి బలపరచిన ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి గెలుపు కోసం గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సోదరుడు జగన్నాథరెడ్డి శుక్రవారం కంభం పట్టణంలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న ముత్తుముల అశోక్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డిలను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. పట్టణంలోని మెయిన్ బజార్, సంత వీధి, తది తర ప్రాంతాలలో టీడీపీ నాయకులతో కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ ప్రభుత్వం రావాలని కోరారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

20 నామినేషన్లకు ఆమోదం

● ఒక ఇండిపెండెంట్ నామినేషన్ తిరస్కరణ

ఎర్రగొండపాలెం(పుల్లలచెరువు), ఏప్రిల్ 26: మే నెల 13 జరుగునున్న సాధారణ ఎన్నికలకు వై.పాలెం అసెంబ్లీకి 20 నామినేషన్లు ఆమోదం పొందాయి. శుక్రవారం వైపాలెంలోని ఆర్వో కార్యాలయంలో ఆర్వో పి.శ్రీలేఖ నామినేషన్లు పరిశీలించారు. మొత్తం 21 మంది అభ్యర్థులు 43 సెట్ల నామినేషన్లు వేయగా అందులో 20 ఆమోదం కాగా ఇండిపెండెంట్ అభ్యర్థి కొర్రపోలు పిచ్చయ్య ప్రతిపాదకుల ఓటరు సీరియల్ నెంబరు తప్పుగా వుండటంతో నామినేషన్‌కు తిరస్కరించినట్లు ఆర్వో తెలిపారు.అయితే టీడీపీ కూటమీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు, వైసీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ నామినేషన్లును ఆర్వో ఆమోదించారు. ఆ మేరకు అభ్యర్థుల జాబితాను ప్రకటించారు.

ఎన్‌డీఏ కూటమితోనే అందరి సంక్షేమం సాధ్యం

● వైసీపీ పాలనలో వ్యాపార వర్గాలు కుదేలు
● టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి



గిద్దలూరులో ప్రచారం నిర్వహిస్తున్న అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 26 : అన్ని వర్గాల సంక్షేమం ఎన్‌డీఏ కూటమితోనే సాధ్యమవుతుందని ఆ కూటమి గిద్దలూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గిద్దలూరు పట్టణంలో రెండవ రోజు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అశోక్‌రెడ్డికి వ్యాపార వర్గాలు నీరాజనాలు పలికాయి. ఉదయం పట్టణంలోని గాంధీబొమ్మ కూడలి నుంచి పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు, సాయంత్రం అక్కడి నుండి స్టేషన్ రోడ్డు, షరాఫ్ బజార్ ప్రాంతాలలో ముత్తుముల అశోక్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ వ్యాపారస్తులను కలుసు కుని ఈసారి తనకు మద్దతు పలుకాలని, టీడీపీ తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వివరించారు. తాను స్థానికుడినని, ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని స్పష్టం చేశారు. మే 13న జరిగే ఎన్నికలలో గిద్దలూరు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తాను, పార్లమెంటు అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసుల రెడ్డిలను సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో కౌన్సిలర్లు లొక్కు రమేష్, గడ్డం భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్‌యాదవ్, బిల్లా జయలక్ష్మి, పాలుగుళ్ల శ్రీదేవి, కో-ఆప్షన్ సభ్యులు దమ్మాల జనార్ధన్, పట్టణ పార్టీ అధ్యక్షులు షానేషావలి, టీడీపీ నాయకులు దుత్తా బాలీశ్వరయ్య, పాముల వెంకటరమణయాదవ్, బిల్లా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● కంభం పట్టణానికి చెందిన వైసీపీ మైనారిటీ నాయకుడు షేక్ రజాక్‌భాషా తన అనుచరుల తో కలిసి వైసీపీని వీడి టీడీపీలో చేరగా టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

● బేస్తవారపేట మండలం నేకునాంబాద్ గ్రామానికి చెందిన వైసీపీ నియోజకవర్గ కోకన్వీనర్ తిప్పశెట్టి రజనీకాంత్ తన అనుచరులు 20 కుటుంబాలతో వైసీపీకి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరారు. వీరందరకీ ముత్తుముల అశోక్‌రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు.

వ్యాలి వాహనంపై చెన్నకేశవుడు



మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 26: మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి చెన్నకేశవస్వామి వ్యాలి వాహనంపై వామన అలంకారంలో నగరోత్సవంలో నాలుగు మాడవీధులలో విహరించారు. ఉభయదాతలుగా పచ్చర్ల చెన్నకేశవ ప్రసాదు వ్యవహరించారు. ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాలు కల్పించారు. భక్తులు స్వామిని పూజించి కాయకర్పూరం సమర్పించారు.

వైభవంగా గ్రామోత్సవం

గిద్దలూరు, : శ్రీనెమలిగుండ్ల రంగనాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిశాయి. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా నల్లమల అటవీ సమీప గ్రామాలైన జెల్లవారి పుల్లలచెరువులో వైభవంగా స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. ప్రజలు గ్రామోత్సవంలో పాల్గొని రంగనాయక స్వామికి పూజలు నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి రమేష్, కమిటీ గ్రామపెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

కీలు మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం

రవీంద్ర రామకృష్ణారెడ్డి సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో సేవలు



చికిత్స అనంతరం కోలుకున్న రోగితో వైద్యులు

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 26 : ఎర్రగొండపాలెంలోని రవీంద్ర, రామకృష్ణారెడ్డి సూపర్‌స్పెషాలిటీ వైద్యశాలలో ఈ నెల 24న కొర్రా రెడ్యానాయక్ (50) అనే వృద్ధునికి ఎడమ కాలి నడుము కిందభాగంలో తుంటి ఎముక కీలు మార్పిడి శస్త్ర చికిత్సను ఆర్థోపెడిక్ వైద్యుడు పీఎల్ నారాయణ రెడ్డి, జనరల్ సర్జన్ డాక్టరు మన్నెరవీంద్ర, మత్తు వైద్యుడు రాము దిగ్విజయంగా చేశారు. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్‌జిల్లా ఆమ్రాబాద్ మండలం బీకే.లక్ష్మీపురం తాండాకు చెందిన కొర్రా రెడ్యానాయక్‌కు ఎడమ కాలిపై బాగాన నడుము కింద తుంటిఎముక కీలు అరిగి పోయింది. అనారోగ్యంతో హైదరాబాద్‌లో వైద్యశాలకు వెళ్ళారు. అక్కడ రూ.3 లక్షలు ఖర్చు అవుతుందని తెలపడంతో తమ గ్రామంలోని వారి ద్వారా రవీంద్ర, వైద్యశాలకు వచ్చి అడ్మిషన్ పొందారు. రూ.లక్షతో ఆర్థోపెడిక్ డాక్టరు లక్ష్మీనారాయణరెడ్డి తుంటిఎముక కీలు శస్త్రచికిత్స చేశారు. మరుసటి రోజు వైద్యశాల ఆవరణలో నడిపించినట్లు తెలిపారు. 10 రోజుల్లో వైద్యశాల నుంచి డిశ్చార్జ్ చేస్తామని డాక్టరు మన్నెరవీంద్ర తెలిపారు. శస్త్రచికిత్స విజయవంతం కావడంతో రెడ్యానాయక్ కుటుంబసభ్యులు సంతోషంగా ఉండి వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. వెనుక బడిన ప్రాంతంలో ఖరీదైన వైద్యం రూ.లక్షతో పూర్తి చేయడంతో ఆధునిక వైద్య సేవలు మధ్యతరగతి, పేదప్రజలకు ఉపయోగపడుతుందని డాక్టరు రవీంద్ర తెలిపారు.

అవీ..ఇవీ..

మూడు నామినేషన్ల తిరస్కరణ



అభ్యర్థులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్ మీనా

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 26: మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్ల పరిశీలనలో మూడు నామినేషన్‌లు తిరస్కరణకు గురయ్యాయి. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నామినేషన్ల పరిశీలించారు. సబ్ కలెక్టర్ రాహుల్ మీనా ఈ నామినేషన్లు తిరస్కరించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తరపున నుంచి నామినేషన్ వేసిన షేక్ సైదాకు ఇచ్చిన బీ.ఫాం రద్దు చేసి సయ్యద్ జావిద్ అన్వర్‌కు బీఫాం ఇచ్చింది. దీంతో సైదా నామినేషన్ తిరస్కరించినట్లు తెలిపారు. వైసీపీ అభ్యర్థి అన్నా రాంబాబు సతీమణి అన్నా దుర్గాకుమారి, టీడీపీ కూటమి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి తండ్రి నారాయణరెడ్డికి చెందిన నామినేషన్లు తిరస్కరించినట్లు సబ్ కలెక్టర్ తెలిపారు. మిగిలిన 29 మంది అభ్యర్థులకు చెందిన నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు పాల్గొన్నారు. మార్కాపురం నియోజకవర్గానికి సంబంధించి పోటీలో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి, వైసీపీ అభ్యర్థి అన్నా వెంకటరాంబాబు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సయ్యద్ జావీద్ అన్వర్లతో పాటు స్వతంత్ర అభ్యర్థులు, పలు పార్టీలకు చెందిన అభ్యర్థులు ఉన్నారు. నామినేషన్ల పరిశీలనలో దర్శి మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల ఎన్నికల అధికారి అర్విండ్ కురేష్, సహాయ ఎన్నికల అధికారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు నామినేషన్లకు అనర్హత



అభ్యర్థులతో మాట్లాడుతున్న ఆర్వో నాగజ్యోతి

గిద్దలూరు, ఏప్రిల్ 26 : గిద్దలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 28 నామినేషన్లు దాఖలు కాగా వివిధ కారణాలతో నలుగురి నామినేషన్లను రిటర్నింగ్ అధికారిణి నాగజ్యోతి తిరస్కరించారు. అభ్యర్థులు, వారి ప్రతినిధుల సమక్షంలో నామినేషన్ల పరిశీలన చేపట్టారు. వైసీపీ డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన కుందురు కల్పన, టీడీపీ డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన ముత్తుముల పుష్పలీల, స్వతంత్ర అభ్యర్థులు సీహెచ్‌వీ.ఉమామహేశ్వరరావు, శింగరి సత్యనారాయణ నామినేషన్లను వివధ కారణాలతో రిటర్నింగ్ అధికారిణి తిరస్కరించారు. మొత్తం 28 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా నలుగురి నామినేషన్లను అధికారులు తిరస్కరించడంతో మిగతా 24 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు ప్రకటించారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి



ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పిస్తున్న ఎస్పీ

కంభం, ఏప్రిల్ 26 : ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలని జిల్లా అడిషనల్ ఎస్పీ శ్రీధర్‌రావు సూచించారు. మే 13న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ శ్రీధర్‌రావు శుక్రవారం కంభం, అర్థవీడు పోలీసుస్టేషన్ల పరిధిలోని గ్రామాలను సందర్శించి ప్రజలకు ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఓటుహక్కు ప్రాధాన్యత గురించి ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. ఎన్నికల వేళ ప్రజలు ఘర్షణలకు దూరంగా ఉండాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా జరిగేలా చూడాలని కోరారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కంభం సీఐ రామకోటయ్య, కంభం, అర్థవీడు ఎస్సైలు రాజేష్, అనిత, సిబ్బంది పాల్గొన్నారు.

జనరల్ అబ్జర్వర్ పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న మెహతా

గిద్దలూరు, ఏప్రిల్ 26 : గిద్దలూరు రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఎన్నికల జనరల్ అబ్జర్వర్ మయూర్ కే మెహత పరిశీలించారు. నామినేషన్లు జరిగిన తీరును, ఎన్నికల కోసం చేపడుతున్న ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. సెయింట్ పాల్స్ బీఈడీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీ లించి బందోబస్తును పెంచాలని సూచించారు. రిటర్నింగ్ అధికారి డి.నాగజ్యోతి, సహాయ ఎన్నికల అధికారి సిద్దార్థ, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన

కొమరోలు, ఏప్రిల్ 27: మండలంలోని 41 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామని ఏరియా నోడల్ అధికారి రాజు తెలిపారు. స్థానిక కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పోలింగ్ కేంద్రాలను మండల ఎన్నికల పరిశీలకురాలు రాజశ్రీతో కలసి శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటర్లకు వసతులు కల్పించేందుకు గదుల్లోని సామాగ్రిని సవరించి ఉంచాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో అన్ని వసతులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీరి వెంట వీఆర్వోలు రమణారావు, పాండు, నాయబ్, కార్యదర్శి సురేష్, శ్రీనివాసులు ఉన్నారు.

పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి



ఏర్పాట్లపై సమీక్షిస్తున్న చంద్రశేఖర్

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 26: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సుల ప్రవేశాలకు నిర్వహించే పాలిసెట్ పరీక్షను రేపు నిర్వహిస్తున్నట్లు పాలిసెట్ సమన్వయకర్త కే.చంద్రశేఖర్ తెలిపారు. జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆయన మాట్లాడారు. మార్కాపురం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, సాధన జూనియర్ కళాశాల, డాక్టర్ శ్యామ్యూల్ జార్జ్ ఇంజనీరింగ్ కళాశాలలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఉదయం 9.30గంటల నుంచే విద్యార్థులను పరీక్షా కేంద్రాలలోకి అనుమతిస్తారన్నారు. 11గంటల తర్వాత అనుమతి లేదన్నారు. పరీక్షల వివరాలకు హెల్ప్‌లైన్ నెంబర్ 9505518286కు సంప్రదించాలన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

» అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో వెలిగొండను పూర్తిచేస్తాం
» పీసీపల్లిని ఆయకట్టు పరిధిలోకి చేరుస్తాం
» టీడీపీ కూటమి అభ్యర్థులు మాగుంట, ఉగ్ర

పీసీపల్లి, ఏప్రిల్ 26: చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే అన్నిప్రాంతాల్లో అభివృద్ధి జరుగుతుందని టీడీపీ కూటమి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులు రెడ్డి, కనిగిరి అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మండలంలోని పెద అలవలపాడు, పీసీపల్లి, పెదయిర్లపాడు గ్రామాల్లో శుక్రవారం రాత్రి వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట మాట్లాడుతూ జిల్లాలోనే వెనుకబడిన ప్రాంతమైన కనిగిరి నియోజకవర్గంలో గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ట్రిపుల్‌ఐటీ నిర్మాణం కోసం శంకుస్థాపన చేస్తే, జగన్మోహన్‌రెడ్డి ఒక్క ఇటుకైనా పెట్టి నిర్మాణం చేపట్టలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించి అధికారంలోకి వచ్చి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కాగానే ఆరు నెలల్లో వెలుగొండ ప్రాజెక్టు పూర్తిచేయడంతో పాటు త్వరితగతిన ట్రిపుల్‌ఐటీ నిర్మాణం పూర్తిచేస్తామని చెప్పారు. వెలుగొండ ఆయకట్టు పరిధిలో పీసీపల్లి మండలాన్ని కూడా చేరుస్తామన్నారు. డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైన మూడు నెలల్లోనే నిమ్జ్‌ను ఏర్పాటుచేసి అభివృద్ధి చేస్తా మన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే పాలేటిపల్లి చెరువును నిర్మించినట్టు గుర్తుచేశారు. ఇటీవల దిగుమతై వచ్చిన కొంతమంది నాయకులు కనిగిరి ప్రాంతంలో ఉన్న వైట్‌క్వార్ట్జ్‌లపై అప్పుడే కన్నేశారన్నారు. కనిగిరి నియోజకవర్గంలో అభివృద్ధి జరగాలంటే స్థానికుడైన తనకు, ఎంపీగా పోటీ చేస్తున్న మాగుంట శ్రీనివాసరెడ్డిలకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమణయ్య, రహీముల్లా, నాగరాజు, వేమూరి రామయ్య, మాదిరెడ్డి కొండారెడ్డి, గడ్డం బాలసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.


ప్రచార రథంపై నుంచి మాట్లాడుతున్న మాగుంట, ఉగ్ర


మాగుంట, ఉగ్రల రోడ్‌షోకు తరలివచ్చిన ప్రజలు


వెలిగండ్ల: ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన ఎస్సీ కుటుంబాలు

కూటమితోనే మైనారిటీల అభివృద్ధి

కనిగిరి, ఏప్రిల్ 26: ఎన్డీఏ కూటమితోనే మైనార్టీల అభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో శుక్రవారం మైనార్టీల సంక్షేమాన్ని కాంక్షిస్తూ ప్రవేశపెట్టనున్న పథకాల వివరాల కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ వైసీపీ పాలనలో మైనార్టీలు సంక్షేమానికి దూరమయ్యారన్నారు. ముస్లింల సంక్షేమానికి కేంద్రం విడుదల చేసిన నిధులను కూడా పక్కదోవ పట్టించి వైసీపీ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ముస్లింల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలుచేసినట్టు గుర్తు చేశారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకులు రోషన్‌సందాని, గుడిపాటి ఖాదర్, బారాయిమాం, షరీఫ్, ఖాదర్‌వలి, బడేబాయి, మిన్నూ, జానీ తదితరులు పాల్గొన్నారు.

వెలిగండ్లలో 16 కుటుంబాలు చేరిక

వెలిగండ్ల, ఏప్రిల్ 26: వెలిగండ్ల మండలంలో వలసల పరంపర కొనసాగుతూనే ఉన్నది. తాజాగా 16 ఎస్సీ కుటుంబాలు కూటమి అభ్యర్థి డాక్టర్. ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సమక్షంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. రామలింగాపురం ఎస్సీ కాలనీకి చెందిన 12 కుటుంబాలు, మరపగుంట్ల పంచాయతీకి చెందిన 4 ఎస్సీ కుటుంబాలు కనిగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఉగ్ర సమక్షంలో పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను రద్దుచేసి ఎస్సీల పొట్ట కొట్టిందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, కొండు భాస్కర్ రెడ్డి, గజ్జల భాస్కర్‌రెడ్డి, గజ్జల రామలక్ష్మణ, యద్ల కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని వీడిన మాజీ సర్పంచ్

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 26: సీఎస్‌పురం మండలం చెన్నపునాయునిపలి మాజీ సర్పంచ్ చిట్టిబోయిన వెంకటేశ్వర్లు యాదవ్ వైసీపీని వీడి టీడీపీలో చేరారు. శుక్రవారం కనిగిరిలోని క్యాంపు కార్యాలయంలో వెంకటేశ్వర్లు యాదవ్‌కు టీడీపీ కూటమి అభ్యర్థి ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమలంలో మాజీ ఎంపీపీ టి.పెద అల్లురయ్య, ఎస్‌సీ మాలకొండయ్య, వెంట్రామరాజు, మన్నెపల్లి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.


నామినేషన్లను పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి లోకేశ్వరరావు

దర్శిలో 22 నామినేషన్లు తిరస్కరణ

» 21 ఆమోదం.. ప్రధాన రాజకీయ పార్టీలవీ ఓకే!

దర్శి, ఏప్రిల్ 26: దర్శి అసెంబ్లీకి దాఖలైన నామినేషన్ల పరిశీలన శుక్రవారం పూర్తయింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎంవీవీఎస్ లోకేశ్వరరావు ఆధ్వర్యంలో పరిశీలన జరిగింది. మొత్తం 43 నామినేషన్లు దాఖలు కాగా, 21 నామినేషన్లు ఆమోదం పొందినట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా లేకపోవటంతో 22 నామినేషన్లు తిరస్కరించినట్లు తెలిపారు. నామినేషన్ల ప్రక్రియలో 22మంది అభ్యర్థులు 43 నామినేషన్లు వేసిన విషయం తెలిసిందే. ప్రధాన రాజకీయ పార్టీలైన టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, బహుజన సమాజ్ పార్టీల అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లు ఆమోదం పొందాయి. అధికశాతం స్వతంత్ర అభ్యర్థులు వేసిన నామినేషన్లు సక్రమంగా లేకపోవటంతో తిరస్కరించారు. పరిశీలన కార్యక్రమం ప్రశాంతంగా పూర్తయినట్లు రిటర్నింగ్ అధికారి లోకేశ్వరరావు తెలిపారు.

కనిగిరిలో 14 నామినేషన్లు తిరస్కరణ

కనిగిరి, ఏప్రిల్ 26: కనిగిరి అసెంబ్లీకి 27 మంది అభ్యర్థులు 39 నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆర్ఓ జాన్‌ఇర్విన్ తెలిపారు. శుక్రవారం జరిగిన పరిశీలనలో 14 నామినేషన్‌లు తిరస్కరణకు గురయ్యాయి. 13 నామినేషన్లను ఆమోదించినట్టు తెలిపారు.

తెలుగుదేశం పార్టీ నుంచి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, వైసీపీ నుంచి దద్దాల నారాయణ, బీఎస్పీ నుంచి తాతపూడి ప్రభుదాసు, భారతజాతీయ కాంగ్రెస్ పార్టీ నుంచి దేవరపల్లి సుబ్బారెడ్డి, ఇండియన్ ముస్లింలీగ్ పార్టీ నుంచి షేక్ అల్లాబక్ష్ నామినేషన్‌లను ఆమోదించినట్టు తెలిపారు. అలాగే, పిరమిడ్‌ఆఫ్‌ఇండియా పార్టీ నుంచి అల్లారయ్య, సమాజ్‌వాదీపార్టీ నుంచి షేక్ నజీర్‌బాషా, లిబరేషన్ కాంగ్రెస్‌పార్టీ నుంచి దమ్ము వెంకటేశ్వర్లు, ఇండిపెండెంట్ అభ్యర్థులు కె.ఖర్షీద్, షేక్ మస్తాన్‌వలి, దొరడ్ల రాజారావు, ముపర్లపాటి షాంశీర్‌బాషా, షేక్ సుబాహాన్ నామినేషన్లను ఆమోదించినట్టు ఎన్నికల అధికారి తెలిపారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు సహకరించాలి


మాట్లాడుతున్న డీఎస్పీ అశోక్‌వర్ధన్‌రెడ్డి

దొనకొండ, ఏప్రిల్ 26: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు గ్రామాల్లో ప్రతిఒక్కరూ బాధ్యతగా సహకరించాలని దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్‌రెడ్డి సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని గంగదేవిపల్లి, దొండపాడు, ఇండ్లచెరువు, కొచ్చెర్లకోట గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా గొడవలు, కొట్లాటలకు దూరంగా సోదరభావంతో ఉండాలన్నారు. ఎన్నికల్లో ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు గురికాకుండా, ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. గ్రామాల్లో ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ప్రవర్తిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎటువంటి సంఘటనలు తలెత్తినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. త్రిపురాంతకం సీఐ సుబ్బారావు, ఎస్సై సంపత్‌కుమార్ తదిత రులు పాల్గొన్నారు.

19 మంది వలంటీర్లు రాజీనామా

దర్శి, ఏప్రిల్ 26: మండలంలో 19మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. బొట్లపాలెంకు చెందిన 10మంది, లంకోజనపల్లికి చెందిన 9 మంది వలంటీర్లు రాజీనామాలను ఎంపీడీవో మనుమంతరావుకు అందజేశారు. అధికార పార్టీ రాజకీయ క్రీడలో భాగంగా తొలుత దర్శి పట్టణంలోని వలంటీర్లు రాజీనామా చేశారు. ప్రస్తుతం గ్రామాలకు చెందినవారు దశలవారీగా చేస్తున్నారు.

ముండ్లమూరులో 13 మంది..

ముండ్లమూరు, ఏప్రిల్ 26: మండలంలోని పెద ఉల్లగల్లుకు చెందిన 13 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. ఎంపీడీవో శంకరరావుకు రాజీనామా పత్రాలను అందజేశారు. ఆయా గ్రామాల్లో ఉన్న నాయకులు వీరిని తీసుకెళ్లి రాజీనామా చేయించినట్టు సమాచారం.

63 మద్యం బాటిళ్లు పట్టివేత

పామూరు, ఏప్రిల్ 26: పట్టణంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై ఎస్ఐ ఎం.సైదుబాబు తన సిబ్బందితో దాడిచేసి 63 బాటిళ్లను శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికలవేళ మద్యాన్ని అక్రమంగా సిద్ధం చేసుకుంటున్న తరుణంలో పోలీసులు మెరుపుదాడులు చేస్తున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కురిచేడులో ఇంటింటి ప్రచారం

కురిచేడు, ఏప్రిల్ 26: కురిచేడులో తెలుగుదేశం పార్టీ నాయకులు, కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి తల్లి, మహిళలు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పిడతల నెమిలయ్య, కాట్రాజు నాగరాజు, మొఘల్ మస్తాన్ వలి, గడ్డం బాలయ్య, మేరువ పెద్దిరెడ్డి, జనసేన నాయకుడు సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

'గంగమ్మ తల్లి'కి రూ.2 లక్షల ఆదాయం

తాళ్లూరు, ఏప్రిల్ 26: గుంటిగంగ తిరునాళ్ల సందర్భంగా గంగాభవానీ అమ్మవారి దేవాలయానికి ఎన్నికల కోడ్ కారణంగా భక్తులతాకిడి తక్కువగా ఉండటంతో ఆదాయం కూడా తగ్గింది. గతంలో రాజకీయ నేతలు విద్యుత్తు ప్రభలు ఏర్పాటు చేసి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో భక్తుల రద్దీ అధికంగా ఉండేది. భక్తులు అమ్మ వారిని దర్శించుకుని హుండీలో కానుకలు సమర్పించే వారు. దీంతో ఆదాయం సమకూరేది. ఈసంవత్సరం తిరునాళ్ల సందర్భంగా రూ.2లక్షల 3వేల 930 ఆదాయం వచ్చింది. తిరునాళ్ల ముగిసినందున శుక్రవారం గంగమ్మతల్లి హుండీని, వచ్చిన ఆదాయాన్ని అధికారులు లెక్కించారు. కార్యక్రమంలో కందుకూరు ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఈవో పి.కార్తిక్, ఆలయకమిటీ ఛైర్మన్ కొసనా గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

బార్ అండ్ రెస్టారెంట్‌లో తనిఖీలు

కనిగిరి, ఏప్రిల్ 26: కనిగిరిలో బార్ అండ్ రెస్టారెంట్‌లో శుక్రవారం రాత్రి ఆర్వో జాన్‌ఇర్విన్ ఆధ్వర్యంలో ఆకస్మికంగా స్క్వాడ్ బృందం తనిఖీలు నిర్వహించింది. స్క్వాడ్ బృందం అధికారి దానియేలు నేతృత్వంలో బృందం స్టాక్ వివరాలను సేకరించింది. ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశ్వసనీయ సమాచారంలో భాగంగా సమయపాలన, మద్యం అదనపు సరుకుపై ప్రత్యేకంగా విచారణ చేపట్టినట్లు ఆర్వో తెలిపారు. పూర్తి వివరాలను తెలియజేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

దర్శి, ఏప్రిల్ 26: మండలంలోని రాజంపల్లి పంచాయతీలోని ముసినది వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పొదిలి మండలం కుంచేపల్లికి చెందిన పాశెం రామాంజనేయరెడ్డి (29) మోటార్ సైకిల్‌పై దర్శికి వచ్చి పనులు చూసుకుని తిరిగి వెళుతున్నాడు. ఈక్రమంలో ముసినది వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన యువకుడిని పొదిలి ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. దర్శి ఎస్సై సుమంత్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రబాబుతోనే యువతకు ఉపాధి అవకాశాలు

పామూరు, ఏప్రిల్ 26: చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ హయాం లోనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. తెలుగుయువత మండల అధ్యక్షుడు ఉప్పలపాటి హరిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి యువతకు ఉద్యోగ ఉపాధి కోసం బాబును మళ్ళీ రప్పిద్దాం కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తే 20 లక్షల మంది యువతకు ఉపాధి, నిరుద్యోగులకు యువగళం నిధి నుంచి నెలకు రూ.3 వేలు భృతి అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జి.దశరథరాములు, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, షేక్ ఖాజారహంతుల్లా, సయ్యద్ అమీర్‌బాబు, ఎం.రమణయ్య, బి.మార్కు, పులి నాయబ్, కంచర్ల శ్రీను, దేవరపు మాల్యాద్రి, వీరబాబు పాల్గొన్నారు.

అరాచక పాలనకు రోజులు దగ్గరపడ్డాయి..

» మహిళా శక్తి టీడీపీ కూటమిని గెలిపిస్తుంది
» దర్శి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, ఏప్రిల్ 26: వైసీపీ అరాచక, అసమర్థ పాలనకు రోజులు దగ్గరపడ్డాయని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. మండలంలోని చెరువుకొమ్ముపాలెం, తూర్పువీరాయపాలెం, బొట్లపాలెం, పాపిరెడ్డిపాలెం గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. చెరువుకొమ్ముపాలెంలో గజమాలతో సత్కరించారు. హారతులిచ్చి పూలవర్షం కురిపించారు. తూర్పువీరాయపాలెంలో వందలాది మంది మహిళలు పసుపురంగు వస్త్రాలు ధరించి, టీడీపీ జెండాలు చేత పట్టి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో మహిళా శక్తి టీడీపీ కూటమిని గెలుపిస్తుందని చెప్పారు. ఎక్కడకు వెళ్లినా మహిళలు అధికసంఖ్యలో తనకు ఆదరణ చూపుతున్నారన్నారు. చంద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే విషయం ప్రజలు గుర్తించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చిట్టే వెంకటేశ్వర్లు, మాజీ అధ్యక్షుడు బొట్లా కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురు చేరిక

కురిచేడు, ఏప్రిల్ 26: కురిచేడు మండలంలోని పలు గ్రామాలకు చెందినవారు శుక్రవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. పడమర గంగవరం, పడమర నాయుడు పాలెం, కురిచేడు వాల్మీకి బజారులోని వారు కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి భర్త లలిత్ సాగర్ సమక్షంలో పార్టీలో చేరారు. పడమర నాయడుపాలెం గ్రామాకి చెందిన గడ్డం శ్రీను, మరికొంతమంది గడ్డం బాలయ్య ఆధ్వర్యంలో చేరారు. పడమరగంగవరం గ్రామంలో టీడీపీ నాయకుడు దాసరి ఏడుకొండలు ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరారు. కురిచేడు వాల్మీకి బజారుకు చెందిన సీనియర్ నాయకులు బొనిగల అంకయ్య ఆధ్వర్యంలో పలువురు చేరారు. పార్టీలో చేరినవారిలో అనకొండ చిన్న వెంకయ్య, ఆదినారాయణ, నల్లబోతుల నాగయ్య, రవి, బొనిగల గోపి, నల్లబోతుల నరసింహులు, తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పిడతల నెమిలయ్య, కాట్రాజు నాగరాజు, డాక్టర్ సునీల్, ఫౌండ్రి సుభాని, నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీతో సహా పలువురు చేరిక

దర్శి, ఏప్రిల్ 26: టీడీపీలోకి వలసల పర్వం కొనసాగుతుంది. తాజాగా మండలంలోని రాజంపల్లి ఎంపీటీసీ గొర్ల వీరయ్యతో పాటు మరో పది కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మీ భర్త లలిత్‌సాగర్ వారికి పార్టీ కండవాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. మాజీ ఎంపీపీ ఫణిదపు వెంకటరామయ్య ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షుడు వజ్జా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ చైర్‌పర్సన్ స్వగ్రామంలో 25 కుటుంబాలు

తాళ్లూరు, ఏప్రిల్ 26: టీడీపీలో చేరికలు మండలంలో జోరందుకున్నాయి. ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి తనయుడు రాఘవరెడ్డి, కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి భర్త లలిత్‌సాగర్ తాళ్లూరు మండలంపై ప్రత్యేక దృష్టి సారించి చేరికలు చేపట్టారు. శుక్రవారం బొద్దికూరపాడు, నాగంబొట్లపాలెం గ్రామాల్లో వారు పర్యటించారు. ఈసందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ స్వగ్రామమైన బొద్దికూరపాడులో బీసీ పాఠశాల ఛైర్మన్ బూచిరాజు సురేంద్ర, స్కూల్ మాజీ ఛైర్మన్ బూచిరాజు రవి, వైసీపీ సోషల్ మీడియా కోకన్వీనర్ కావూరి చిన్న, మొలక నరసింహతో పాటు 25 కుటుంబాలు వైసీపీని వీడారు. నాగంబొట్లపాలెంలో మాజీ ఎంపీటీసీ ఎబేల్‌రాజు, మాజీ డీలర్ శనివారపు కోటిరెడ్డి, పెద కోటయ్యతో పాటు మరికొందరు వైసీపీని వీడారు. వీరికి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వా నించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్నివర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే కూటమి ప్రభుత్వం రావాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ టి.శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, పోలంరెడ్డి రమణారెడ్డి, వేడికోల లక్ష్మిరెడ్డి, శాగం కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


దర్శి: గజమాలతో టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి స్వాగతం పలుకుతున్న చెరువుకొమ్ముపాలెం గ్రామస్థులు


తాళ్లూరు: మాగుంట రాఘవరెడ్డి, లలిత్‌సాగర్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు

ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తాం

ముండ్లమూరు, ఏప్రిల్ 26: ఆదర్శ నియోజకవర్గంగా దర్శిని అభివృద్ధి చేస్తామని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సోదరుడు భరత్ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని పసుపుగల్లు, చింతలపూడి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి లక్ష్మికి ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగర్ చివరి భూములకు సాగర్ జలాలు రాని సమయంలో తన తండ్రి నరసయ్య రాత్రింబవళ్లు కాలువలపై పర్యటించి చివరి భూములకు నీరు అందించారన్నారు. తాత హనుమంతరావు ఎత్తిపోతల పథకాలు మంజూరు చేయించి బీడు భూములను సాగులోకి తీసుకు వచ్చారన్నారు. కార్యక్రమంలో నేతలు కూరపటి శ్రీనివాసరావు, వరగాని పౌలు, పిచ్చిరెడ్డి, సుబ్బారెడ్డి, పొందుగుల నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాగా, మండలంలోని పోలవరం గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు కొర్రపాటి నాగేశ్వరరావు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. గొట్టిపాటి లక్ష్మి సోదరుడు భరత్ ఆయనకు టీడీపీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రతిఒక్కరికీ స్వీయ రక్షణ అవసరం

» డీఎస్పీ రామరాజు
» విన్యాసాలను తిలకించిన ఎంపీ మాగుంట


స్వీయ రక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న స్వాట్ టీమ్

కనిగిరి, ఏప్రిల్ 26: ప్రతి వ్యక్తికి స్వీయ రక్షణ అవసరమని డీఎస్పీ రామరాజు అన్నారు. స్థానిక పామూరు బస్టాండు సెంటరులో శుక్రవారం స్వాట్ బృందం చేసిన విన్యాసాలను ప్రజలు తిలకించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఓటు హక్కు వినియోగంలో జరిగే అవాంతరాలు, ఆపదల నుంచి రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం స్వాట్ బృందాన్ని ఏర్పాటుచేసిందని చెప్పారు. అందులోభాగంగా రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గ క్రేంద్రంతో పాటు బూత్‌ల వద్ద స్వాట్ టీం ఉంటుందన్నారు. ప్రజలు తమ ఓటును ప్రశాంతంగా వేసుకునేందుకు వీలుగా ఈ బృందం పర్యవేక్షిస్తుందన్నారు. ఓటు హక్కు వినియోగంలో అభ్యర్థి కానీ, ఆయన వ్యక్తులు కానీ ఓటరును ఇబ్బందులకు గానీ, దాడులకు గానీ పాల్పడినా వారిపై చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఓటు హక్కు వినియోగించుకుని వారి నివాసాలకు వెళ్ళే సమయంలో శత్రువులు ఎవరైనా దాడులకు పాల్పడితే తమను తాము అప్పటికప్పుడు రక్షించుకునే విధానాన్ని విన్యాసాల ద్వారా ప్రజలకు తెలియజేశారు

కాగా, స్థానిక పామూరు బస్టాండు సెంటరులో విన్యాసాలు జరుగుతున్న సమయంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి రాజకీయ ప్రచారం నిమిత్తం కనిగిరి నుంచి పామూరు వెళ్తున్నారు. ఈసమయంలో ఎంపీ మాగుంట ఆయన కాన్వాయ్ వాహనంలో నుంచి కిందకు దిగి ప్రజలతో కలసిపోయి విన్యాసాలను తిలకించారు. విన్యాసాలు చేసిన బృందాన్ని, పోలీసులను అభినందించారు. ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ త్యాగరాజులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా చూడాలి


నామినేషన్ల స్క్రూటినిలో పాల్గొని వివరాలు తెలుసుకుంటున్నా ఎన్నికల పరిశీలకుడు అరవిందకుమార్ చౌరశ్యా

దర్శి, ఏప్రిల్ 26: సార్వత్రిక ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని ఎన్నికల పరిశీలకుడు, ఐఏఎస్ అధికారి డాక్టర్ అరవిందకుమార్ చౌరశ్యా అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఈఆర్‌వో కార్యాలయంలో ఎన్నికల నామినేషన్ల స్క్రూటిని కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు దర్శి అసెంబ్లీకి దాఖలైన నామినేషన్ల వివరాలను పరిశీలించిన తరువాత తుది జాబితా వివరాలను తెలియజేశారు. ఈసందర్భంగా అరవిందకుమార్ చౌరశ్యా మాట్లాడుతూ ఓటర్లు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతకుముందు ఎన్నికల వ్యయపరిశీలకుడు విద్యాన్ దర్శిలో పర్యటించారు. రిటర్నింగ్ అధికారి లోకేశ్వరరావు ఆయన్ను కలిసి అడిగిన వివరాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.సుజాత, డిప్యూటీ తహసీల్దార్ ఏవీ రవిశంకర్, ఎన్నికల డీటీ దేవప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు ఓటేస్తే మళ్లీ విధ్వంసమే!

పామూరు, ఏప్రిల్ 26: వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి ఓటేస్తే రాష్ట్రంలో మళ్లీ విధ్వంసమేనని టీడీపీ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. విజ్ఞులైన ఓటర్లు ఆలోచించి కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని కోడిగుంపుల, బొట్లగూడూరు, గ్రామాల్లోలో శుక్రవారం రాత్రి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాగుంట, ఉగ్ర కుటుంబాలు అధికారం ఉన్నా, లేకపోయినా సేవాదృక్పథం కలిగినవని అన్నారు. ఈ కుటుంబాలను ఆదరిస్తే మీ ప్రాంతాల అభివృద్ధితో పాటు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి మన్ననలు పొందుతామన్నారు. వైసీపీ పాలనలో దగా పడిన ఆంధ్రుల భవిషత్తుకు గ్యారెంటి ఇస్తూ చంద్రబాబు ప్రవేశపెట్టిన ఆరు పథకాలతో ఆర్థిక ప్రయోజనం కలుగుతుందన్నారు. కార్యక్రమాల్లో నాయకులు పువ్వాడి వెంకటేశ్వర్లు, కోటచిన వెంకటేశ్వర్లు, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, వై.బాల, కోటపాటి విశాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కాగా, పామూరు పట్టణంలో శుక్రవారం రాత్రి జరగాల్సిన పర్యటన రద్దయింది. ఎన్నికల ప్రవర్తన నిమావళిని అనుసరిస్తూ సమయం లేనందున పామూరులో జరగాల్సిన మాగుంట, ఉగ్రల రోడ్‌షోను రద్దు చేశారు.

టీడీపీ చేరిన సర్పంచ్ సుబ్బయ్య యాదవ్

పామూరు, ఏప్రిల్ 26: మండలంలోని వగ్గంపల్లి సర్పంచ్ దేవనబోయిన సుబ్బయ్య యాదవ్ వైసీపీని వీడి టీడీపీలో చేరారు. శుక్రవారం రాత్రి శేషమహాల్‌లో జరిగిన కార్యక్రమంలో టీడీపీ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మాగుంట, ఉగ్ర సమక్షంలో పార్టీలో చేరారు. సుబ్బయ్య యాదవ్‌కు టీడీపీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. గత శాసనసభ ఎన్నికల్లో బుర్రకు అత్యంత ఆప్తుడుగా ఉన్న సుబ్బయ్య యాదవ్ వైసీపీని వీడటంతో మండలంలో ఆపార్టీకి భారీ షాక్ తగిలి నట్లైంది. ప్రస్తుతం వైసీపీ నాయకులు అనుసరిస్తున్న తీరు నచ్చక టీడీపీపై ఉన్న భరోసాతో భేషరతుగా మాగుంట ఉగ్రకు మద్దతు ఇవ్వడానికి టీడీపీలో చేరినట్లు సుబ్బయ్య తెలిపారు. సర్పంచ్ సుబ్బయ్యతోపాటు అతని అనుచరులు 12 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో పువ్వాడి వెంకటేశ్వర్లు, ఎం.గంగరాజుయాదవ్, భైరెడ్డి జయరామిరెడ్డి, గోళ్ల వెంకటేశ్వర్లు, ఉప్పలపాటి హరిబాబు, బీజేపీ నేత కేవీ రమణయ్య, మస్తాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.


మాగుంట, ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన సర్పంచ్ సుబ్బయ్యయాదవ్, ఆయన వర్గీయులు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

శనివారం 27 ఏప్రిల్ 2024



రేపల్లె : జగనన్న కాలనీలో బిల్లులు రాకపోవటంతో నిలిచిపోయిన గృహాలు




గుంటూరులోని జగనన్న కాలనీలో పునాదులకు కూడా నోచుకోని వైనం.

జగనన్న ఊళ్లు పునాదుల్లోనే..

కాలనీలు కాదు.. ఊళ్లను నిర్మిస్తున్నాం అని ఆర్భాటంగా సీఎం జగన్ ప్రకటించి నాలుగేళ్లు అవుతున్నా కాలనీలు ఊళ్లుగా మారలేదు కాని చిట్టడవులను తలపిస్తున్నాయి. నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పేరుతో జగన్ ప్రభుత్వం చేసిన హడావుడి ప్రకటనలకే పరిమితమైందని జగనన్నకాలనీల్లోని క్షేత్రస్థాయి పరిస్థితులు చూస్తే అర్థమవుతోంది. ఇళ్లు నిర్మించి ఇచ్చే విషయంలో ప్రభుత్వం పిల్లిమొగ్గలు వేసి మెలిక పెట్టడంతో లబ్ధిదారులు నిర్మాణాలపై వెనుకంజ వేశారు. ఇప్పటికీ చాలాకాలనీల్లో రోడ్లు లేవు.. డ్రెయిన్లు లేవు.. తాగునీరు, కరెంటు లేదు. పేరుగొప్ప, ఊరుదిబ్బ అనుచందంగా జగనన్నకాలనీలు ఉన్నాయి. ఇల్లు కట్టుకోకుంటే స్థలం పోతుందని.. లేదంటే మరొకరికి ఇచ్చేస్తామని లబ్ధిదారులను బెదిరించి మరీ ఇళ్లను నిర్మించుకునేలా అధికారులు చేసినా పెద్దగా నిర్మాణాలు సాగలేదు. కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు.. ఇల్లు కట్టుకున్న తర్వాత నివాసం ఉండేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించటంలో అధికారులు విఫలమయ్యారు.

నెరవేరని పేదల సొంతింటి కల

- చిట్టడవుల్లా మారిన జగనన్న కాలనీలు
- కట్టిస్తామని మడమ తిప్పిన సీఎం జగన్
- బిల్లుల జాప్యంతో బేస్‌మెంట్ల స్థాయిలోనే ఇళ్లు
- ఇంకా పూర్తికాని మౌలిక సదుపాయాల కల్పన
- సగం కాలనీల్లో స్థలాల మెరక, అప్రోచ్ రోడ్లే కరువు
- పేరుగొప్ప, ఊరుదిబ్బ అనుచందంగా జగనన్న కాలనీలు



రూపాయి ఇవ్వకుండా గొప్పలు


పేదలందరికీ ఇళ్ల నిర్మాణం పేరుతో రూపాయి కూడా ఇవ్వకుండా తామే ఇళ్ల నిర్మించి ఇస్తున్నట్లు జగన్ ప్రచారం చేసుకున్నారు. కేంద్రం ద్వారా ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలు ఇవ్వగా వాటిని జగన్ ప్రభుత్వం తన ఖాతాలో వేసుకుని, అది తానే ఇచ్చినట్లు లబ్ధిదారులకు ప్రచారం చేసుకుంది. ఇళ్లు తామే నిర్మించి ఇస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటోంది. ఒక్క రూపాయి కూడా పేదోడి ఇంటి కోసం ఖర్చు చేయని ప్రభుత్వంగా సీఎం జగన్ నిలిచిపోయారని పలువురిలో అసహనం వ్యక్తమవుతోంది.



వేమూరు: వెల్లబాడులో బీడుగా మారిన ఇళ్ళ స్థలాలు



వేమూరు : అబ్బనగూడవల్లిలో జగనన్న కాలనీ ఇళ్ల పరిస్థితి



వినుకొండ : వెంకుపాలెం వద్ద జగనన్న కాలనీలో నిర్మాణంలో ఇళ్ళు

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్, ఏప్రిల్ 26: 'పేదలకు సొంతింటి కల నెరవేరుస్తా. పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తా. వాటిని అక్క చెల్లెమ్మల పేరు మీదే రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తా..' అని పేదల ఇళ్ల నిర్మాణంపై జగన్ ఇచ్చిన హామీ అమలు అంతంతమాత్రంగానే ఉంది. హామీ ఇచ్చి ఏళ్లు గడిచినా జగనన్న కాలనీలు ఇంకా చాలావరకు అందుబాటులోకి రాలేదు. పేదలకు ఇంటిని ప్రభుత్వమే కట్టిస్తుందని, కాలనీల్లో సకల సౌకర్యాలు కల్పిస్తుందని తొలుత సీఎం జగన్ ప్రకటించారు. అయితే జగనన్నకాలనీల ప్రారంభోత్సవం అనంతరం లబ్ధిదారులే కట్టుకోవాలని ఒత్తిడి తెచ్చారు. అయితే చాలామంది ఆసక్తి చూపలేదు. ఎన్నికలు సమీపిస్తుండటంతో గత నవంబరులో కొద్ది మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి పేదల సొంతింటి కల నెరవేర్చినట్లు ప్రకటించుకుంది. క్షేత్ర స్థాయిలో పేదల ఇళ్ల నిర్మాణం పురోగతి అధోగతిలో ఉంది. మొత్తం నిర్మాణ లక్ష్యంలో నాలుగోవంతు కూడా పూర్తి చేయలేకపోయారు. మిగిలిన ఇళ్ళ నిర్మాణం నత్తనడకన సాగుతోంది. ఇళ్ల నిర్మాణ లక్ష్యాలను సాధించడంలో ప్రభుత్వం చతికిల పడింది. కాలనీలకు మౌలిక వసతుల కల్పనలో తీవ్ర జాప్యంతోనే నిర్మాణాలు సక్రమంగా సాగలేదని తెలుస్తోంది. పలు కాలనీల్లో పూర్తయిన ఇళ్లల్లో నివాసం ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయి. మౌలిక వసతుల కల్పన జరగకపోవడం, ఊరికి దూరంగా కాలనీలు ఉండటం, రవాణా సౌకర్యం లేక పోవడం తదితర అంశాలతో అక్కడకు వెళ్లి పెద్ద మొత్తంలో వెచ్చించి ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. అధికారులు ఎన్ని ఒత్తిళ్ల తెచ్చి ఇళ్ల నిర్మాణాలు చేయించినా సకాలంలో బిల్లులు రాక చాలాఇళ్లు బేస్‌మెంట్ స్థాయిలోనే నిలిచిపోయాయి. ఇప్పటికే అప్పులు పాలయ్యాం ఇక తమ వల్ల కాదని లబ్ధిదారులు వెనుకంజ వేశారు. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా అనేక జగనన్న కాలనీలు పిచ్చి చెట్లతో అధ్వానంగా మారాయి. కాలనీ లల్లో అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్మాణం, విద్యుత్, తాగునీరు తదితర సౌకర్యాల విషయంలో తీవ్ర జాప్యం జరిగింది. వర్షం కురిస్తే రహదారులు తటాకాలను తలపిస్తున్నాయి. జగన్ ప్రతి పక్ష నేతగా హామి ఇచ్చిన మేరకు రూ 5 లక్షలు ఇచ్చారా? అంటే లేదు, ఇంటి నిర్మాణానికి తగ్గట్టుగా వ్యయాన్ని పెంచలేదు. ఇంటి నిర్మాణ వ్యయం భారీగా పెరిగి ఇల్లు కట్టుకోవడం లబ్ధిదారులకు సాధ్యం కాలేదు. దీంతో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు నాలు గేళ్లుగా ముందుకు సాగలేదు.



రేపల్లె : జగనన్న కాలనీలో బిల్లులు రాకపోవటంతో నిలిచిపోయిన గృహాలు

- రేపల్లెలో 3,008 మందికి స్థలాలు కేటాయించగా 1800 ఇళ్ల నిర్మాణం జరిగింది. బిల్లులు రాక 1208 గృహాలు వివిధ దశల్లో ఆగిపోయాయి. ఇక నిర్మించుకున్న గృహాలకు నేటికి రహదారుల నిర్మాణం చేపట్టలేదు. తాగునీటి సరఫరా, డ్రెయినేజీ వ్యవస్థ లేదు.
- వేమూరు నియోజకవర్గంలోని 89 గ్రామాల్లో 15,590 మంది లబ్ధిదారులకు జగనన్న కాలనీల్లో స్థలాలు కేటాయించారు. ఇల్లు కట్టుకోమని చెప్పారు. కానీ వీరిలో కేవలం 2421 మంది మాత్రమే నిర్మాణాలు చేపట్టగలిగారు. 3123 మంది లబ్ధిదారులు బేస్మెంట్ లెవల్ నిర్మాణం వరకే చేపట్టి వదిలేశారు. 299మంది రూఫ్ లెవల్ నిర్మాణం చేశారు.
- అద్దంకి పట్టణానికి 2 నుంచి 4 కిలోమీటర్ల దూరంలోని బొమ్మనంపాడురోడ్డు, నాగులపాడురోడ్డు, వేలమూరిపాడు రోడ్డులోని జగనన్న లేఅవుట్లలో సుమారు 2 వేల మందికి స్థలాలు ఇచ్చారు. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభిస్తే మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పి ఝులక్ ఇచ్చారు. దీంతో ఇళ్ల నిర్మాణం పూర్తయినా నివాసయోగ్యంగా లేకపోవడంతో అద్దె ఇళ్లల్లోనే ఉంటున్నట్లు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




బాపట్ల : కర్లపాలెం మండల కేంద్రంలోని జగనన్నకాలనీలో గృహాలు నిర్మించకుండా ఉన్న ఖాళీ స్థలాలు.

* బాపట్లలో ప్యాడిసన్‌పేట, బేతనీకాలనీ, మూలపాలెం రోడ్డులో జగనన్నలేఅవుట్లలో 3,400మందికి స్థలాలు ఇచ్చారు. అందులో ఇప్పటి వరకు 1800 గృహ నిర్మాణాలు పూర్తి చేశారు. కాలనీలలో రోడ్లు, తాగునీరు లేవు. కొంతమంది గృహాలు నిర్మించుకోవడానికి తెచ్చుకున్న అప్పులు తీర్చలేక వడ్డీ పెరిగిపోయి విక్రయించే పరిస్థితి ఏర్పడింది. ఖాళీ స్థలాలు చేతులు మారాయి. బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలల్లో నాలుగు వేల మందికి స్థలాలు ఇవ్వగా అక్కడ కూడా ఇదే పరిస్థితి.



అద్దంకి: బొమ్మనంపాడు రోడ్డులోని కాలనీ వద్ద చిల్లచెట్లు

స్ర్కూటినీ.. ఉత్కంఠ



- తెనాలి వైసీపీ అభ్యర్థి శివకుమార్ తన నామినేషన్‌తోపాటు సమర్పించిన అఫిడవిట్ ఫారం-26
- నోటరీ చేసిన సంతకం 23వ తేదీతో ఉంటే, నిర్థారిస్తూ శివకుమార్ చేసిన సంతకం 24వ తేదీతో ఉన్న దృశ్యం

- వైసీపీ నామినేషన్లు తిరస్కరించాలని డిమాండ్
- శివకుమార్ నామినేషన్ ఆమోదంపై ఈసీకి టీడీపీ ఫిర్యాదు
- మురళీకృష్ణ నామినేషన్ ఆమోదంపై కోర్టుకు వెళ్తాం : నరేంద్ర

తెనాలి, పొన్నూరులో అభ్యంతరాలు

తెనాలి(ఆంధ్రజ్యోతి), పొన్నూరుటౌన్, ఏప్రిల్ 26: సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన స్ర్కూటినీ శుక్రవారం ఆయా లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో జరిగింది. స్ర్కూటినీ అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో జరిగింది. అయితే గుంటూరు జిల్లా పొన్నూరు, తెనాలి, బాపట్ల జిల్లాలోని చీరాల అసెంబ్లీ స్థానాలకు సంబంధించిన నామినేషన్ల స్ర్కూటినీలో ఉత్కంఠ నెల కొంది. తెనాలి, పొన్నూరు వైసీపీ అభ్యర్థుల నామినేషన్లపై టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తెనాలిలో కాంగ్రెస్ తరపున ఇద్దరు నామినేషన్లు వేయగా వారి నామినేషన్లు తిరస్కరకు గురయ్యాయి. ఇక గుంటూరు పశ్చిమ, వినుకొండ లో వైసీపీ అభ్యర్థుల నామినేషన్లపై కొన్ని అభ్యంతరాలు వచ్చాయి.

వేర్వేరు తేదీల్లో అన్నాబత్తుని సంతకాలు

తెనాలి వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సమర్పించిన నామినేషన్‌లో వేర్వేరు తేదీల్లో సంతకాలు ఉండటంపై టీడీపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆయన నోటరీ చేసిన సంతకం ఒక తేదీతో, అభ్యర్థి సమర్పించిన నామినేషన్ పత్రాల్లో మరో తేదీతో సంతకాలు ఉన్నాయని ఇది ఎన్నికల నియమావళికి విరుద్ధమని తేల్చారు. ఈ నెల 23వ తేదీతో నోటరీ సంతకం ఉండగా, అభ్యర్థి సంతకం ఈ నెల 24వ తేదీతో ఉందని అభ్యంతరం చెప్పిన టీడీపీ నాయకులు దానిని తిరస్కరించాలని ఆర్‌వోకు సూచించారు. అయితే స్ర్కూటినీ అనంతరం ఆ నామినేషన్‌ను అనుమతించినట్లు ఆర్‌వో ఆన్‌లైన్‌లో పెట్టేశారు. దీనిపై టీడీపీ ఎన్నిల సంఘానికి ఫిర్యాదు చేయగా ఈసీ ఏవిధమైన నిర్ణయం తీసుకుంటుందనే దానిపై ఉత్కంఠత నెలకొంది. అయితే శివకుమార్ భార్య పుష్ప స్వతంత్ర అభ్యర్థిగా చివరి రోజు దాఖలు చేసిన నామినేషన్ చెల్లుబాటైనట్లు ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు.

మురళీకృష్ణ ఆస్తుల వివరాలపై అభ్యంతరం

పొన్నూరు వైసీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ తన అఫిడవిట్‌లో భార్య, కుమార్తె ఆస్తుల వివరాలు అందచేయలేదని ఆయన నామినేషన్‌ను తిరస్కరించాలని టీడీపీ నాయకులు తెలిపారు. నోటరీ చేసిన వ్యక్తి అనుమతి గుంటూరుకే పరిమితమైనందున అది చెల్లదని ఫిర్యాదు చేశారు. తాము లేవనెత్తిన అభ్యంతరాల మేరకు అంబటి నామినేషన్‌ను తిరస్కరించకుండా ఆమోదించినందున కలెక్టర్‌కు, సీఈవో, న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్లు నరేంద్రకుమార్ స్పష్టం చేశారు.

గజదొంగ అంబటి : ధూళిపాళ్ల

పొదుపు మహిళలకు చెందిన రూ.2.5 కోట్లను తన సొంత ఖాతాలకు మళ్లించుకుని కాజేసిన గజదొంగ అంబటి మురళీకృష్ణ అని పొన్నూరు టీడీపీ అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్రకుమార్ విలేకర్ల సమావేశంలో ఆరోపించారు. వనిత భారతీ, బాపట్ల మహిళా, భావపురి మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ థ్రిఫ్ట్ సొసైటీలు, రత్నమణి మహిళా మ్యాక్స్ లిమిటెడ్ వంటి సొసైటీల్లో మహిళలు దాచుకున్న నగదును మురళీకృష్ణ రుణాల పేరుతో సొంత ఖాతాలకు మళ్లించుకున్నారన్నారు. ఆయన దాఖలు చేసిన అఫిడవిట్‌లోనే ఈ అంశాలను పొందుపరిచినట్లు చెప్పారు. అంబటి నామినేషన్‌లో పలు అభ్యంతరాలపై తాము ఫిర్యాదు చేసినా అధికారులు ఆమోదించడం సరికాదన్నారు. బీ ఫారం సమర్పించలేదని స్వయంగా అభ్యర్థి చెప్పినా తానే ఎక్కడో పెట్టినట్లు ఆర్వో నింద తనమీద వేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల అధికారులు వైసీపీ నేతల ఒత్తిడికి లొంగిపోయారని ఆరోపించారు.




నామినేషన్ల పరిశీలనకు హాజరైన నరేంద్ర కుమార్, మురళీ

తెనాలిలో కాంగ్రెస్ గాయబ్

తెనాలిలో కాంగ్రెస్ తరపున ఇద్దరు వేసిన నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. మొదట తెలంగాణకు చెందిన బషీద్ షేక్‌ను తెనాలి అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థిగా షర్మిల ప్రకటించి ఎన్నికల ప్రచార సభలో ఆయనను గెలిపించాలని కోరారు. అయితే ఆయన నామినేషన్ వేసిన తర్వాత తమ అభ్యర్థి ఆయన కాదని, స్థానికంగా ఇప్పటి వరకు ఆ పార్టీ వ్యవహారాలు చూస్తున్న డాక్టర్ చందు సాంబశివుడినే ఖరారు చేశారు. చివరి రోజున ఆయన హడావిడిగా నామినేషన్ వేశారు. అయితే బషీద్ ఓటు తెలంగాణలో ఉండటంతో ఆయన నామినేషన్‌ను స్ర్కూటినీలో అధికారులు తిరస్కరించారు. రెండో అభ్యర్థిగా రంగంలోకి దిగిన సాంబశివుడు నామినేషన్ బీ ఫారం విషయంలో తిరస్కరణకు గురైంది. దీంతో కాంగ్రెస్ అభ్యర్థులు ఎవరూ రంగంలో లేకుండాపోయారు.

రజిని, బొల్లా నామినేషన్లపై అభ్యంతరాలు



నామినేషన్‌లో తప్పుడు సమాచారాన్ని అందించిన పత్రం

గుంటూరు పశ్చిమ వైసీపీ అభ్యర్థి మంత్రి విడదల రజిని, వినుకొండ సిట్టింగ్ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు నామినేషన్లపై పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. వారి నామినేషన్ తప్పులతడక అని తెలిపారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా రజిని ఇష్టం వచ్చినట్లు అఫిడవిట్‌ను మార్చి వేశారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు మండిపడ్డారు. అమెరికా పౌరసత్వం కలిగిన రజిని భర్త కుమారస్వామి నిబంధనలకు విరుద్ధంగా చిలకలూరిపేటలో భూమి కొనడం చట్ట విరుద్ధమన్నారు. రజిని ఆదాయం లక్షల్లో ఉంటే రూ.కోట్లతో ఆస్తులు ఎలా కొనుగోలు చేస్తుందో చెప్పాలన్నారు. సాక్ష్యాధారాలతో అభ్యంతరాలు చెప్పినా రజిని నామినేషన్ ఆమోదంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామన్నారు.

- బొల్లా బ్రహ్మనాయుడు నామినేషన్‌లో తప్పుడు అఫిడవిట్ దాఖలు చేశారని రిటర్నింగ్ అధికారికి గురువారం ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా ఆమోదించారని న్యాయవాదులు మూర్తి, గోపీనాథ్, జైభారత్ అభ్యర్థి చిరంజీవినాయక్ తెలిపారు. విద్యార్హత విషయంలో తేడాలు ఉన్నాయని, కేసుల అంశాలు ప్రస్తావించలేదని తెలిపారు. బొల్లా నిశాని అయితే ఇంగ్లీష్‌లో ఎలా సంతకం చేశారని, సంతకం నేర్చుకొని ఉంటే న్యాయమూర్తి చేత అఫిడవిట్ చేసి ఆర్వోకు నామినేషన్ పత్రంతో అందించాల న్నారు. వీటిపై త్వరలో హైకోర్టులో పిటీషన్ వేస్తామని తెలిపారు.

ఇద్దరు ఎన్నికల పరిశీలకులు..



నీరజ్ కుమార్ కార్తీక

గుంటూరు సిటీ, ఏప్రిల్ 26: జిల్లా లోని ఏడు నియోజకవర్గాలకు కేంద్ర ఎన్నికల కమిషన్ ఇరువురు పరిశీలకులను శుక్రవారం నియమించింది. ఐఏఎస్ నీరజ్‌కుమార్ మంగళగిరి, పొన్నూరు, తెనాలి అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల పరిశీలకులుగా నియమితులయ్యారు. ఎన్నికల ఏజంట్లకు, ఓటర్లకు నీరజ్ కుమార్ ఫోన్ నెంబరు 9154882127లో అందు బాటులో ఉంటారని పత్రికా ప్రకటనలో తెలిపారు. మరో ఐఏఎస్ కార్తీక తాడికొండ, ప్రత్తిపాడు, గుంటూరు వెస్ట్, గుంటూరు ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల పరిశీలకులుగా వచ్చారు. ఆమె ఫోన్ నెంబరు 9154882128లో అందుబాటులో ఉంటారు.

నేడు గుంటూరులో 3కే రన్

- పాల్గొనున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 26: సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా ఓటు వినియోగించుకుంటున్న యువతకు అవగాహన కల్పించడానికి నగరంలో శనివారం 3కే రన్ నిర్వహిస్తున్నారు. ముఖ్య అతిధి గా రాష్ట్ర చీఫ్ ఎన్నికల కమిషనర్ ముఖేష్ కుమార్ మీనా, విశిష్ట అతిధులుగా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, జేసీ రాజకుమారి, ఎస్పీ తుషార్ డూడి, కమిషనర్ చేకూరి కీర్తి, లెట్స్ ఓట్, నేషనల్ కన్వీనర్ ప్రొఫెసర్ కే సుబ్బరంగయ్య పాల్గొంటారని కలెక్టరేట్ అధికారులు తెలిపారు. 3కే రన్ ఉదయం 6 గంటలకు ఎన్టీఆర్ స్టేడియం వద్ద ప్రారంభమై మదర్ థెరిస్సా విగ్రహం, కొరిటెపాడు, ఐటీసీ హోటల్ మీదగా తిరిగి స్టేడియం వద్దకు చేరుకుంటుందని అధికారులు పేర్కొన్నారు.

నీటి పథకాలకు వైసీపీ ఎగనామం

- పనులు పూర్తికాక ఇబ్బందులు
- పూర్తి స్థాయిలో సరఫరాకాని నీరు
- రెండ్రోజులకోసారి రంగుమారినవి విడుదల
- ప్రజల ఆందోళన
- అధికారులు, పాలకవర్గం పర్యవేక్షణ కరువు

అద్దంకి, ఏప్రిల్ 26 : అద్దంకి పట్టణంలో మంచినీటి సరఫరాలో రెండున్న దశాబ్దాల క్రితం పరిస్థితులు మరలా వచ్చాయా అన్న భయం మళ్లీ మొదలైంది. రెండున్నర దశాబ్దాల కిందట పట్టణ అవసరాలకు సరిపడా నీటి సరఫరా లేదు. వేసవి కాలం వస్తే ఊటబావులలో నీటి లభ్యత లేక తాగు నీటి సరఫరాకు తీవ్ర ఇబ్బందులు వచ్చేవి. అప్పటి మేజర్ పంచాయతీ సర్పంచ్‌గా నందిరెడ్డి శ్రీనివాసరావు తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించి పొలాలలో ప్రత్యేకంగా బోర్లు వేసి తాగు నీటి కష్టాల నుంచి పట్టణ ప్రజలను గట్టెక్కించారు. అనంతరం పెద్దగా నీటి సమస్య ఉత్పన్నం కాలేదు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అద్దంకి పట్టణానికి రాబోయే నాలుగైదు దశాబ్దాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని సుమారు రూ.85కోట్లతో మంచినీటి పథకానికి నిధులు కేటాయించి పనులు కూడా ప్రారంభించారు. గత ఐదేళ్ల కాలంలో అధికార వైసీపీ ఆ పనులు పూర్తి చేయడంలో పూర్తిగా విఫలమైంది. దీనికి తోడు అద్దంకి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో (గతంలో పంచాయతీ కార్యాలయం) నాలుగు దశాబ్దాల కిందట నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్ పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో నీటిని ట్యాంక్‌కు ఎక్కించకుండా నేరుగా సరఫరా చేస్తున్నారు. అదే సమయంలో కాకాని పాలెం ట్యాంక్‌కు నీటిని పంపింగ్ చేసే మోటార్‌లు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. రామ్‌నగర్ ట్యాంక్‌కు నీటి సరఫరా చేసే పైప్ లైన్‌లు తరచూ పోతున్నాయి. దీంతో తరచూ నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. రామ్‌నగర్ ట్యాంక్ పరిధిలో కొన్ని ప్రాంతాలలో ఇటీవల కాలంలో రోజు మార్చి రోజు నీటిని ఇస్తున్నారు. అదే సమయంలో గతంలో విడుదల చేసే నీటిలో సగం కూడా విడుదల కావడం లేదు. దీంతో పక్షం రోజులుగా అద్దంకి పట్టణంలో నీటి కష్టాలు ఏర్పడ్డాయి.

రంగుమారిన నీరు సరఫరా

అసలే అంతంత మాత్రంగా సరఫరా అవుతున్న నీటికి తోడు రంగుమారిన నీరు వస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సాధారణ అవసరాలకు కూడా ఇవి వాడుకునేలా లేకపోవడంతో పారబోస్తున్నారు. ప్రధానంగా మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఉన్న ట్యాంక్ పరిధిలో నీరు ట్యాంక్‌కు పంపింగ్ చేయకుండా నేరుగా వదులుతుండడంతో రంగు మారిన నీరు వస్తోందని ప్రజలు వాపోతున్నారు. పైపులలో పేరుకు పోయిన మట్టి నీటిలో కలుస్తుండడంతో ఇలా వస్తున్నట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తరచూ పైప్‌లైన్‌లలో లో పేరుకుపోయిన మట్టి, మలినాలను బయటకు వదిలి వేసేలా చూసాక నీటిని విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. మున్సిపల్ అధికారులతో పాటు పాలకవర్గం కూడా పర్యవేక్షణ లేకపోవడంతో వారం రోజులుగా రంగుమారిన నీరు సరఫరా అవుతుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంచినీటిని పూర్తిస్థాయిలో సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



అద్దంకిలో మున్సిపల్ కార్యాలయం ట్యాంక్ పరిధిలో కుళాయిల ద్వారా వస్తున్న రంగు మారిన నీరు



గొట్టిపాటికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న కమల్‌కిషోర్

అభివృద్ధి కోసం గొట్టిపాటిని గెలిపించాలి

బల్లికురవ, ఏప్రిల్ 26 : రెండు దశాబ్దాలుగా ప్రజా సేవలో ఉంటూ గ్రామ గ్రామాన పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టిన ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను గెలిపించాలని యువనేత గొట్టిపాటి కమల్‌కిషోర్ (బాబీ) కోరారు. శుక్రవారం మండలంలోని కొప్పెరపాలెం గ్రామంలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బాబీ ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేని ఫెస్టోను ప్రజలకు వివరించారు. జగన్‌రెడ్డికి ఒక్క చాన్స్ ఇచ్చి అన్నివర్గాల ప్రజలు నష్టపోయారన్నారు. అభివృద్ధి కోసం, సంక్షేమం కోసం టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని బాబీ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు కోట శ్రీనివాసరావు, చల్లగుండ్ల వీరాంజనేయులు, యర్రా అంజయ్య, కోట వసంతరావు, తుబాటి కిషోర్, బత్తుల ఆజంయ్య, గొర్రెపాటి ఆదాం, ఒట్టిగొర్ల గురవయ్య పాల్గొన్నారు.

టీడీపీ నేతల ఇంటింటి ప్రచారం

మండలంలోని వల్లాపల్లి గ్రామంలో ఆగ్రామ టీడీపీ నేత పరుసు ప్రేమప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంచుతూ అవగాహన కల్పించారు. జగన్‌రెడ్డి నవరత్నాలతో నవ మోసాలకు పాల్పడ్డారని, వైసీపీని ఓటుతో ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పత్తిపాటి వెంకట్రావు, మందా వీరాంజనేయులు, మహేష్ పాల్గొన్నారు.

విధ్వంసం తప్ప .. అభివృద్ధి లేదు



మహాలక్ష్మి కాలనీలో ప్రచారం చేస్తున్న కూటమి నాయకులు

చినగంజాం, ఏప్రిల్ 26 : వైసీపీ ఐదేళ్ల పాలనలో విధ్వంసం తప్ప అభివృద్ధి ఎక్కడా లేదని టీడీపీ తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆసోది సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని పెదగంజాం గామంలోని ఎస్సీ కాలనీ, చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని మహాలక్ష్మి, ప్రభుదేవా కాలనీలలో టీడీపీ కూటమి పర్చూరు అసెంబ్లీ, బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థులు ఏలూరి సాంబశివరావు, టి.కృష్ణప్రసాద్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరుతూ కూటమి నాయకులు శుక్రవారం విస్తృతంగా ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తూ ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు రాయని ఆత్మారావు, చెరుకూరి రాఘవయ్య, టీ.జయరావు, మోటుమర్రి రామసుబ్బారావు, నరహరి శ్రీనివాసరావు, షేక్ జిలాని, షేక్ ఖాజావలి, ఎం.లక్ష్మయ్య, ధర్మవరపు ఏసునారాయణ, పి.పార్థసారిథి, పీ.శ్రీనివాసరావు, నరహరి గోపి, ఎం.పద్మావతి, చేవూరి రవణమ్మ, టి.చిన్నా, జి.వెంకటనారాయణ, టి.వెంకటేశ్వరావు, షేక్.బాజీ, ఎం.రామాంజనేయులు అహ్మద్, ఎస్.సూరిబాబు, అమిర్జాన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చినగంజాం, ఏప్రిల్ 26 : మండలంలోని సోపిరాల, మున్నంవారిపాలెం గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ పి.గణనారాయణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సోపిరాల, మున్నంవారిపాలెం గ్రామాల్లో విద్యుత్ లైనులకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయునున్నట్లు తెలిపారు. గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్యవైశ్యులకు జే ట్యాక్స్ దెబ్బ

- వైసీపీ పాలనలో వ్యాపారాలు, పరిశ్రమలు నాశనం
- అందరికీ అండగా ఉంటాం
- టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి



15వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

అద్దంకి, ఏప్రిల్ 26 : చిరు వ్యాపారులకు, దినసరి కూలీలకు టీడీపీ అండగా ఉంటుందని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఉదయం అద్దంకి పట్టణంలోని 15వ వార్డు, రాత్రి మండలంలోని కొటికలపూడిలో ఎమ్మెల్యే పర్యటించారు. ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా గొట్టిపాటి మాట్లాడుతూ వైసీ పీ అధికారం చేపట్టిన తరువాత అద్దంకి పట్టణం, బల్లికురవ, మేదరమెట్లలో రోడ్లకు ఇరువైపులా చిరు వ్యాపారుల భవనాలు ఇష్టారీతిన ఖాళీ చేయించి వారి పొట్టకొట్టారన్నారు. ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండించామన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ నుంచి ఈ ఐదేళ్లలో ఒక్క రూపాయి లబ్ధి చేకూరలేదన్నారు. కేంద్రం తెచ్చిన ఈబీసీ చట్టంలో ఆర్యవైశ్యులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కషిచేస్తానన్నారు. పేద ఆర్యవైశ్యులకు టీడీపీ పాలనలో కేటాయించిన టిడ్కో ఇళ్లు, రేషన్ కార్డులు వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రద్దు చేసిందన్నారు. పేద ఆర్యవైశ్యుల విద్యార్థుల విదేశీ విద్య అందించడానికి కార్పొరేషన్ ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించేలా టీడీపీ చర్యలు తీసుకుంటుందన్నారు. జగన్ అండ్ కో జే ట్యాక్స్ విధానాల కారణంగా ఆర్యవైశ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. రకరకాల పన్నులతో వ్యాపారులను వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్యవైశ్యులు స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకునే అవకాశం కల్పిస్తామన్నారు. ఆర్యవైశ్యులలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ పాలన ఉంటుందన్నారు. పేదలు, మహిళలకు ప్రత్యేక పథకాల ద్వారా మరింత లబ్ధి చేకూరుస్తామన్నారు. ముందుగా కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొటికలపూడిలో రైతులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో రైతులకు తీరని అన్యాయం జరిగిందని రవికుమార్ అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి రైతుకు ఏటా రూ.20వేల ఆర్థిక సాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు చిన్ని శ్రీనివాసరావు, కౌన్సిలర్ అంకం తేజశ్విని, చుండూరి మురళి, గట్టుపల్లి రామారావు, కొటికలపూడి సర్పంచ్ పూనాటి విక్రమ్, మాజీ సర్పంచ్ వెంకట్రావు పాల్గొన్నారు.



5వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న హర్షవర్ధన్

యువతకు ఉద్యోగాల కల్పనే ధ్యేయం

గొట్టిపాటి హర్షవర్ధన్

యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే టీడీపీ ధ్యేయమని గొట్టిపాటి రవికుమార్ తనయుడు హర్షవర్ధన్ అన్నారు. శుక్రవారం రాత్రి అద్దంకి పట్టణంలోని 5వ వార్డులో హర్షవర్ధన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అందించే పథకాలను వివరించారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గార్లపాటి శ్రీనివాసరావు, వడ్లవల్లి పూర్ణ చంద్రరావు, చిలుకూరి అనిల్, కిరణ్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల పరిశీలన

పర్చూరు, ఏప్రిల్ 26 : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులు దాఖలు చేసుకున్న నామినేషన్ల స్రూట్నీ (పరిశీలన) ప్రక్రియ శుక్రవారం రెవెన్యూ కార్యాలయ పాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎన్నికల పరిశీలకులు ఖాజాన్‌సింగ్ (ఐఏఎస్), రిటర్నింగ్ అధికారి గందం రవీందర్ ఆధర్యంలో అధికారులు నామినేషన్ పత్రాలను పరిశీలించారు. పర్చూరు అసెంబ్లీకి సంబంధించి 20 మంది అభ్యర్థులకు గాను 35 నామినేషన్ పత్రాలు దాఖలయ్యాయి. వాటిలో మూడు నామినేషన్‌లు సరైన పత్రాలు జమచేయకపోవడంతో తిరస్కరించినట్లు కార్యలయం సిబ్బంది తెలిపారు. అందులో దీపక్ గోపాలం (యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ), షైలా నాగలక్ష్మి (భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ), శ్యానం సురేష్ (జై భీమ్‌రావ్ భారత్ పార్టీకి) సంబంధించి నామినేషన్ చెల్లుబాటు కానివిగా అధికారులు ధ్రువీకరించారు. కార్యక్రమంలో పర్చూరు తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య, కారంచేడు మెహర్‌బాబు, చినగంజాం ఫణీంద్రబాబు, ఇంకొల్లు ప్రమీలా, మార్టూరు తహసీల్దార్ సంధ్యశ్రీ, యద్దనపూడి వై.నాగరాజు, అభ్యర్థులు, వారి ప్రతినిధులు పాల్గొన్నారు.



నామినేషన్లను పరిశీలిస్తున్న అధికారులు

ఆమంచి నామినేషన్‌పై ఫిర్యాదు

చీరాల, ఏప్రిల్ 26 : ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ (కాంగ్రెస్) తరపున చీరాల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన ఆమంచి కృష్ణమోహన్ తన అఫడవిట్‌లో వాస్తవాలను పూర్తి స్థాయిలో తెలియరపరచలేదని నాయుడు నాగార్జునరెడ్డి అనే వ్యక్తి శుక్రవారం ఈఆర్వో సూర్యనారాయణరెడ్డికి రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇటీవల నాగార్జునరెడ్డి ఆమంచిపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు కూడా పలు అంశాలకు సంబంధించి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అందుకు సంబంధించిన ఆధారాలను కూడా నాగార్జునరెడ్డి ఈఆర్వోకు అందజేవారు. పరిశీలించి చర్యలు చేపడతామని ఈఆర్వో తెలిపారు.

వైసీపీకి షాక్



ఏలూరి సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన అడుసుమల్లి ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటేశ్వర్లు తదితరులు

- అడుసుమల్లి ఎంపీటీసీ మాజీ సభ్యుడితో సహా 50 కుటుంబాలు టీడీపీలో చేరిక
- పార్టీలోకి ఆహ్వానించిన ఏలూరి

పర్చూరు, ఏప్రిల్ 26 : పర్చూరు మండలం అడుసుమల్లి గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు అడ్డగడ్డ వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో శుక్రవారం పార్టీలో చేరారు. ఆయనకు టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే ఏలూరి కండువా కప్పి ఆహ్వానించారు. అడ్డగడ్డతోపాటు 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ తీర్థంపుచ్చుకున్నాయి. వారిని ఏలూరి ఆహ్వానించారు. మార్టూరు మండలం వలపర్ల గ్రామానికి చెందిన పలువురు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో సైకిలెక్కారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ వచ్చే ఎన్నికలు ఓవ్యక్తి గెలుపు ఓటమి కోసం కాదని, రాష్ట్ర భవిష్యత్‌కు, రాష్ట్ర ప్రయోజనాల కోసమన్నారు. వైసీపీ పాలనలో జరుగుతున్న అరాచక విధ్వంస పాలనకు ప్రజలు తగిన గుణపాఠం చెపుతారన్నారు. ప్రజలు విజ్ఞతతో ఓటు వేయాలని కోరారు.

అడుసుమల్లి గ్రామంలో..

పర్చూరు మండలం అడుసుమల్లి ఎంపీటీసీ మాజీ సభ్యుడు అడ్డగడ్డ వెంకటేశ్వర్లు అధ్వర్యంలో పంగులూరి శ్రీనివాసరావు, గొల్లపూడి సుబ్బారావు, నర్రా దశరథరామయ్య, కట్ట మాణిక్యరావు, నంబూరి గురుప్రసాద్, కొంగర శ్రీరామమూర్తి, ముప్పా కృష్ణారావు, నాయుడు అంకమ్మ చౌదరి, పోట్లుదుత్తి శ్రీనివాసరావు, దుడ్డు కమలాకర్‌రావు, కుంచాపు నరసయ్య, రేగులగడ్డ మోసెస్, రేగులగడ్డ చింపిరయ్య, కలతోటి రవి, కట్ట శశికిరణ్, డేలా జయప్రకాష్, రావి నాగేశ్వరరావు, చెన్నుపల్లి భావనారాయణ, మోతుకూరి వేణుగోపాలరావు, చెన్నుపల్లి శ్రీనివాసరావు, సత్యనారాయణ, మూడావత్ మల్లేశ్వర్‌నాయక్ తదితరులు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరారు.

మార్టూరు గ్రామంలో.. మార్టూరులో ముక్తిపాటి మణికంఠ, అద్దేటి దుర్గ, ముక్తిపాటి అంకమ్మరావు, అద్దేటి గోపి, పేరుస్వాముల రవి, కిరణ్ పేరుస్వాముల హరిబాబు, ముక్తిపాటి సాయిబాబు, బొగ్గవరపు కార్తిక్ వంశీ, నాగండ్ల చంద్రం, ముక్తిపాటి శ్రీ కాంత్ తదితరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

వలపర్ల గ్రామంలో.. మార్టూరు మండలం వలపర్ల గ్రామానికి చెందిన పిల్లలమర్రి అరేంద్ర, సోముల లక్ష్మీనారాయణ, బిట్ర సురేష్, చంద్రయ్య, వెంకటేష్, రామకోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, శ్రీనివాసరావు, మల్లికార్జున, రామాంజనేయులు, శ్రీనివాసరావు, కోటిరత్నం, పుల్లయ్య సైకిలెక్కారు.

ఏలూరికి బ్రహ్మరథం

- ఆకట్టుకున్న ఎడ్లబండి ప్రచారం
- ఘనస్వాగతం పలికిన కుంకలమర్రు గ్రామస్థులు

కుంకలమర్రు(పర్చూరు), ఏప్రిల్ 26 : కారంచేడు మండలం కుంకలమర్రులో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న ఏలూరికి ప్రజలు ఘనస్వాగతం పలికారు. అడుగడుగునా పూలవర్షంతో గ్రామంలోకి సాదరంగా ఆహ్వానించి అభిమానం చాటుకున్నారు. పెద్దఎత్తున మహిళలు తరలి వచ్చి హారతులతో దీవించారు. అభివృద్ధి ప్రదాత మా ఏలూరి అంటూ యువత జేజేలు పలికారు. ఏలూరికి గజమాలతో మహిళలు సత్కరించి అభిమానం చాటుకున్నారు. ఏలూరి ప్రచారానికి పెద్ద ఎత్తున తెలుగుదేశం, జనసేన, బీజేపీ తోపాటు, ఏలూరి అభిమానులు తరలి రావడంతో ప్రధాన వీధులన్నీ జన సంద్రాన్ని తలపించాయి. కార్యక్రమంలో భాగంగా మసీదులో ముస్లింలు ఏలూరి గెలవాలని ప్రత్యేక పూజలు చేశారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఏలూరికి కుంకలమర్రు గ్రామస్థులు అడగడునా నీరాజనాలు పలికారు. మాఓటు మీకేనయ్యా అంటూ వృద్ధులు ఏలూరిని ఆప్యాయంగా పలుకరిస్తూ దీవించారు. ఈ సందర్భంగా ఏలూరి కుంకలమర్రులో ఎడ్లబండిపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు సలగల రాజశేఖర్‌బాబు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ ప్రజా కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



గజమాలతో ఘనస్వాగతం పలుకుతున్న మహిళలు



అభయాంజనేయుని విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ

మార్టూరు, ఏప్రిల్ 26 : మండలంలోని ద్రోణాదుల గ్రామ శివార్లలో శుక్రవారం స్వర్గీయ గోరంట్ల సాంబశివరావు తోటలో శ్రీ అభయంజనేయస్వామి శిలా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చింతపల్లిపాడు గ్రామానికి చెందిన ఆచార్యులు నారాయణం శ్రీనివాసాచార్యులు, నారాయణ వెంకట సందీప్‌దీక్షిత్ ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శిలా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వ హించారు. ద్రోణాదుల ప్రజానీకంతో పాటు నాగండ్ల, సూదివారిపాలెం గ్రామస్థులు కార్యక్రమానికి విచ్చేసి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. తరువాత భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు.

వైభవంగా వీరాంజనేయస్వామి తిరునాళ్ల



బల్లికురవ, ఏప్రిల్ 26 : మండలంలోని అంబడిపూడి గ్రామంలో ఉన్న వీరాంజనేయస్వామి 41వ వార్షిక తిరునాళ్ల శుక్రవారం వైభవంగా జరిగింది. భక్తులు ఉదయం నుంచే వీరాంజనేయస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక అభిషేకాలు, ఆకు పూజలలో పాల్గొన్నారు. దేవాలయ పూజారి గుడిమెళ్ల పవన్‌కుమార్ పర్యవేక్షణలో వీరాంజనేయస్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్థులు పొంగళ్లు పెట్టుకొని మెక్కుబడులు తీర్చుకొన్నారు. గ్రామ పెద్దల సహకారంతో తిరునాళ్ల సందర్భంగా కోలాట భజన కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరునాళ్లకు అంబడిపూడి గ్రామంతో పాటు పరిసనర గ్రామాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు.

వైకల్యం బలాదూర్

జేఈఈ మెయిన్స్‌లో 1759 ర్యాంక్ సాధించిన ఓంకార్ వరుణ్



పంగులూరు, ఏప్రిల్ 26: చదువుకు వైకల్యం అడ్డుకాదని నిరూపించాడు ఓంకార్ వరుణ్. మండలంలోని రామకూరు గ్రామానికి చెందిన చీమకుర్తి ఓంకార్ వరుణ్ జేఈఈ మెయిన్స్‌లో 1759 ర్యాంక్ సాధించాడు. పుట్టకతోనే వైకల్యం బారినపడి నడవలేని స్థితిలో ఉన్న వరుణ్ తన తల్లి మరణం, తండ్రి ఎడబాటుతో కుంగిపోలేదు. వరుణ్ తాత యక్కల కాశీవిశ్వనాథం చేరదీశారు. తాత ప్రోత్సాహంతో జేఈఈలో ర్యాంక్ సాధించిన వరుణ్‌ను గ్రామస్థులు అభి నందించారు.

బూత్ కన్వీనర్లు కీలకంగా వ్యవహరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చిరంజీవి

చీరాల, ఏప్రిల్ 26 :ఎన్నికల వేళ పోలింగ్ సమయంలో బూత్ కన్వీనర్లు కీలకంగా వ్యవహరించాలని ఎమ్మెల్సీ చిరంజీవి అన్నారు. టీడీపీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి బూత్ కన్వీనర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో బూత్ కన్వీనర్లు చేపట్టాల్సిన విధులు, బాధ్యతలను తెలిపారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు ముప్పవరపు వీరయ్యచౌదరి పాల్గొన్నారు.

మార్టూరులో ఘనంగా ఉరుసు



ఉరుసు ఉత్సవంలో పాల్గొన్న భక్తులు.. ఆకట్టుకున్న ప్రభ

మార్టూరు, ఏప్రిల్ 26 : మార్టూరులో కొణిదెన రోడ్‌లో ఉన్న హజరత్ కరిముల్లా షావలి ఉరుసు వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముస్లిం మతపెద్దలు దర్గా వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాలంకరణతో దర్గాను అలంకరించారు. ఉదయం నుంచి వివిధ సామాజిక వర్గాలకు చెందిన వారు దర్గా వద్ద కొబ్బరి కాయలు కొట్టి మొక్కుకున్నారు. కమిటీ సభ్యులు విద్యుత్ దీపాలంకరణతో విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు. ఏటా ప్రకాశం, గుంటూరు, పల్నాడు, నెల్లూరు జిల్లాలనుంచి కూడా భక్తులు ఉరుసు వేడుకలకు భారీగా వస్తుంటారు. ఈ ఏడాది ఎన్నికల నేపథ్యంలో ఇతర ప్రాంతాలవారు తక్కువగా వచ్చారు. కోడ్ దృష్ట్యా ఎలాంటి సాంస్కృతిక కార్యక్రమాలను కమిటీవారు ఏర్పాటు చేయలేదు. మండలంలోని ఇతర గ్రామాల తోపాటు, యద్దనపూడి, బల్లికురవ మండలాల నుంచి భక్తులు విశేషంగా తరలి వచ్చారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్త పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మార్టూరు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఎస్ఐలు బాషా, సైదా, యద్దనపూడి, బాపట్ల స్టేషన్‌లకు చెందిన సుమారు 40 మంది పోలీసులు పర్యవేక్షించారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు

సిబ్బందికి ఏఎస్పీ సూచన - సమస్యాత్మక ప్రాంతాలపై అప్రమత్తం



పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఏఎస్పీ

చీరాలటౌన్, ఏప్రిల్ 26 : ఎన్నికల విధుల్లో సిబ్బంది అలసత్వం వహించరాదని, సమస్యాత్మక ప్రాంతాలలో అప్రమత్తంగా ఉండాలని ఏఎస్పీ టీపీ విఠలేశ్వర్ అన్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో శుక్రవారం కారంచేడు పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. అనంతరం స్వర్ణ గ్రామంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అలాగే చీరాల వన్‌టౌన్, టూటౌన్ స్టేషన్‌ల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సెయింట్ ఆన్స్ కళాశాలలోని స్ట్రాంగ్ రూం వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తును పరిశీలించి సూచనలు చేశారు. అన్ని ప్రాంతాల్లో భద్రతాపరమైన లైటింగ్ ఉంచాలన్నారు. కేంద్రాల వద్ద విధులు నిర్వహించే వారికి పలు హెచ్చరికలు జారీ చేశారు. స్వేచ్ఛాయుత పోలింగ్ జరిగేందుకు అన్నిరకాల జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఏఎస్పీ తెలిపారు. ఆయనవెంట చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్, సీఐలు శేషగిరిరావు, సోమశేఖర్, సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



సాగర్ జలాలతో 60 శాతం నిండిన కొండమంజులూరు చెరువు

సమస్యాత్మక గ్రామాలకు చేరని సాగర్ జలాలు

ఫలితం ఇవ్వని అధికారుల పర్యటన

పంగులూరు, ఏప్రిల్ 26 : వేసవిలో తాగు నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు సాగర జలాలతో చెరువులు నింపాలనే అధికారుల ప్రయత్నం తగిన ఫలితం ఇవ్వలేదు. అధికంగా నీటి సమస్య తలెత్తే కాలువ వరి ప్రాంత గ్రామాలైన నూజెళ్లపల్లి, తూర్పు కొప్పెరపాడు, తక్కెళ్లపాడు గ్రామాల చెరువులకు సాగర్ జలాలు చేరతాయనే ఆశలు అడియాశలయ్యాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు సాగర్ జలాల విడుదల, చెరువులకు చేరిన నీటిని పరిశీలించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్, ఎన్నెస్పీ, పంచాయతీరాజ్ అధికారుల బృందం పమిడిపాడు మేజర్ పరిధిలోగల నూజెళ్లపల్లి, చందలూరు, తూర్పు కొప్పెరపాడు, తక్కెళ్లపాడు తదితర గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు తమ గ్రామాలకు విచ్చేసిన అధికారులకు వేసవిలో తాగనీటికి తలెత్తే ఇబ్బందులను వివరించడంతో పాటు చెరువులను సాగర్ జలాలతో నింపాల్సిన ఆవశ్యకతను ఏకరువు పెట్టారు. నూజెళ్లపల్లిలోని విసప్పకుంట చెరువుకు 35 శాతం చేరిన నీటితో తమ నీటి కష్టాలు తీరవని, చెరువును పూర్తిగా సాగర్ జలాలతో నింపాలని అధికారులకు విన్నవించారు. తూర్పు కొప్పెరపాడు, తక్కెళ్లపాడు, చందలూరు గ్రామాలలో చెరువులు, నీటి కుంటలకు నీటిని మళ్లించి ప్రజలతో పాటు పశువులకు తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్, ఎన్నెస్పీ, పంచాయతీ అధికారులను గ్రామస్థులు వేడుకున్నారు. అయినప్పటికీ ఏబీసీలో అరకొరగా వస్తున్న నీటిని ఈబీసీకి మళ్లిస్తున్నారు తప్ప పమిడిపాడు మేజరుకు శుక్రవారం వరకు నీటి విడుదల జరగకపోవడంతో సాగర్ జలాలు చెరువులకు వచ్చే పరిస్థితి లేదని, నీటి సమస్య తప్పదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొన్ని చెరువులు మాత్రమే నింపగలిగాం

పంగులూరు మండలంలో 10 నోటిఫైడ్, 10 నాన్ నోటిఫైడ్ చెరువులున్నాయని, వీటిలో కొన్ని చెరువులకు సాగర్‌జలాలతో నింపినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివయ్య తెలిపారు. పమిడిపాడు మేజర్ పరిధిలో కాలువకు దగ్గరగా ఉన్న కొండమంజులూరు, జేవీపాలెం, కోటపాడు చెరువులకు సాగర్ జలాలు మళ్లించామన్నారు. ఏబీసీ నుంచి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న నూజెళ్లపల్లి చెరువుకు 35 శాతం నీటిని అతి కష్టం మీద మళ్లించినట్లు తెలిపారు. ఈబీసీకి విడుదల చేసిన నీటిని కోటపాడు మేజర్ పరిధిలోని ఆరికట్లవారిపాలెం, బూదవాడ, మల్లవరం, కల్లంవారిపాలెం, పంగులూరు చెరువులను నింపినట్లు తెలిపారు. ఏబీసీ పరిధిలో రామకూరు లాకుల వద్దకు చేరుతున్న 180 క్యూసెక్కుల నీరు ఈబీసీకి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. బుగ్గవాగు నుంచి విడుదలవుతున్న కొద్దిపాటి నీటిని ఈబీసీకి విడుదల చేస్తున్నారని తెలిపారు. పమిడిపాడు మేజరుకు శుక్రవారం కూడా నీటి విడుదల లేక పోవడంతో ఈ మేజరు పరిధిలోని చెరువులకు సాగర్ జలాలు చేరడంపై ఆశలు సన్నగిల్లడంతో కాలువ చివరిప్రాంత గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



బొల్లవరప్పాడులో టీడీపీ అభ్యర్థి రవికుమార్ తరపున ప్రచారం చేస్తున్న ఆయన సతీమణి గొట్టిపాటి ఝాన్సీ

టీడీపీతోనే మహిళా అభివృద్ధి

- ఇంటింటి ప్రచారంలో ఝాన్సీ

మేదరమెట్ల, ఏప్రిల్ 26 : రాష్ట్రంలోని మహిళలు విద్యా, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే అది టీడీపీతోనే సాధ్యమని గొట్టిపాటి రవికుమార్ సతీమణి ఝాన్సీ అన్నారు. శుక్రవారం మండలంలోని బొల్లవరప్పాడులో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌ను, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె ఎస్సీ కాలనీలో ఇంటింటికీ తిరిగి రవికుమార్ తరఫున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళాశక్తి పథకంతో ఉచితంగా సంవత్సరానికి మూడు సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం, 18 నుంచి 59 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1500 ఖాతాలో జమచేయడంతో పాటు ఇంటో చదువుకొనే పిల్లలు ఎంత మంది ఉన్నా, ఒక్కొక్కరికి రూ.1500, డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణం రూ.10 లక్షలు అందజేస్తారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఎర్రం చిన్నపోలిరెడ్డి కొరిశపాడు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు. భూములు కోల్పోయిన రైతులకు మార్కెట్ ధర చెల్లించేందుకు కృషి చేస్తామన్నారు. నియోకజకవర్గంలో ప్రజలందరికీ తాగు సాగునీరు అందించెందుకు కృషి చేస్తామన్నారు. భూములు కోల్పోతున్న రైతుల పక్షాన ఉండాల్సిన ప్రభుత్వం వారిపైనే కోర్టుకు వెళ్లి రైతు వ్యతిరేకిగా వైసీపీ చరిత్రలో నిలిచిందన్నారు. మద్యంను నిషేధిస్తానని ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన జగన్ నాశిరకం మద్యం అమ్మి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. ఆమె వెంట గ్రామ టీడీపీ నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

30న బాలకృష్ణ పర్యటన

కొండపి, ఎస్‌ఎన్‌పాడు నియోజకవర్గాల్లో రోడ్డుషో, సభలు



ఒంగోలు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నేత, సినీనటుడు నందమూరి బాలకృష్ణ ఈనెల 30న జిల్లాలో పర్యటించనున్నారు. కొండపి, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. పార్టీ వర్గాల సమాచారం మేరకు... 30వతేదీ సాయంత్రం 4 గంటలకు కొండపి నియోజకవర్గ పరిధిలోని మండల కేంద్రమైన మర్రిపూడికి ఆయన హెలికాప్టర్‌లో చేరుకుంటారు. సాయంత్రం ఆరు గంటల వరకు అక్కడ రోడ్‌షో, సభలో పాల్గొంటారు. అనంతరం రోడ్డుమార్గంలో సంతనూతలపాడు నియోజకవర్గానికి వస్తారు. ఆ నియోజకవర్గంలోని మండల కేంద్రాలైన చీమకుర్తి లేదా సంతనూతలపాడుల్లో ఒక చోట రోడ్‌షోలో పాల్గొంటారు. ఎక్కడ అనేదానిపై శనివారం స్పష్టత రానుంది.

విచారణ నివేదిక ఎస్పీ కార్యాలయంలో...!

బాపట్ల, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేతను ఎస్‌ఐ నాగశివారెడ్డి దూషించారనే ఫిర్యాదుకు సంబంధించి విచారణ పూర్తి చేసిన బాపట్ల డీఎస్పీ ఆ నివేదికను ఎస్పీ కార్యాలయంలో గురువారమే అందజేసినట్లు తెలిసింది. ఈనెల 23న పర్చూరు ఆర్వో కార్యాలయంలోపలకి ప్రవేశం విషయంలో టీడీపీ పర్చూరు మండల పార్టీ అధ్యక్షుడిని ఎస్‌ఐ నాగశివారెడ్డి తిట్టారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు ఎస్పీ వకుల్ జిందాల్‌కు ఫోన్‌లో ఫిర్యాదు అందించారు. దీనిపై స్పందించిన ఎస్పీ ఆర్వో కార్యాలయం వద్ద విధుల నుంచి సదరు ఎస్‌ఐని తప్పించడంతో పాటు ఆ ఘటనపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని బాపట్ల డీఎస్పీని అదే రోజు ఆదేశించారు. విచారణ పూర్తి చేసిన డీఎస్పీ సదరు నివేదికను ఎస్పీ కార్యాలయంలో అందించినట్లు సమాచారం. దాని ఆధారంగానే ఎస్‌ఐ నాగశివారెడ్డిపై తదుపరి చర్యలు ఉండనున్నాయి

పది మద్యం బాటిళ్లు పట్టివేత

చినగంజాం, ఏప్రిల్ 26 : పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లెపాలెం గ్రామానికి మద్యం బాటిల్స్ తీసుకొని వెళ్తున్న వ్యక్తిని శుక్రవారం అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్.ఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా పది మద్యం బాటిల్స్ తీసుకొని వెళ్తున్న కొక్కిలిగడ్డ నాగరాజుని అదుపులోనికి తీసుకున్నట్లు తెలిపారు. పది మద్యం బాటిల్స్‌ని సీజ్ చేసి, నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్.ఐ తెలిపారు.

ప్రతిరోజూ నీరేది?

జీవోలకు, హామీలకు తీరని దాహం..!

మండుతున్న ఎండలకు నగరానికి ఎక్కిళ్లు..!

ఒంగోలులో అస్తవ్యస్తంగా తాగునీటి సరఫరా..!

అడుగంటిన గుండ్లకమ్మ, సాగర్ నీరు కష్టమే..

అంతంతమాత్రంగా ఎస్ఎస్ ట్యాంకుల్లో నీరు

రోజూ ఇస్తామంటూ 'ఎమ్మెల్యే పాత పాట'

మండిపడుతున్న నగరవాసులు

- ఒంగోలులోని దేవుడు చెరువు రోడ్డులో గురువారం రాత్రి 10గంటల సమయంలో నీటి సరఫరా జరగ్గా, బిందెడు నీరు కోసం మహిళలు నిద్రమానుకుని వీధి పంపుల వద్ద ఎదురుచూశారు. అయితే సరఫరా చేసిన అరగంటకే నీరు నిలిచిపోవడంతో తాగునీటికి తప్ప, ఇంటి అవసరాలకు నీరు సరిపోలేదని మహిళలు వాపోయారు.
- నగరంలోని తూర్పు కమ్మపాలెంకు బాలినేని నామినేషన్ కోసమని ముందురోజు అదివారం అర్ధరాత్రి హ డావుడిగా నీరు విడుదల చేశారు. అప్పటి నుంచి నీటి విడుదల లేదు. ఐదురోజుల తర్వాత శుక్రవారం ఇచ్చారు.
- ఒంగోలు నగరానికి ప్రధాన సమస్య అయిన తాగునీటికి శాశ్వత పరిష్కారం లభించడం లేదు. 'ఈ ఎన్నికల్లో గెలిపించాలని, నగరానికి ప్రతిరోజూ తాగునీరు ఇవ్వకుంటే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను.' ఇదీ గత ఇరవై ఏళ్లుగా ఒంగోలు ప్రజలకు వినిపిస్తున్న హామీ. ఎన్నికల వచ్చినపుడల్లా గెలుపు కోసం నగరానికి రోజూ నీరిస్తామంటూ పాడే పాత పాటపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికే ఒంగోలు నగరంలో వెక్కిళ్లు మొదలయ్యాయి. ఎస్ఎస్ ట్యాంకుల్లో నీరు అడుగంటాయి. మూడురోజులకొకసారి అదీనూ అరకొరగా సరఫరా చేస్తున్న పరిస్థితి. వైసీపీ నాయకుల హామీలతో ఎప్పటికపుడు ఆశతో ఎదురుచూస్తున్న జనానికి నిరాశే మిగిలింది. అయితే మళ్లీ నన్ను గెలిపిస్తే ప్రతిరోజు నీరు అంటూ పాతపాటే పాడుతుండటంపై నగరవాసులు మండిపడుతున్నారు.



ఒంగోలు నగరంలోని దేవుడు చెరువు రోడ్‌లో నీటి కోసం ఎదురుచూపులు

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 26: గత కొన్నేళ్లుగా నగర ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదు. ఇప్పటికే నగరంలో 'ఒకరోజు మోటారు పాడైంది, ఇంకోరోజు పైప లైను పగిలిపోయింది, మరోసారి కరెంటు పోయింది' అంటూ తాగునీటి సరఫరాను అధికారులు నిలిపివేస్తున్నారు. కానీ అసలు కారణం వేరని సమచారం. నగరానికి నీరందించే నీటివనరులు అడుగంటాయి. ఒకవైపు మండుతున్న ఎండలు, పెరుగుతున్న తాగునీటి అవసరాలను పాలకులు పట్టించుకోవడం లేదు. వేసవి దృష్ట్యా యంత్రాంగం ముందుచూపు లేకపోవడంతో నగరమంతా నీటి సరఫరా అస్తవ్యస్తంగా తయారైంది. దీనిపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక సంస్థ నిర్లక్ష్యం, వైసీపీ పాలకులు పట్టించుకోనితనంతో నగరంలో పదేపదే తాగునీటి సమస్య ఎదురవుతుంది. నగరంలో రోజూ తాగునీటి సరఫరా చేస్తామంటూ ప్రతిసారి ఎన్నికల సమయంలో ప్రచార అస్త్రంగా వాడుతున్న విషయం తెలిసిందే.. ప్రతినీరు ఇస్తాను.. లేదంటే పోటీ చేయమంటూ ప్రస్తుత ఎమ్మెల్యే చెప్పడం.. పాత పాటే అంటూ ప్రజలు పెదవివిరుస్తున్నారు. హామీలకు దాహం తీరేనా.. నగరంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం సాధ్యమేనా? అనుమానం ప్రజల్లో వస్తోంది. ఇదిలా ఉంచితే గతేడాది తాగునీటి కోసం వైసీపీ ప్రభుత్వం రూ.339.92 కోట్లకు జీవో జారీచేసింది. దాంతో అదేదో నీరొచ్చినట్లే జనవరి 20, 2023న జీవో కాపీలు చేతపట్టి బైక్ ర్యాలీతో నగరంలో నానా హడావుడి చేశారు. అయితే ఆ జీవో విడుదలై ఏడాది పూర్తయినా నేటికి పనులు ప్రారంభానికి నోచుకోలేదు.

నగరమైనా ప్రైవేటు ట్యాంకర్లే

నగర జనాభా పెరిగింది. అయితే శివారు కాలనీలు, విలీన గ్రామాల స్థితిగతులు మాత్రం మారలేదని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. జిల్లాకేంద్రమైన ఒంగోలుకు మాత్రమే తొలిసారిగా కార్పొరేషన్ హోదా లభించింది. కానీ అందుకు అనుగుణంగా నీరు సరఫరా చేసేందుకు ప్రభుత్వ ట్యాంకర్లు లేవు. గతంలో మూడు ఉండగా అవి ప్రస్తుతం మరమ్మతులకు గురై నిరుయోగంగా ఉన్నాయి. దీంతో ప్రైవేటు ట్యాంకర్ల ద్వారానే ఏళ్ల తరబడి తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఇదిలా ఉండగా కార్పొరేషన్‌లో మరో పది పంచాయతీలు విలీనం కావడంతో ఉన్న అరకొర ట్యాంకర్లే వాటికీ దిక్కయ్యాయి. అటు శివారు కాలనీలు, ఇటు గ్రామీణ ప్రజలు కూడా తాగునీటి కోసం తంటాలు పడుతున్నారు.

అడుగుంటిన వేసవి చెరువులు

గుండ్లకమ్మ గేట్లు కొట్టుకుపోవడంతో ఉన్న నీరు వృథా అయిన విషయం విదితమే. నేటికీ గేట్లు మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రాజెక్టులో నీరు అడుగంటి, క్రీడామైదానంలా మారింది. దీంతో గుండ్లకమ్మ నుంచి నీటి సరఫరా నిలిచిపోయింది. ఇదిలా ఉంచితే సాగర్ నీటిపైనే ఆశలు పెట్టుకోగా ప్రస్తుతం ఆ నీరు చెరువులకు రావడం లేదు. అయితే వైసీపీ పాలకులు, నగర ప్రజాప్రతినిధులు తాగునీటికి కోట్లు రూపాయల జీవోలు తెచ్చాం, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని చెబుతున్న మాటలు ఆచరణలో సాధ్యపడటం లేదు. ఇప్పటివరకు మూడు రోజులకు ఒకసారి తాగునీటి సరఫరా చేస్తుండగా, రకరకాల సాకులతో నాలుగు రోజులకు ఒకసారి ఇచ్చేందుకు యంత్రాంగం సిద్ధమవుతోంది. అది కూడా అరకొరగానే విడుదల చేయడంతో నగరంలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే నగరంలో అధికశాతం ఏరియాల్లో పురాతన పైపు లైన్లు ఉండగా, అతి కొద్ది ప్రాంతాల్లోనే కొత్తవి వేశారు. దీంతో పాత పైపులైనులు పదే పదే లీకులు ఏర్పడుతుండా, వాటిని నియంత్రించడంలో విఫలమయ్యారనే విమర్శలున్నాయి. దీంతో చెరువుల్లో ఉన్న కొద్దిపాటి నీరు చివరకు ఇళ్ల వరకు చేరడం లేదు.

టీడీపీ ప్రభుత్వం హయాంలో చర్యలు

అమృత్ పథకం నిధుల విడుదల కాకముందు గుండ్లకమ్మ నీటిని రాబట్టుకోవడానికి రూ.40కోట్లు అప్పటి టీడీపీ ప్రభుత్వం మంజూరుచేసింది. ఆ సమయంలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నగరానికి వచ్చిన సమయంలో ప్రకాశం భవనం వద్ద ఈ పనులకు సంబందించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఏడుగుండ్లపాడు వద్ద నుంచి ఒంగోలు వేసవి జలాశయం వరకు రూ.40 కోట్లతో 8.9 కిలోమీటర్ల పైపులైను పనులు చేపట్టారు. ఆ సమయంలో ఆ పనులు 70శాతం పూర్తికాగా, అప్పటి కేంద్ర మంత్రిగా ఉన్న వెంకయ్యనాయుడు చేతుల మీదుగా దానిని ప్రారంభించారు. ఆ పైపులైను ద్వారా రోజుకు 60 మిలియన్ లీటర్ల నీటిని ఒంగోలు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులకు సరఫరా చేసే విధంగా పనులు చేపట్టారు. అయితే రోజువారీగా నగర ప్రజల నీటి అవసరాలకు 35 మిలియన్ లీటర్ల నీరు సరఫరా చేస్తుండగా, గుండ్లకమ్మ నుంచి వచ్చే నీటితో ప్రజలకు మరింతగా నీరు అందించడంతోపాటు వేసవిలోనూ సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపడం కోసం దామచర్ల ఎనలేని కృషిచేశారు.

రూ.123 కోట్లు మిగిలిన పనులు

ఆ తర్వాత గుండ్లకమ్మ నుంచి ఏడుగుండ్లపాడు వరకు మరోసారి పైపులైను పనులు పూర్తిస్థాయిలో చేపట్టారు. ఒంగోలు నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం రూ.330 కోట్లు కేటాయించాలని ప్రాజెక్టు నివేదికలో పేర్కొన్నారు. ఒకేసారి అంత కేటాయించడం సాధ్యపడక విడదల వారీగా నిధులు ఇచ్చేందుకు కేంద్ర పట్టణాభివృద్ధి సుముఖత చూపింది. దానిలోభాగంగా అమృత్ పథకం కింద తొలి విడత రూ.123 కోట్లు అదనంగా కేటాయించారు. నిధులతో మరో 16కి.మీ పైపు లైను నిర్మించడానికి చర్యలు చేపట్టారు. అంతేకాకుండా 15 ఎంఎల్‌డీ సేప్టేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం కూడా ఏర్పాటు అవసరం ఉండటంతో అదనంగా మరో రూ.30.79 కోట్లు కేటాయించారు. దీంతో ఒంగోలు నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం మొత్తం రూ.190.79 కోట్లు వెచ్చించి నగర ప్రజల దాహార్తి తీర్చడం కోసం, భవిష్యత్‌లో తాగునీటి సమస్య తలెత్త కుండా ఉండటం కోసం దామచర్ల అటు కేంద్రప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి అవసరమైన నిధులు రాబట్టడంలో, పనులు వేగవంతంగా చేపట్టేలా ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి పనులు పురోగతికి దోహదపడ్డారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పథకాన్ని పక్కన పడేసింది. పనులు నిలిచిపోయాయి. అయితే ప్రజల నుంచి విమర్శలు రావడంతో గతేడాది హడావుడిగా పనులు ప్రారంభించారు. అన్నీ పాత నిధులే అయినా తామేదో తెచ్చి చేయించినట్లు చెబుతున్నారనే విమర్శలు వచ్చాయి. గత అక్టోబర్‌లో ప్రారంభంలో ఆర్భాటంగా ఎస్ఎస్‌ట్యాంక్ వద్దను ప్రారంభించగా, మోటార్లు మొరాయించడంతో అంతా తుస్సుమంది.

ప్రచారంలో టీడీపీ స్పీడు

రోడ్‌షోలతో అభ్యర్థులు,

ఇంటింటికీ తిరుగుతున్న కుటుంబ సభ్యులు

వైసీపీ నుంచి కొనసాగుతున్న వలసల జోరు



పామూరులో రోడ్‌షో నిర్వహిస్తున్న ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట, కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి ఉగ్ర

ఒంగోలు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని టీడీపీ అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో స్పీడ్ పెంచారు. వివిధ కార్యక్రమాలతో దూసుకుపోతున్నారు. నామినేషన్ల దాఖలు ప్రక్రియ ముగియడంతో అటు అభ్యర్థులు రోడ్ షోలు, సభలు నిర్వహిస్తున్నారు. ఇటు వారి కుటుంబ సభ్యులు ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. అదేసమయంలో వైసీపీ నుంచి వలసల జోరు కొనసాగుతోంది. పార్టీ అధిష్ఠానం అభ్యర్థులను ప్రకటించకముందే టీడీపీ నేతలు వివిధ రూపాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ వచ్చారు. తమ పేర్లను ఖరారు చేసిన తర్వాత క్రమపద్ధతిలో కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈనెల 18నుంచి 25వరకూ నామినేషన్ల దాఖల సందర్భంగా ర్యాలీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ జనజాతర మధ్య నామినేషన్ల ఘటాన్ని ముగించారు. ఆ సందర్భంగా పార్టీ శ్రేణులు, అలాగే మద్దతు ఇస్తున్న జనసేన, బీజేపీ కార్యకర్తల్లో కనిపించిన ఉత్సాహాన్ని గుర్తించిన అభ్యర్థులు అదే ఊపును పోలింగ్ వరకూ తీసుకెళ్లే దిశగా ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నారు.

ప్రచారాలు.. చేరికలు

ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ల దాఖలు, పరిశీలన ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. పోలింగ్‌కు రెండు వారాలు మాత్రమే గడువు ఉంది. దీంతో టీడీపీ నుంచి రంగంలో ఉన్న పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులు.. వారికి మద్దతుగా కుటుంబ సభ్యులు ప్రచారం ముమ్మరం చేశారు. మరోవైపు అన్ని నియోజకవర్గాల్లోనూ వైసీపీ నుంచి పెద్దసంఖ్యలో వివిధ స్థాయి నేతలు, క్రియాశీల కార్యకర్తలు టీడీపీలోకి వచ్చి చేరుతున్నారు. అలా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో శుక్రవారం కూడా పెద్దసంఖ్యలోనే చేరికలు జరిగాయి.

జనం మధ్యలోనే టీడీపీ అభ్యర్థులు

జిల్లాలోనే టీడీపీ అభ్యర్థులంతా జనం మధ్యనే గడుపుతున్నారు. శుక్రవారం కూడా వారు ముమ్మర ప్రచారంలో నిమగ్నమై కనిపించారు. ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి, కనిగిరి అసెంబ్లీ అభ్యర్థి ముక్కు ఉగ్రనరసింహారెడ్డిలు శుక్రవారం కనిగిరి, పామూరు పట్టణంలో రోడ్డు షోలు నిర్వహించారు. కొండపి ఎమ్మెల్యే, అక్కడి టీడీపీ అభ్యర్థి అయిన డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి జరుగుమల్లి మండలంలో దాదాపు పది గ్రామాల్లో రోడ్‌షోలు, వీధి మీటింగ్‌లు నిర్వహించారు. రాత్రికి సింగరాయకొండలో యువనేత దామచర్ల సత్య సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వస్తున్న నేతల చేరికల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్ నగరంలోని 23వ డివిజన్‌లో రోడ్‌షోతోపాటు ఇంటింటి ప్రచారం చేపట్టారు. సంతనూతలపాడు అభ్యర్థి బీఎన్ విజయ్‌కుమార్ మద్దిపాడు మండలం నందిపాడులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గిద్దలూరు అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి గిద్దలూరు పట్టణంలోని పలు వార్డులలో పర్యటించి ఓట్లు అభ్యర్థించారు. దర్శి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి దర్శి మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఎర్రగొండపాలెం అభ్యర్థి ఎరిక్షన్‌బాబు.. కొలుకుల, గంజివారిపల్లి గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన వారిని వై.పాలెంలోని తన కార్యాలయంలో సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎన్నికల ప్రచారం కూడా నిర్వహించారు. మార్కాపురం అభ్యర్థి కందుల నారాయణరెడ్డి తర్లుబాడు మండలం మీర్జాపేట, గొల్లపల్లి, నాగెళ్లముడుపు తదితర గ్రామాల్లో ప్రచారం చేపట్టారు.



ప్రచారంలో భాగంగా ఒంగోలులో స్విచ్‌బోర్డులు తయారు చేసే దుకాణంలో యంత్రంతో ప్లేవుడ్‌ను కట్ చేస్తున్న జనార్దన్

జగన్‌కు ఓటేస్తే మళ్లీ విధ్వంసమే!

పామూరు, ఏప్రిల్ 26: వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి ఓటేస్తే రాష్ట్రంలో మళ్లీ విధ్వంసమేనని టీడీపీ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. విజ్ఞులైన ఓటర్లు ఆలోచించి కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో బాగంగా మండలంలోని కోడిగుంపుల, బొట్లగూడూరు, గ్రామాల్లోలో శుక్రవారం రాత్రి ప్రచార కార్యక్రమం నిర్వహించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాగుంట, ఉగ్ర కుటుంబాలు అధికారం ఉన్నా, లేకపోయినా సేవాదృక్పథం కలిగినవని అన్నారు. ఈ కుటుంబాలను ఆదరిస్తే మీ ప్రాంతాల అభివృద్ధితో పాటు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి మన్ననలు పొందుతామన్నారు. వైసీపీ పాలనలో దగా పడిన ఆంధ్రుల భవిష్యత్తుకు గ్యారెంటి ఇస్తూ చంద్రబాబు ప్రవేశపెట్టిన ఆరు పథకాలతో ఆర్థిక ప్రయోజనం కలుగుతుందన్నారు. కార్యక్రమాల్లో నాయకులు పువ్వాడి వెంకటేశ్వర్లు, కోటచిన వెంకటేశ్వర్లు, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, వై.బాల, కోటపాటి విశాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కాగా, పామూరు పట్టణంలో శుక్రవారం రాత్రి జరగాల్సిన పర్యటన రద్దయింది. ఎన్నికల ప్రవర్తన నిమావళిని అనుసరిస్తూ సమయం లేనందున పామూరులో జరగాల్సిన మాగుంట, ఉగ్రల రోడ్‌షోను రద్దు చేశారు.

టీడీపీ చేరిన సర్పంచ్ సుబ్బయ్యయాదవ్

పామూరు, ఏప్రిల్ 26: మండలంలోని వగ్గంపల్లి సర్పంచ్ దేవనబోయిన సుబ్బయ్య యాదవ్ వైసీపీని వీడి టీడీపీలో చేరారు. శుక్రవారం రాత్రి శేషమహల్‌లో జరిగిన కార్యక్రమంలో టీడీపీ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మాగుంట, ఉగ్ర సమక్షంలో పార్టీలో చేరారు. సుబ్బయ్య యాదవ్‌కు టీడీపీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. గత శాసనసభ ఎన్నికల్లో బుర్రకు అత్యంత ఆప్తుడుగా ఉన్న సుబ్బయ్య యాదవ్ వైసీపీని వీడటంతో మండలంలో ఆపార్టీకి భారీ షాక్ తగిలినట్లైంది. ప్రస్తుతం వైసీపీ నాయకులు అనుసరిస్తున్న తీరు నచ్చక టీడీపీ పై ఉన్న భరోసాతో బేషరతుగా మాగుంట ఉగ్రకు మద్దతు ఇవ్వడానికి టీడీపీలో చేరినట్లు సుబ్బయ్య తెలిపారు. సర్పంచ్ సుబ్బయ్యతోపాటు అతని అనుచరులు 12 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో పువ్వాడి వెంకటేశ్వర్లు, ఎం.గంగరాజుయాదవ్, బైరెడ్డి జయరామిరెడ్డి, గోళ్ల వెంకటేశ్వర్లు, ఉప్పలపాటి హరిబాబు, బీజేపీ నేత కేవీ రమణయ్య, మస్తాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా చూడాలి



నామినేషన్ల స్క్రూటీనీలో పాల్గొని వివరాలు తెలుసుకుంటున్నా ఎన్నికల పరిశీలకుడు అరవిందకుమార్ చౌరశ్యా


దర్శి, ఏప్రిల్ 26: సార్వత్రిక ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని ఎన్నికల పరిశీలకుడు, ఐఏఎస్ అధికారి డాక్టర్ అరవిందకుమార్ చౌరశ్యా అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఈఆర్‌వో కార్యాలయంలో ఎన్నికల నామినేషన్ల స్క్రూటిని కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎంపీఎస్ లోకేశ్వరరావు దర్శి అసెంబ్లీకి దాఖలైన నామినేషన్ల వివరాలను పరిశీలించిన తరువాత తుది జాబితా వివరాలను తెలియజేశారు. ఈసందర్భంగా అరవిందకుమార్ చౌరశ్యా మాట్లాడుతూ ఓటర్లు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతకుముందు ఎన్నికల వ్యయపరిశీలకుడుకే విద్యాన్ దర్శిలో పర్యటించారు. రిటర్నింగ్ అధికారి లోకేశ్వరరావు ఆయన్ను కలిసి అడిగిన వివరాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.సుజాత, డిప్యూటీ తహసీల్దార్ ఏవీ రవిశంకర్, ఎన్నికల డీటీ దేవప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

దర్శి, ఏప్రిల్ 26: మండలంలోని రాజంపల్లి పంచాయతీలోని ముసినది వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పొదిలి మండలం కుంచేపల్లికి చెందిన పాణెం రామాంజనేయరెడ్డి (29) మోటార్ సైకిల్‌పై దర్శికి వచ్చి పనులు చూసుకుని తిరిగి వెళుతున్నాడు. ఈక్రమంలో ముసి నది వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన యువకుడిని పొదిలి ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. దర్శి ఎస్సై సుమంత్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

63 మద్యం బాటిళ్లు పట్టివేత

పామూరు, ఏప్రిల్ 26: పట్టణంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై ఎస్ఐ ఎం.సైదుబాబు తన సిబ్బందితో దాడిచేసి 63 బాటిళ్లను శుక్ర వారం స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికలవేళ మద్యాన్ని అక్రమంగా సిద్ధం చేసుకుంటున్న తరుణంలో పోలీసులు మెరుపుదాడులు చేస్తున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



ముగిసిన నామినేషన్ల పరిశీలన

- పార్లమెంటుకు 15 ఆమోదం, 6 తిరస్కరణ
- అసెంబ్లీ స్థానాలకు 130 ఆమోదం, 41 తిరస్కరణ



నామినేషన్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నియోజకవర్గం	దాఖలైనవి	తిరస్కరణ	ఆమోదం
నెల్లూరు (ఎంపీ)	21	5	15
అసెంబ్లీ			
నెల్లూరు నగరం	26	8	18
నెల్లూరు రూరల్	13	1	12
కావలి	25	10	15
కందుకూరు	25	1	24
కోవూరు	28	9	19
సర్వేపల్లి	17	4	13
ఆత్మకూరు	15	2	13
ఉదయగిరి	22	6	16
మొత్తం	171	41	130

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 26 : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలన శుక్రవారం ముగిసింది. నెల్లూరు పార్లమెంటు, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఆయా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో దాఖలైన నామినేషన్లను రిటర్నింగ్ అధికారులు పరిశీలించారు. పరిశీలన అనంతరం నెల్లూరు పార్లమెంటులో 21 నామినేషన్లు దాఖలవగా 15 ఆమోదం పొందాయి. ఆరు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. అలాగే 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 171 నామినేషన్లు దాఖలవగా 130 నామినేషన్లను ఆమోదించారు. 41 నామినేషన్లను తిరస్కరించారు. శని, ఆదివారాలు సెలవు కావడంతో 29వ తేదీన ఒక్క రోజు మాత్రమే నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. ఆదేరోజు మధ్యాహ్నం 3.30 గంటలకు బరిలో ఉన్న అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తారు.

కిలో పొగాకు రూ.286

కలిగిరి: పొగాకు ధర రోజురోజుకు పెరుగుతోంది. శుక్రవారం కిలో గరిష్ఠ ధర రూ.286, కనిష్ఠ ధర రూ.218, సగటు ధర రూ.255.64గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు. వేలం కేంద్రానికి రైతులు 555 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 14 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 497 బేళ్లు కొనుగోలు చేశారు. నోసేల్-1, నోబిడ్-45, ఆర్ఆర్-2,సీఆర్-7, జంపింగ్‌లాట్స్-3 కారణాలతో 58 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి.



అభివృద్ధి కావాలా..

నెల్లూరు : గాంధీబొమ్మ సెంటర్‌లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న బాలకృష్ణ



బాలకృష్ణను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు, పక్కన వేమిరెడ్డి, కోటంరెడ్డి

అరాచకం కావాలా!?

- అభివృద్ధి, సంక్షేమం ఎన్డీఏతోనే సాధ్యం
- ఇసుక, మట్టి అమ్ముకున్న వ్యక్తికి కందుకూరు టిక్కెటా!?
- నగరాన్ని అభివృద్ధి చేసింది టీడీపీనే
- విశాఖను దోచిన ఏ2 నెల్లూరులో వాలారు
- కాకాణి కళ్లు పడితే కబ్జానే..
- స్వర్ణాంధ్ర సాకార యాత్రలో బాలకృష్ణ

నెల్లూరు(ఆంధ్రజ్యోతి)/గుడ్లూరు, ఏప్రిల్ 26 : 'అభివృద్ధి కావాలా.. అరాచకం కావాలా... సంక్షేమం రాజ్యం కావాలా.. చీకటి రాజ్యం కావాలా... సమర్థవంతమైన పాలన కావాలా.. రాక్షస పాలన కావాలా... స్వర్ణయుగం కావాలా.. రాతియుగం కావాలా... ప్రజలే ఆలోచించుకోవాలి. మాయలు, మోసాలు, అరాచకాలు చేసేందుకు వైసీపీ సిద్ధం అంటోంది. మరోసారి వైసీపీ అధికారంలోకి వస్తే మీ భూములు మీవి కాకుండా పోతాయి. ఇక రాష్ట్రం వదిలి వెళ్లిపోవాల్సి వస్తుంది' అంటూ సినీ హీరో, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. స్వర్ణాంధ్ర సాకార యాత్రలో భాగంగా శుక్రవారం ఆయన జిల్లాలో పర్యటించారు. ముందుగా మండల కేంద్రమైన గుడ్లూరులో కందుకూరు అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి రోడ్ షో నిర్వహించి, బహిరంగ సభలో ప్రసంగించారు. ఆ తర్వాత రాత్రికి నెల్లూరు చేరుకున్న బాలయ్య నగరంలోని నవాబుపేట సెంటర్ నుంచి గాంధీబొమ్మ వరకు రోడ్ షో నిర్వహించి బహిరంగ సభలో ప్రసంగించారు. ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సిటీ, రూరల్ అభ్యర్థులు పొంగూరు నారాయణ, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలతో కలిసి ప్రచారాన్ని నిర్వహించారు. అడుగడుగునా బాలకృష్ణకు అభిమానులు, టీడీపీ నేతలు గజమాలలతో ఘన స్వాగతం పలికారు. కాగా, సభల్లో బాలకృష్ణ మాట్లాడుతూ కందుకూరు గడ్డపై తెలుగుదేశం జెండా ఎగరాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైసీపీ అభ్యర్థి బుర్రామధుసూదన్ కనిగిరిలో గడిచిన ఐదేళ్లలో చేసిన అభివృద్ధి ఏదీలేదన్నారు. ఇసుక, మట్టి అమ్ముకొని అక్కడ అరాచకపాలన సాగించిన వ్యక్తిని ఇప్పుడు కందుకూరుకు కేటాయించడం అంటే జగన్‌కు ఏమాత్రం అవగాహన కందుకూరుపై ఉందో అర్థమౌతుందన్నారు. ఇక నెల్లూరు నగరాన్ని అభివృద్ధి చేసిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. రూ.581 కోట్లతో భూగర్భ డ్రైనేజీ, రూ.582 కోట్లతో తాగునీటి పథకాల పనులు మొదలుపెట్టి 90 శాతం పూర్తి చేశామని, మిగిలిన పది శాతం పనులను వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని దుయ్యబట్టారు. నగరవాసుల కోసం ఎన్టీఆర్ నెక్లెస్ రోడ్డును నిర్మిస్తే వైసీపీ ప్రభుత్వం దానిని నాశనం చేసిందని విమర్శించారు. బారాషాహీద్ దర్గాకు రూ.20 కోట్లు, రంగనాథ స్వామి ఘాట్ అభివృద్ధికి రూ.16 కోట్లు టీడీపీ ప్రభుత్వం వెచ్చించిందని గుర్తు చేశారు. రూ.56 కోట్లతో 100 పార్కులను అభివృద్ధి చేశామని చెప్పారు. విశాఖను దోచుకున్న ఏ2 విజయసాయిరెడ్డి ఇప్పుడు నెల్లూరుపై వాలారని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కాకమ్మ కబుర్లు చెప్పడంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దిట్టని అని, నోరు తెరిస్తే అబద్ధాలు చెబుతారని దుయ్యబట్టారు. కాకాణి కళ్లు పడితే కబ్జా అవ్వాల్సిందేనని ఆరోపించారు. రాజకీయం అంటే ప్రజా సేవని, కోర్టులో ఫైళ్లు దోచుకోవడం కాదని విమర్శించారు. జిల్లాకు వేమిరెడ్డి ఎంతో సేవ చేశారని, 150 వాటర్ ప్లాంట్లు పెట్టారని బాలకృష్ణ గుర్తు చేశారు. రాజధానితోపాటు నెల్లూరు నగరాభివృద్ధికి కృషి చేసిన వ్యక్తి నారాయణ అని కొనియాడారు. ప్రజాసేవలో ముక్కుసూటిగా మాట్లాడే వ్యక్తి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అని చెప్పారు. వీరిని గెలిపించాలని బాలకృష్ణ అభ్యర్థించారు. రోడ్‌షోలో బాలకృష్ణ వెంట టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ ఇతర నాయకులు ఉన్నారు.



ప్రసంగిస్తున్న బాలకృష్ణ, పక్కన అభ్యర్థులు వేమిరెడ్డి, నారాయణ, కోటంరెడ్డి తదితరులు



గుడ్లూరు : నాగలితో అభివాదం చేస్తున్న బాలకృష్ణ, పక్కన కందుకూరు అభ్యర్థి ఇంటూరి


ఆత్మకూరు, బుచ్చిలలో నేడు ప్రజాగళం


- సభల్లో ప్రసంగించనున్న చంద్రబాబు

నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : ప్రజాగళం కార్యక్రమంలో భాగంగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు శనివారం నెల్లూరు జిల్లాలో పర్యటిస్తున్నారు. మధ్యాహ్నం 1 గంటకు హైదరాబాద్‌లో బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 3 గంటలకు ఆత్మకూరులోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ ఆవరణలోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి బయలుదేరి నెల్లూరుపాలెం జంక్షన్‌కు చేరుకొని ప్రజాగళం సభలో ప్రసంగిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు బుచ్చిరెడ్డిపాళెంలో జరిగి సభలో పాల్గొంటారు. రాత్రికి కేవీఆర్ ఫంక్షన్ హాలులో చంద్రబాబు బస చేస్తారు. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాయి.

రోడ్డుపై చెత్తను ఎత్తాలి.. అందుకు పారిశుధ్య కార్మికులకు జీతాలు లేవు. కాలువల్లో పేరుకుపోయిన పూడిక తీయాలి.. అందుకు అవసరమైన మెటీరియల్ లేదు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలి, మరమ్మతులకు గురైన మోటార్లను బాగు చేయాలి.. కానీ అందుకు అవసరమైన నిధుల్లేవు. పాడైపోయిన వీధిలైట్ల స్థానంలో కొత్తవి వేయాలి.. కానీ పైసల్లేవు... వెరసి ప్రజల ఆర్తనాదాలు, సర్పంచ్‌ల అవస్థలు.. ఇదీ గడిచిన ఐదేళ్లలో క్లుప్తంగా పంచాయతీల పాలన.

పంచాయతీలపై దొంగదెబ్బ!





నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : పల్లెలే దేశానికి వెన్నెముక అన్నారు జాతిపిత మహాత్మా గాంధీ. అటువంటి పల్లెల స్వాభిమానాన్ని వైసీపీ ప్రభుత్వం అణచివేసింది. సొంతంగా పాలన సాగించుకునే గ్రామాల నిధులు, విధులు లాగేసుకొని తొక్కిపెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి పైసా ఇవ్వకపోగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను కూడా లాగేసుకొని పంచాయతీ పాలనను నిర్వీర్యం చేసింది. గడిచిన ఐదేళ్లలో పంచాయతీల్లో చిన్న చిన్న పనులు చేసుకునేందుకు కూడా నిధుల్లేక విలవిల్లాడుతున్నాయి. దీనికితోడు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి పంచాయతీలపై మరింత ఆర్థిక భారాన్ని మోపింది. స్వతంత్ర భారత దేశంలో ఎప్పుడూ ఇటువంటి పరిస్థితిని చూడని సర్పంచ్‌లు రోడ్డెక్కి ఆందోళన చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

ఖాతాల ఫ్రీజ్

రాష్ట్ర ప్రభుత్వ తీరుతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీల ఖాతాల్లో జమ చేస్తామని, అందుకు ప్రత్యేక అకౌంట్లు ఓపెన్ చేయాలని ఆదేశించింది. అలా తెరిచినా పంచాయతీల నిధులపై రాష్ట్ర ప్రభుత్వ పెత్తనం తగ్గలేదు. ఆఖరుకు జనరల్ ఫండ్ ఖాతాలను కూడా ప్రభుత్వం అనేకమార్లు ఫ్రీజ్ చేసింది. నిధులు అవసరమైనప్పుడల్లా పంచాయతీల జనరల్ ఫండ్‌ను లాగేసుకొని, అందులో నుంచి నిధులు డ్రా చేసుకునేందుకు వీల్లే కుండా ఫ్రీజ్ చేసేవారు. కొన్ని నెలల తర్వాత మళ్లీ లాగేసుకున్న నిధులను జమ చేశాక గానీ ఫ్రీజ్‌ను తొలగించే వారు కాదు. దీంతో పంచాయతీలు అనేక అవస్థలు పడ్డాయి.

రూ.395 కోట్లు ఏమయ్యాయి!?

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 970 పంచాయతీలు ఉన్నాయి. వీటికి 2019-20 నుంచి 2023-24 మధ్య కాలంలో 14, 15వ ఆర్థిక సంఘం నిధులు జమయ్యాయి. 2019-20లో రూ.66.15 కోట్లు, 2020-21లో 146.41 కోట్లు, 2021-22లో రూ.66.36 కోట్లు, 2022-23లో రూ.32.79 కోట్లు, 2023-24లో రూ.83.99 కోట్లు, మొత్తంగా గడిచిన ఐదేళ్లలో రూ.395.72 కోట్లు పంచాయతీలకు జమ అయ్యాయి. ఈ ఆర్థిక సంఘం నిధులను మూడు దఫాలు రాష్ట్ర ప్రభుత్వం లాగేసుకుంది. ఎందుకు తీసేసుకుందో కూడా పంచాయతీలకు చెప్పలేదు. దీనిపై సర్పంచ్‌లు పోరాడితే తీరా.. విద్యుత్ బకాయిలకు జమ చేసుకున్నట్లు ప్రకటించింది. అయితే అందుకు సంబంధించిన బిల్లులను మాత్రం పంచాయతీలకు ఇవ్వలేదు. ఒకవైపు ప్రభుత్వమేమో విద్యుత్ బిల్లులకు జమ చేసుకున్నట్లు చెబుతున్నా, ఇంకోవైపు విద్యుత్ శాఖ అధికారులు తమకు డబ్బులు జమకాలేదని, మీరు బిల్లు చెల్లించాలంటూ డిమాండ్ నోటీసులు జారీ చేస్తున్నారు. దీంతో ప్రభుత్వం లాగేసుకున్న డబ్బులన్నీ ఎక్కడికి వెళ్లాయన్నది అర్థం కావడం లేదని పంచాయతీ వర్గాలు చెబుతున్నాయి. 29-03-2021, 21-11-2021, 22-02-2022 తేదీల్లో పెద్ద మొత్తంలో పంచాయతీల ఖాతాల్లో ఉన్న ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం తీసేసుకుంది. అయితే వీటిని ఆడిట్ అధికారులు కూడా విద్యుత్ బిల్లులకు జమ చేసినట్లు గుర్తించలేదు. ప్రభుత్వం తీసుకున్నట్లుగానే రిపోర్టుల్లో నమోదు చేయడం గమనార్హం.

ఎన్నో బిల్లుల పెండింగ్

ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులకు కూడా ఇంకా చాలా పంచాయతీల్లో బిల్లులు చెల్లించలేదు. ప్రజల నుంచి ఒత్తిడి పెరుగుతుండటంతో సొంత నిధులతో సర్పంచ్‌లు పనులు చేశారు. అయితే ఆ బిల్లులు తీసుకునేందుకు కూడా డబ్బుల్లేకపోవడంతో సర్పంచ్‌లో రోడ్డెక్కారు. గ్రామాల్లో అత్యవసర పనులు కూడా చేయలేకపోతున్నామంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రభుత్వంపై పోరాటానికి దిగారు. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. గత ప్రభుత్వంలో చాలా గ్రామాల్లో ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేశారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో వాటి నిర్వహణకు డబ్బుల్లేకపోవడంతో అనేక గ్రామాలు ఇప్పటికీ అంధకారంలోనే మగ్గుతున్నాయి. ఇది చాలదన్నట్టు పంచాయతీల నెత్తిన సచివాలయాల రూపంలో అదనపు భారం వచ్చి పడింది. సచివాలయాల నిర్వహణకు ప్రభుత్వం రూపాయి కూడా ఇవ్వకపోవడంతో ఆ ఖర్చులను కూడా పంచాయతీల ఖాతాల నుంచే భరిస్తున్నారు. వీటికి తోడు భవనాలకు వైసీపీ రంగులు వేయడం, ఆ తర్వాత కోర్టు ఆదేశాలతో వాటిని తొలగించడం వంటి ఖర్చులు కూడా పంచాయతీలను ఆర్థిక ఊబిలోకి నెట్టాయి. అందులోనూ ఆరోగ్య సురక్ష, ఆడుదాం ఆంధ్ర వంటి పలు కార్యక్రమాలు పంచాయతీలను నిండా ముంచాయి.

ఉత్సవ విగ్రహాల్లా మిగిలిపోయాం



వైసీపీ అధికారంలో వచ్చాక పంచాయతీలకు జమ అయిన నిధులను ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వాడేసుకుంటోంది. ముఖ్యంగా టీడీపీ మద్దతుతో గెలిచిన సర్పంచులకు పంచాయతీల్లో జరిగే సమావేశాలకు సమాచారం ఇవ్వకపోవడం, కనీస గౌరవ మర్యాదలు కూడా దక్కకపోవడం సర్పంచు పదవిని అవమానించినట్టేనని భావిస్తున్నాం. అధికార పార్టీకి ఊడిగం చేసే కొంతమంది అధికారుల తీరుతో సర్పంచుల వ్యవస్థ నిర్వీర్యం మారి ఉత్సవ విగ్రహాల్లా మిగిలిపోయాం.

- సూరేపల్లి మాధవ, గంగిరెడ్డిపాలెం, కలిగిరి

మా నమ్మకంపై నీళ్లు చల్లింది



అభివృద్ధి చేస్తామని ప్రజలు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని వైసీపీ ప్రభుత్వం వమ్ము చేసింది. నిధులు లేక పంచాయతీలు గబ్బుకొడుతున్నా ఏం చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయాం. అప్పులు చేసి కొంతకాలం, ప్రజల సహకారంతో పంచాయతీలను నెట్టుకొచ్చాము. పంచాయతీల్లో పైసాలేదు. మళ్లీ ఎన్నికలొస్తున్నాయని కంటితుడుపుగా నిధులు మంజూరైతే చేసిన అప్పులకు వడ్డీలు సరిపోలేదు. పంచాయతీలో జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితిని ఎదుర్కొంటున్నాము.

- రజనీకాంత్, చెల్లాయపాలెం, బుచ్చిరెడ్డిపాలెం

రూ.15 లక్షలు ఖర్చు చేశా!



పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికైన నాటి నుంచి ఇప్పటి దాకా నా సొంత డబ్బు రూ.15 లక్షలు ఖర్చు చేశా. కేంద్రం నిధులిచ్చినా రాష్ట్ర ప్రభుత్వ దాష్టీకానికి బలైపోయాం. మంచి నీరు అందించాలన్నా.. వీధి లైట్లు వేయాలన్నా మా జేబుల్లోనుంచే పెట్టాల్సిందే. పంపు ఆపరేటర్ల జీతాలు, బ్లీచింగ్ కొనుగోలు తదితర పంచాయతీ నిర్వహణకు ఇప్పటి వరకు ఖర్చు చేసిన నిధులు తిరిగి వస్తాయో రావో కూడా తెలియదు.

- ఆట తిరుమల, పడమర గోగులపల్లి, అల్లూరు

రూ.70 లక్షలు లాగేసుకున్నారు!



నేను ఎస్టీ రిజర్వుడు సర్పంచ్‌ని. పంచాయతీ ప్రజలు ఎంతో నమ్మకంతో నన్ను సర్పంచ్‌ను చేశారు. కానీ వారిని సంతృప్తి పరిచేస్థాయిలో పనిచేయలేక పోతున్నా. లక్షల్లో అప్పులు చేసి పంచాయతీలో వీధిలైట్లు, మంచినీటి సరఫరా, మోటార్ల రిపేర్లు తదితర పనులు చేశాను. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులు రాష్ట్ర ప్రభుత్వం రూ.70లక్షలు లాగేసుకుంది. దీంతో పంచాయతీలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. వచ్చిన కొద్దిపాటి నిధులతో ప్రజలకు మౌలిక సదుపాయాలు, సిబ్బందికి జీతాలు ఇస్తూ కాలం వెళ్లదీస్తున్నాం. పంచాయతీలో చిన్నపాటి నిర్మాణపనులు కూడా చేయలేక బాధపడుతున్నాం.

- ఇండ్ల సుదాకర్, బ్రాహ్మణక్రాక, జలదంకి

ఏ పనీ చేయలేకపోతున్నాం

సర్పంచ్‌గా గెలిచినా పంచాయతీలో ఏ అభివృద్ధి పనులూ చేయలేకపోతున్నాము. కేంద్ర ప్రభుత్వం విడుదలచేసే ఆర్థిక సంఘం నిధులు ఇప్పటివరకు మూడుసార్లు పంచాయతీ ఖాతాకు జమ అయ్యాయి. అలా జమ అయిన వెంటనే ఖాతా నుంచి మాయమవుతున్నాయి. పంచాయతీలో మౌలిక వసతులైన వీధి లైట్లు, నీటి సరఫరా, స్వీపింగ్ తదితర పనులు చేసేందుకు డబ్బుల్లేవు. నా సొంత డబ్బులే ఖర్చు చేస్తున్నాం. గత ప్రభుత్వంలో పంచాయతీలో చేసిన పనులకు నగదు మంజూరుకు సదరు కాంట్రాక్టరు కోర్టు నుంచి ఆదేశాలు తెచ్చుకొని ఖాతాలో ఉన్న నగదును ఇవ్వాల్సి వస్తుంది. గత ప్రభుత్వంలో పంచాయతీకి కరెంటు బిల్లులు ఉండేవికావు. ఒకవేళ ఉన్నా ప్రభుత్వమే ఆ బిల్లులు చెల్లించి పంచాయతీలను ఆదుకునేవి. కానీ ఇప్పుడలా లేదు. ఆర్థిక సంఘం నిధులనే కరెంటు బిల్లులకు జమ చేసుకుంటున్నారు.

- బద్దిపూడి మాచర్ల, గుడవల్లూరు, కొండాపురం

ఆశలు రేపిన నిమ్మ

పొదలకూరు: మండు వేసవిలో నిమ్మ రైతుకు మంచి రోజులొచ్చాయి. రెండు రోజులుగా ధర పెరుగుతుండటంతో వారిలో ఆనందం వ్యక్తమవుతోంది. పొదలకూరు నిమ్మ మార్కెట్ యార్డులో శుక్రవారం క్వాలిటీ నిమ్మకాయల బస్తా ధర రూ.9500 పలికింది. ఈ ఏడాదిలో ఇదే అత్యధిక ధర. ఈ నెల మొదటి వారం నుంచి నాల్గవ వారం ప్రారంభం వరకు స్థిరంగా ఉన్న ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఈ నెల 22వతేదీ వరకు లూజు బస్తా ధర రూ.4వేలు నుంచి 5వేల వరకు ఉంది. మంగళవారం రూ.6వేలు ధర పలికింది. అయితే గురువారం ఒక్కసారిగా రూ.8వేలకు చేరుకుంది. శుక్రవారం మరో రూ.1500 పెరిగి రూ.9500లకు చేరుకుంది. పొదలకూరు మండలంలో సుమారు 5వేల హెక్టార్లలో నిమ్మ సాగవుతోంది. ఇక్కడ నుంచి కోల్‌కతా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బీహార్, పంజాబ్, పాట్నా, ఆగ్రా, గయ మార్కెట్‌లకు నిమ్మకాయలను ఎగుమతి చేస్తారు. ఒక్కో బస్తాలో 80 కిలోలు చొప్పున జాగ్రత్తగా పార్శిల్ చేసి పంపిస్తుంటారు. దేశమంతటా ఉష్ణోగ్రతలు పెరిగిన కారణంగా నిమ్మకాయలకు డిమాండ్ పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు.

బాలుడి వైద్యం కోసం ఆర్థిక సాయం

కావలిటౌన్, ఏప్రిల్ 26: నిరుపేద కుటుంబానికి చెందిన చిన్నారి చిరంజీవి అనారోగ్యంతో బాధపడుతుండగా శ్రీ సాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.45,000 ఆర్థిక సాయమందించారు. ట్రస్ట్‌అధ్యక్షురాలు పొన్నగంటి మాధవి అధ్యక్షన జరిగిన కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ఐక్యవేదిక గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాషా చిరంజీవి తల్లి మాలశ్రీకి నగదు అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

శీతల చలివేంద్రం ప్రారంభం

కావలిటౌన్, ఏప్రిల్ 26: కావలి తాలూకా పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ట్రంకురోడ్డు ఫైర్ ఆఫీస్ వద్ద శీతల చలివేంద్రం ప్రారంభించారు. ఈ ప్రాంతంలోని ప్రభుత్వ కార్యాలయానికి వచ్చే ప్రజల కోసం దీనిఇ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఆకుల రమణయ్య, అసోసియేట్ అధ్యక్షుడు రవి కుమార్, కార్యదర్శి సాయిరాంసింగ్, వెంకయ్య, ఆదిశేషులు, కృష్ణారావు, సాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణ పర్యటనతో యూత్‌లో హుషారు

- అంచనాలకు రెట్టింపుగా తరలివచ్చిన యువత
- ఈలలు, కేరింతలతో బాలయ్య ప్రసంగానికి ప్రోత్సాహం

కందుకూరు, ఏప్రిల్ 26: సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పర్యటన యువతలో హుషారు పెంచింది. కందుకూరు నియోజకవర్గం గుడ్లూరులో బాలకృష్ణ బహిరంగ సభకు, అంతకుముందు తెట్టు జంక్షన్ నుంచి గుడ్లూరు వరకు జరిగిన మోటారు సైకిల్ ర్యాలీకి అంచనాలకు మించి యువత తరలిరావడమే కాక కార్యక్రమం ఆద్యంతం కేరింతలు కొడుతూ పాల్గొనటంతో టీడీపీ నాయకుల్లో ఆనందం వెల్లివిరిసింది. మండుటెండను సైతం లెక్కచేయకుండా శుక్రవారం మధ్యాహ్నం నుంచే గుడ్లూ రుకు, జాతీయ రహదారిపై తెట్టు జంక్షన్‌కు చేరుకున్న యువకులు సాయంత్రం 4 గంటల వరకు బాలకృష్ణ కోసం నిరీక్షించి ర్యాలీలో వారు చేసిన సందడి యువతలో తెలుగుదేశం పార్టీకి పెరిగిన ఆదరణను సుస్పష్టం చేసింది. రెండు రోజుల క్రితమే తెలుగు దేశం నామినేషన్ కార్యక్రమం కోసం పెద్దఎత్తున జనసమీకరణ చేసి ఉండ టంతో మళ్లీ బాలకృష్ణ కార్యక్రమానికి జనసమీకరణ అంటే ఇబ్బందిగా ఉం టుందని భావించిన నేతలు కేవలం గురు, శుక్రవారాలలో మైకు ప్రచారం చేసి వదిలేశారు. అంతేగాక కందుకూ రులో అయితే భారీగా జనం వస్తారు కానీ గుడ్లూరు అంటే కష్టమన్న అభిప్రాయం తోనూ ఉన్నారు. అయినప్ప టికీ అంచనాలకు మించి యువకులు తరలిరావటం ముఖ్యంగా మహిళలు, యువతులు, విద్యార్థినీ విద్యార్థినిలు వేలాదిగా తరలిరావటమే గాక బాలకృష్ణ ప్రసంగాన్ని ఆసక్తిగా వింటూ ఆయన మాటలకు ఈలలు కేకలతో మరింత ప్రోత్సాహాన్ని కల్పించడం విశేషం. బాలకృష్ణ పర్యటన అంటే జన సమీకరణ చేయకున్నా స్వచ్ఛందంగా ఐదారు వేలమంది తరలివస్తారన్న టీడీపీ నేతలు అంచనాలు తలకిందులు చేస్తూ అంతకు రెట్టింపుగా యువత తరలిరావటంతో గుడ్లూరు సెంటర్ కిక్కిరిసిపోయింది. గుడ్లూరులో బాలకృష్ణ పర్యటన విజయవంతం కావడంతో ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కందుకూరు అసెంబ్లీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావులు విజయ దరహాసంతో విక్టరీ సింబల్ చూయిస్తూ కార్యక్రమంలో పాల్గొనటం విశేషం. బాలకృష్ణ పర్యటనకు లభించిన విశేష ఆదరణ ప్రజల్లో టీడీపీ పట్ల ఉన్న అభిమానానికి నిదర్శనంగా విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



అభిమానులు, పార్టీ శ్రేణులకు విక్టరీ సింబల్ చూపుతున్న బాలకృష్ణ, పక్కన వేమిరెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు


గుడ్లూరు పర్యటన కోసం వచ్చిన బాలకృష్ణకు కావలిలో ఘన స్వాగతం పలుకుతున్న ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు

పాలూరు ఎస్సీ కాలనీలో
పలువురు టీడీపీలో చేరిక

కందుకూరు, ఏప్రిల్ 26: కందుకూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలోకి వలసల పర్వం కొనసాగుతోంది. కందుకూరు మండలంలోని పాలూరు ఎస్సీ కాలనీలో పలు కుటుంబాల వారు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎస్సీ కాలనీకి చెందిన జలదంకి సురేష్, ఉపసర్పంచ్ దంతం సౌమ్య, దంతం ఏసుబాబు, ఆదిపోగు ప్రసాద్, రావినూతల కోటేషు, సర్వేపల్లి వంశీ, రావినూతల శ్రీనివాసులు, దంతం బాలకోటయ్య, మోషే, చినకొండయ్య, ప్రకాశం, రావినూతల కొండలరావు, రావినూతల కళ్యాణ్, రావినూతల సురేంద్ర, జలదంకి ఇజ్రాయిల్, అంగులకుర్తి ఏసుమణి, గౌడపేరు రమేష్, ఎండ్లూరి ఆదెమ్మ, దంతం విజయకుమారి, దంతం చినకోటయ్య రావినూతల మాలకొండయ్య, జలదంకి ఏసోబు, వినోద్ తదితర కుటుంబాల వారికి టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుకండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీకి మద్దతిచ్చిన ప్రతిఒక్కరికీ భవిష్యత్తులో తగినప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు సూరే వినోద్‌కుమార్‌రెడ్డి, జలదంకి సురేష్, మండల పార్టీ అధ్యక్షుడు నార్నె రోశయ్య, పార్టీ నాయకులు ఎస్వీ సుబ్బారావు, గొట్టిపాటి హరికృష్ణ, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రావుల రవి తదితరులు పాల్గొన్నారు.


పాలూరు ఎస్సీ కాలనీ వాసులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు

ప్రచార అస్త్రంగా...
ట్రంకురోడ్డు విస్తరణ!

- ఐదేళ్లు పదే పదే చెప్పిన ఎమ్మెల్యే
- కార్యరూపం దాల్చని హామీలు
- వ్యాపారంగా మారిన ఆక్రమణల తొలగింపు
- టీడీపీ సానుభూతిపరులే టార్గెట్‌గా ధ్వంసం
- అసంపూర్తిగా సైడ్ కాలువల నిర్మాణం

కావలిటౌన్, ఏప్రిల్ 26: కావలి ట్రంక్‌రోడ్డు విస్తరణ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి ప్రచార అస్త్రంగా మారింది. గడిచిన ఐదేళ్లలో వంద కోట్లతో పనులు చేపడుతున్నట్లు పదే పదే తెగ ప్రచారం చేసుకున్నారు. ఆయన పదవీ కాలం ముగుస్తోంది తప్ప హామీ మాత్రం కార్యరూపం దాల్చలేదు. రోడ్డు విస్తరణ పనులు అంగుళం ముందుకు కదలకపోయినా రోడ్డుకు ఇరు వైపుల చేపట్టిన సైడ్ కాలువల నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో రోడ్డుపై ఎక్కడి మురుగు అక్కడే నిల్వ చేరి దుర్గంధభరితంగా మారింది. వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ట్రంకురోడ్డు అభివృద్ధికి వంద కోట్లు మంజూరయ్యాయని, ముందుగా సైడ్ కాలువ నిర్మాణం చేపట్టి అనంతరం రోడ్డు వెడల్పు పనులు, డివైడర్లు, ఆకర్షణీయంగా చెట్లు, సెంట్రల్ లైటింగ్, చేపడతామన్న ఎమ్మెల్యే హామీ నీటి మూటలుగా మిగిలాయి.

- ట్రంకురోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా అప్పట్లో వైసీపీ నేతల కనుసన్నల్లో ఆర్‌అండ్‌బీ అధికారులు చేపట్టిన ఆక్రమణల తొలగింపు వ్యాపారంగా మారి అధికారులు, నేతలు జేబులు నింపుకున్నారు. సైడ్ కాలువల నిర్మాణం పేరుతో అధికారులు మొదటి రెడ్ మార్కింగ్ వేశారు. అధికారపార్టీ నేతలు పైకం పుచ్చుకుని అధికారులకు వాటా ఇచ్చి సిఫారసు చేసిన గృహాలకు మినహాయింపు ఇచ్చారు.
- ఆక్రమణల తొలగింపులో టీడీపీ నేతలు, సానుభూతిపరుల టార్గెట్‌గా హడావుడిగా గృహాలు, ప్రహరీ గోడలు నిర్ధాక్షిణ్యంగా పగలగొట్టారు. అయితే 5 ఏళ్లు గడిచినప్పటికీ కాలువల నిర్మాణం అసంపూర్తిగా వదిలేయడమేకాక ట్రంకురోడ్డు విస్తరణ పనుల ఊసేలేదు.
- దుర్గంధ భరితం

పట్టణంలోని బృందావనం హౌసింగ్ కాలనీ వద్ద నుంచి ముసునూరు చివరి వరకు ట్రంకురోడ్డుకి ఇరువైపుల సైడ్ కాలువల నిర్మాణం ప్రారంభించి దాదాపు 4 ఏళ్ళు పూర్తి కావస్తోంది. కాలువల నిర్మాణం పూర్తిగా చేయక అసంపూర్తిగా వదిలివేయడంతో ప్రజల అవస్థలు వర్ణణాతీతం. ముక్కలు ముక్కలుగా కాలువ నిర్మాణ పనులు చేపట్టి వాటిని అనుసంధానం చేయకపోవడంతో కాలువల్లో మురుగు ఎక్కడికక్కడ నిల్వ చేరి దుర్గంధం వెదజల్లడమేకాక ప్రాంతీయుల మధ్య వివాదాలకు దారి తీస్తోంది.


ట్రంకురోడ్డులో నిలిచిపోయిన కల్వర్టు నిర్మాణం


ఆటోనగర్ వద్ద అసంపూర్తిగా కాలువ పనులు

- అవస్థల్లో ప్రజలు

అక్కడక్కడ కనెక్షన్ రోడ్ల వద్ద కాలువ నిర్మాణం కోసం తవ్వి కల్వర్ల్‌ల నిర్మాణం చేపట్టక వదిలివేయడంతో రాకపోకవలు సాగించేందుకు నానా ఇబ్బందులు పడ్డ ప్రజలు స్థానికులందరూ కలిసి వారే మట్టితో గుంటలను పూడ్చుకుని రాకపోకవలు సాగిస్తున్నారు. అరకొరగా కాలువ నిర్మాణం చేపట్టిన ప్రాంతాల్లో చుట్టుపక్కల ప్రజలు సైడ్‌కాలువల్లో పైపులు వదులుకోవడంతో మురుగు ముందుకు ప్రవహించకపోవడంతో ట్రంకురోడ్డు ఆనుకుని ఉన్న గృహాలు, షాపుల యజమానులు దుర్గంధం భరించలేక స్థానికుల మధ్య వివాదాలకు దారితీస్తోంది. కాలువల నిర్మాణానికి ఎప్పటికి మోక్షం లభిస్తుందో వేచి చూడక తప్పదు.

ట్రంకురోడ్డు విస్తరణ పేరుతో విధ్వంసం

ట్రంకురోడ్డు విస్తరణ పేరుతో టీడీపీ శ్రేణులను లక్ష్యంగా చేసుకుని వారి ఆస్తులను ధ్వంసం చేసారేగాని రోడ్డు విస్తరణ పనులు అంగుళం జరిగిన పాపాన పోలేదు. అధికారులు వైసీపీ నేతల కనుసన్నల్లో అడ్డగోలుగా ఆక్రమణల తొలగింపు చేపట్టి పక్షపాతంగా వ్యవహరించారు. ఆటోనగర్ వద్ద కల్వర్ట్ నిర్మాణం చేపట్టిన ప్రదేశంలో రోడ్డు దరిద్రంగా మారి వాహనాలు రాకపోకలు సాగించడం నరకంగా మారింది.

- వెంకటేశ్వర్లు, ముసునూరు

మిషన్ లెర్నింగ్ అండ్ డీప్ లెర్నింగ్ పుస్తకావిష్కరణ

బిట్రగుంట, ఏప్రిల్ 26: బోగోలు మండలం కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ పీ.దిలీప్‌కుమార్, ఏ.నందినిలు రూపొందించిన మిషన్ లెర్నింగ్ అండ్ డీప్ లెర్నింగ్ పుస్తకాని ప్రిన్సిపాల్ పీవీఎన్ రెడ్డి శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడుతూ ఈ పుస్తకంలో పొందుపరచిన విషయాలు బీటెక్ విద్యార్థులకు ఎంతగానో తోడ్పడుతాయని తెలిపారు. ఈ పుస్తకప్ప ప్రత్యేకత మిషన్ రన్నింగ్ టెక్నిక్స్, రోల్ ఆఫ్ డీప్ లెర్నింగ్ ఇన్ ఇంప్రూవింగ్ హెల్త్ కేర్, రోల్ ఆఫ్ ఎంఎల్ అండ్ డీ ఎల్ ఆన్ కోవిడ్ మేనేజిమెంట్ పై ఫోకస్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఆర్వీ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా 'ఉపాధి' పనులు

వలేటివారిపాలెం, ఏప్రిల్ 26 : మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. శుక్రవారం 2400 మంది కూలీలు పనులకు హాజరైనట్లు ఏపీవో ఉమామహేష్ తెలిపారు. నలదలపూరులో మాత్రమే పనులు ప్రారంభం కాలేదు. వలేటివారిపాలెం, జమీన్‌ఉప్పలపాడు గ్రామాల్లో వ్యవసాయ పనులు జరుగుతున్నందున తక్కువ సంఖ్యలో కూలీలు హాజరయ్యారు. ప్రతి రోజూ ఉదయం 6 గంటలకే కూలీలు పనులకు వెళ్లి వడదెబ్బకు గురికాకుండా 10 గంటలకు ఇళ్లకు వచ్చేస్తున్నారు.


కళవళ్లలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కందుకూరులో ఒక నామినేషన్ తిరస్కరణ

కందుకూరు, ఏప్రిల్ 26: కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 25 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా శుక్రవారం జరిగిన స్క్రూట్నీలో ఒకరి నామినేషన్ తిరస్కరించారు. మిగిలిన 24 మంది నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టరు విద్యాధరి ఆమోదించారు. టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య టీడీపీ అభ్యర్థిగా వేసిన నామినేషన్‌కు బీఫాం సమర్పించకపోవటంతో ఆమె నామినేషన్‌ను తిరస్కరించారు. వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ సతీమణి లక్ష్మి కూడా నామినేషన్ వేసినప్పటికీ ఆమె ఇండిపెండెంట్‌గా తన నామినేషన్‌ను దాఖలు చేయటంతో ఆమె నామినేషన్‌ను ఆమోదించారు.

కావలిలో 10 నామినేషన్లు...

కావలి : కావలి అసెంబ్లీ నియోజకవర్గంలో 25 మంది నామినేషన్లు వేశారు. నామినేషన్ల పరిశీలన అనంతరం వివిధ కారణాలతో 10 నామినేషన్లను తిరస్కరించినట్లు కావలి రిటర్నింగ్ అధికారి శీనానాయక్ తెలిపారు. తిస్కరణకు గురైనన వారిలో వైసీపీ నుంచి రామిరెడ్డి ఆదిలక్ష్మి, టీడీపీ నుంచి దగుమాటి సంహిత, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుంచి లేళ్లపల్లి సురేష్‌బాబు, రెవల్యూషన్ సోషలిస్ట్ పార్టీ నుంచి గోసల రవికాంత్, జైభీమ్‌రావు భారత్‌పార్టీ నుంచి షైనంపాటి ఏసురత్నం, సమాజవాదిపార్టీ నుంచి లత ఆనం, యంగ్‌సీనియర్‌రిచ్ కామన్ పీపుల్‌కింగ్స్ పార్టీ నుంచి ఉప్పాల రవికిరణ్, స్వతంత్ర అభ్యర్థులు రాచూరు వెంకటసుబ్బారావు, గాలి రవి, బచ్చల సంధ్యారాణిలు ఉన్నట్లు ఎన్నికల రిటర్నిగ్ అధికారి తెలిపారు.

టీడీపీని గెలిపిస్తేనే వెనుకబడిన వర్గాల అభ్యున్నతి

అల్లూరు, ఏప్రిల్ 26 : టీడీపీని గెలిపిస్తేనే వెనుకబడిన వర్గాల అభివృద్ధికి అవకాశం లభిస్తుందని కావలి టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అల్లుడు బినీత్‌రెడ్డి అన్నారు. ఆయన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మేనల్లుడు ఎ.చందన్‌రెడ్డితో కలిసి శుక్రవారం నార్తుఆములూరు పంచాయతీలో ఎన్నికల ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఎదుర్కొన్న సమస్యలు తీరాలంటే టీడీపీని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గుంజి రుద్రయ్య, దాసరి ప్రభాకర్, పెయ్యల భాస్కర్, చల్లా రమణయ్య, తిరుపయ్య, బాబు, కరుణాకర్, శీనయ్య, మల్లికార్జున పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి కోసం కష్టపడి పనిచేద్దాం

బిట్రగుంట : ఆంధ్రరాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందాలంటే టీడీపీ ప్రభుత్వం రావాలని, అందుకోసం జనసేన, బీజేపీ, టీడీపీ నేతలు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోదరుడు వేమిరెడ్డి వినోద్‌రెడ్డి అన్నారు. బోగోలు మండలం విశ్వనాధరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేట జనసేన కార్యాలయంలో శుక్రవారం ఆయన స్థానిక నేతలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి అసెంబ్లీ అభ్యర్థి దగుమాటి క్రిష్ణారెడ్డిలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు సురేష్, జిల్లా అధికార ప్రతినిధి కే.కృష్ణారెడ్డి, అఖిలభారత చిరంజీవి ఫ్యాన్స్ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ.రవికుమార్, పద్మనాభరెడ్డి, కావలి టౌన్ అధ్యక్షుడు పబ్బాసాయి, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురి చేరిక

బోగోలు మండలం ఉమామహేశ్వరపురంలో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు శుక్రవారం ఇంటింటి ప్రచార నిర్వహించారు. చంద్రబాబునాయుడు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపేట వైసీపీ ముస్లిం మైనార్టీ నాయకులు షేక్.రఫీ అతని అనుచరులతో టీడీపీలో చేరారు. కాంద్ర సతీష్‌నాయుడు అధ్యక్షతన దగుమాటి క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో నాగులవరంకి చెందిన పలువురు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎల్.సుధీర్‌బాబు, కే.తిరుమలేష్, అహ్మద్‌బాషా, గట్టాలక్రిష్ణయ్య, సుబ్బయ్య, సతీష్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల ఇంటింటా ప్రచారం

జలదంకి : మండలంలోని గట్టుపల్లి పంచాయతీ కర్కోలువారిపాలెం, చింతలపాలెం గ్రామాల్లో శుక్రవారం టీడీపీ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. ఎన్డీఏ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లకు సైకిల్‌గుర్తుపై ఓటేసి గెలిపించాలని నాయకులు కొల్లా క్రిష్ణ, గ్రంధి రాజగోపాల్, గొట్టిపాటి ప్రసాద్‌నాయుడు, నలమోతు చెంచునాయుడు, మనోజ్, కాకర్లట్రస్ట్ సభ్యుడు దర్గాబాబులు కోరారు.

భీమవరప్పాడులో...

కొండాపురం : మండలంలోని భీమవరప్పాడులో టీడీపీ, జనసేన నాయకులు శుక్రవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. టీడీపీ మ్యానిఫెస్టోలోని సూపర్‌సిక్స్ కరపత్రాలను ప్రజలకు అందచేశారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థులుగా పోటీలో ఉన్న ఉదయగిరి ఎమ్మెల్యేగా కాకర్ల సురేష్‌ను, నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచు చాగంటి క్రిష్ణ, జనసేన నాయకుడు తిప్పినేని రమేష్, జనసేన మండల ఉపాధ్యక్షుడు కాకుటూరు రాఘవేంద్ర, టీ.రహమంతు, కే.దొరబాబు, కే.రమేష్, జీ.పేరయ్య, జీ.మాధవ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోదండరాముడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు


ప్రతిష్ఠిస్తున్న ధ్వజస్తంభం

వలేటివారిపాలెం, ఏప్రిల్ 26 : మండలంలోని కాకుటూరులో శుక్రవారం సీత, లక్షణ, హనుమాన్ సమేత కోదండరాముడి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు వైభవంగా జరిగాయి. నూతన ఆలయం ముందు శిఖర జీవధ్వజ స్తంభం ప్రతిష్ఠించారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు ధ్వజస్తంభం ముందు కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. కార్యక్రమాలలో కందుకూరు వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

జగన్ పాలనపై విసుగెత్తిన ప్రజలు

- కావలి ఎమ్మెల్యే అరాచకాలకు అడ్డూ అదుపు లేదు
- కావలి రూరల్, పట్టణంలో కావ్య విస్తృత ప్రచారం


కావలి 30వ వార్డులో టీడీపీ కార్యాలయం ప్రారంభిస్తున్న క్రిష్ణారెడ్డి


బిట్రగుంట ప్రసన్నుడి ఆలయ చైర్మన్ శ్రీరాం మాల్యాద్రితో కావ్య

కావలి, ఏప్రిల్ 26: ఈ ఐదేళ్లలో సైకో జగన్ పాలనతో విసిగి వేసారిన ప్రజలు చంద్రబాబు నాయుడు సారథ్యంలోని టీడీపీ ప్రభుత్వం కోసం ఎదురు చూస్తున్నారని టీడీపీ కూటమి అభ్యర్థి దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం ఆయన కావలి పట్టణంలో 28, 30 వార్డులలో, సాయంత్రం కావలి రూరల్ మండలం చెంచుగాని పాలెం, చెన్నాయపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రూరల్ మండలంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్నివిధాలా భ్రష్టు పట్టించిన జగన్‌రెడ్డి తన కుటుంబంలోనే చెల్లెళ్లు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక నీళ్ల నములుతున్నారన్నారు. వైసీపీకి ఓటు వేస్తే విధ్వంసమేనని ప్రతి ఒక్కరూ రాష్ట్ర భవిష్యత్తు, మీ బిడ్డ భవిష్యత్తును గుర్తు పెట్టుకుని టీడీపీకి ఓటు వేసి చంద్రబాబు నాయుడిని సీఎంగా చేసుకోవాలన్నారు. కావలి ఎమ్మెల్యే అరాచకాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందని ఇసుక, మట్టి, గ్రావెల్ తదితర సహజవనరులు అన్నీ దోపిడీ చేశారన్నారు. అవినీతిపై ప్రశ్నించిన వారిపై దాడులు చేయించారన్నారు. ఎలాంటి అభివృద్ధి లేకుండా మాటలు చెప్పి మభ్యపెడుతున్న ఈ అరాచక ఎమ్మెల్యేను తరిమి కొట్టాలన్నారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే కావలినియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చేసి పరిశ్రమలు తెచ్చి యువతకు ఉపాధి అవకాశం కల్పిస్తానన్నారు. ఈ కార్యక్రమాలలో రూరల్ మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల రామకృష్ణ, ఉప్పాల వెంకట్రావు, బీజేపీ మండల అధ్యక్షుడు మామిడి వెంకటేశ్వర్లు, జనసేన మండల అధ్యక్షుడు తిరుపతి స్వామి, మాజీ జడ్పీటీసీ నాయుడు రాంప్రసాద్, టీడీపీ నేతలు నాసిన జాలరావు, పోసిన శ్రీనివాసులు, దద్దాల ప్రభాకర్, తాతా హరిబాబు, పర్రి రమణయ్య, దద్దాల రామక్రిష్ణ, కోసూరి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

- రాక్షస పాలన అంతమొందించేందుకే కూటమి

రాష్ట్రంలో నడుస్తున్న వైసీపీ రాక్షసపాలనను అంతమొందించేందుకే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయని కూటమి అభ్యర్థి క్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని 30 వార్డులో ఏర్పాటు చేసిన టీడీపీ కార్యాలయాన్ని శుక్రవారం ఉదయం ఆయన ప్రాంభించి పలువురు నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం 28, 30 వార్డులలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి ఖావటం ఖాయమన్నారు. పట్టణంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా కొండ బిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి క్రిష్ణారెడ్డిని కలిసి తమ మద్దతు తెలిపారు. క్రిష్ణారెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని దివంగత మాజీ ఏఎంసీ చైర్మన్ గ్రంధి యానాదిశెట్టి కోరికని, దానిని నెరవేర్చేందుకు ఆయన తరుపున తాము కృషి చేస్తామని మాల్యాద్రి తెలిపారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ నాయకలు మలిశెట్టి వెంకటేశ్వర్లు, పోతుగంటి అలేఖ్య, గాదంశెట్టి వేణుగోపాల్, నాగిశెట్టి మాలకొండయ్య, గంగు చంద్రశేఖర్, సురేష్, పవన్, రవి లతో పాటు బీజేపీ నేతలు కందుకూరి వెంకటసత్యనారాయణ, జీ.భరత్‌కుమార్, సీవీసీ సత్యం తదితరులు పాల్గొన్నారు.


చెంచుగానిపాలెంలో ఓటు వేయమని ప్రజలను అభ్యర్థిస్తున్న టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి

బాలయ్యకు కావలిలో ఘన స్వాగతం


బాలకృష్ణకు స్వాగతం పలుకుతున్న కావ్య క్రిష్ణారెడ్డి

కావలి, ఏప్రిల్ 26: స్వర్ణాంధ్ర సాకార యాత్రలో భాగంగా కందుకూరు నియోజకవర్గానికి వెళ్లేందుకు శుక్రవారం మధ్యాహ్నం కావలి జడ్పీ క్రీడామైదానంలోని హెలిపాడ్‌లో దిగిన సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే అభ్యర్థి నందమూరి బాలకృష్ణకు నేతలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. కూటమి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరు నాగేశ్వరరావులతో పాటు పలువురు టీడీపీ నాయకులు, నందమూరి అభిమానులు, టీడీపీ కార్యకర్తలు తదిరులు బారీగా హెలిపాడ్ వద్దకు చేరుకున్నారు. బాలయ్యను కలిసేందుకు నందమూరి అభిమానులతో పాటు యువత పోటీపడ్డారు. బాలయ్య కావలిలో దిగుతున్న విషయం తెలుసుకున్న టీడీపీ అభిమానులు కూడా ఎక్కువ సంఖ్యలో అక్కడకు చేరుకోవటంతో ఆ ప్రాంతమంతా కిటకిటలాడింది. కూటమి అభ్యర్థులు బాలయ్యను కలిసి పుష్పగుచ్ఛాలు అందచేసిన తర్వాత కొంత సేపు ఆయనతో ముచ్చటించారు. అనంతరం టీడీపీ కందుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలతో కలసి కందుకూరు నియోజకవర్గం గుడ్లూరుకు కారులో రోడ్డు మార్గంలో బయలుదేరి వెళ్లారు.



కీలకం

నారీలోకమే న్యాయనిర్ణేతలు !

- అభ్యర్థుల గెలుపోటములు వారిపైనే..
- అన్ని సెగ్మెంట్లలోనూ వారి సంఖ్యే అధికం

సంగం, ఏప్రిల్ 26: జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానానికి మే13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో మహిళా ఓటర్లే కీలకంగా మారారు. మొత్తం 19,35,923 మంది ఓటర్లు ఉండగా, పురుషులకంటే 41,235 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలకు గానూ సర్వేపల్లిని తిరుపతి లోకసభ పరిధిలోకి మార్చారు. మిగిలిన నియోజకవర్గాల్లో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఇందులో అత్యధికంగా నెల్లూరు రూరల్‌లో 1,43,111 మంది మహిళా ఓటర్లు ఉండగా, 1,37,856 మంది మహిళా ఓటర్లతో కోవూరు రెండవ స్థానంలో ఉంది. ఈ నేపథ్యంలో అభ్యర్థుల విజయావకాశాలను వారు నిర్ణయించనుండగా, వారి కోసమే మేనిఫెస్టోలో ప్రత్యేక పథకాలు ప్రకటిస్తున్నారు. కొత్తకొత్త పథకాలతో వారిని ఆకర్షించే పనిలో పార్టీలు తలమునకలయ్యాయి.

నియోజకవర్గం	మహిళా ఓటర్లు	పురుష ఓటర్లు	ఇతరులు
ఆత్మకూరు	109152	105466	8
ఉదయగిరి	121183	119451	10
కందుకూరు	115373	112917	26
కావలి	120969	116689	28
కోవూరు	137856	128580	25
నెల్లూరు సిటీ	122046	116111	67
నెల్లూరు రూరల్	143111	135602	20
సర్వేపల్లి	118889	112528	26
మొత్తం ఓటర్లు	9,88,579	9,47,344	210

కుటుంబమైనా..

బాబాయ్ అటు.... అబ్బాయ్ ఇటు !!

- ఎంవీ రామిరెడ్డి వర్సెస్ చిరంజీవిరెడ్డి




ఎంవీ రామిరెడ్డి



చిరంజీవిరెడ్డి

ఉదయగిరి నియోజకవర్గంలోని కలిగిరి మండలం రాజకీయంగా ప్రత్యేకతను సంతరించుకుంది. మండలంలోని అనంతపురం గ్రామవాసి మెట్టుకూరు వెంకట రామిరెడ్డి, మెట్టుకూరు చిరంజీవిరెడ్డిలు బాబాయ్, అబ్బాయ్‌లు. వారు ఒకే కుటుంబంలోని సభ్యులైనా రాజకీయ విభేదాలతో ఇద్దరూ వేర్వేరు పార్టీల్లో కొనసాగుతున్నారు. అయితే చిరంజీవి రెడ్డి ఇటీవల వైసీపీ నుంచి లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరారు. అయితే తాను టీడీపీలో ఉన్నా, ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ తన స్వగ్రామంలో కూడా తమకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఎన్నికల ప్రచారం నిర్వహించడం, తదితర కారణాలతో తన అనుచరులతో ఎంవీ రామిరెడ్డి వైసీపీలోకి చేరడం దాదాపుగా ఖాయమయినట్లు సమాచారం. ఈ పరిణామాలతో మండలంలో రాజకీయం ఏ మలుపు తిరుగుతుందో వేచి చూడాలి.

- కలిగిరి



గోడమీద పిల్లులు

అక్కడా వారే.. ఇక్కడా వారే !

ఎన్నికలు వచ్చాయంటే కొందరికి పండుగే. ఎన్ని కలప్పుడు వీరు చేసే హడావిడి అంతా ఇంతా కాదు.. ఆపార్టీ ఈపార్టీ అనే తేడా లేకుండా అన్నిచోట్లా వీరే కనిపిస్తుంటారు. ఎక్కడికెళ్లినా పాదరసంలా వారితో అంటుకుపోతారు. ఆ అభ్యర్థి విజయం కోసం పనిచేస్తు న్నట్లు బిల్డప్ ఇస్తుంటారు. ఉదయం ఓ పార్టీ అభ్యర్థి వద్ద హడావిడి చేసి, సాయంత్రానికి మరో పార్టీ వద్ద అదే హడావిడి చేస్తారు. ఇలాంటివి రాజకీయాల్లో సహజమే కానీ, గతంలో అలాంటి వారిని ఇట్టే కనిపెట్టేసే వారు. ఎందుకంటే వారిసంఖ్య చాలా పరిమి తంగా ఉండేది. ఈసారి కందు కూరు నియోజక వర్గంలో వీరి సందడి ఎక్కువగా కనిపిస్తోంది. టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌లు ఇద్దరూ రాజకీయాలకు కొత్త కావటం బుర్రాకు అయితే ఈ ప్రాంతంలో పరిచయాలు కూడా చాలా పరిమితంగా ఉన్నాయి. దీంతో వీరి ఆటలు సాగుతున్నాయి. నిన్న మొన్నటి వరకు ఇండిపెండెంట్‌గా పోటీకి సన్నద్ధమైన ఇంటూరి రాజేష్ కూడా బరిలో ఉండటంతో ముగ్గురి వద్ద సందడి చేసిన వీరు ప్రస్తుతం ఇద్దరివద్దే హడావిడి చేస్తున్నారు. ఓటర్లకు విందులు, బహుమతుల ప్రదానం చేసే సమయంలో వీరిదే సందడి .వివిధ సంఘాల లోను వీరే కనిపించటం మరీ విచిత్రం. ఇప్పుడే ఇలా ఉంది ఇంకా ప్రచారం ఊపందు కుంటే ఎన్ని వింతలు చూడాల్సి వస్తుందో నన్న పలువురు పేర్కొన్నారు.


- కందుకూరు

విజయం ఎవరిదైనా ఓటమి నాదే!

- ఉదయగిరి నియోజకవర్గ ఆత్మఘోష



అయ్యా.. నేను గుర్తున్నానా!? జిల్లా కేంద్రానికి విసిరేసినట్టు.. కరువుకు కేంద్రబింధువుగా ఉంటున్న నేనేనయ్యా ఉదయగిరి నియోజకవర్గాన్ని. ఇక్కడున్న నా బిడ్డలు చేస్తే సేద్యం చేయాలా లేదా!? కన్నవారిని, ఉన్న ఊరును వదిలి రెక్కల కష్టాన్ని నమ్ముకుని వలసెళ్లాలా!? ప్రతి ఎలచ్చన్లోనూ నాయకుల వాగ్దానాలు నమ్మి నా బిడ్డలు వారిని గెలిపిస్తున్నారు. తీరా వారు పదవిలోకి వచ్చాక నా బిడ్డలు మాత్రం ఓడిపోతూనే ఉన్నారయ్యా!? ఈసారైనా నా ఆత్మఘోషను వినండయ్యా...



1952లో పుట్టిన నాకు దుత్తలూరు, ఉదయగిరి, వరికుంటపాడు, సీతారామ పురం, జలదంకి, వింజమూరు, కొండాపురం, జలదం కి మండలాలు పరిధి. 322 పోలింగ్ కేంద్రాలున్నాయి. 2,40,644 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 1,19,451 మంది మగవారు, 1,21,183 మంది మహిళలు, 20 ఇతర ఓటర్లు ఉన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 14 పర్యాయాలు, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక రెండుసార్లు మొత్తం 16 సార్లు నాకు ఎన్నికలు జరిగాయి. ప్రతి ఎన్నికల్లోనూ నాయకులు వాగ్దానాలు చేయడం, వాటిని నమ్మి నా బిడ్డలు వారిని గెలిపించడం పరిపాటిగా మారింది. కానీ సమస్యలు ఎక్కడికక్కడ ఉండిపోయాయి.

పాతతరంలో బెజవాడ గోపాల్‌రెడ్డి మొదలు అఖిలభారత స్థాయికి ఎదిగిన వెంకయ్యనాయుడు, మంత్రిత్వం వహించిన మాదాల జానకీరాం, కాంట్రాక్ట్ రంగంలో మేటిగా ఉన్న మేకపాటి తదితర ఉద్ధండులకు రాజకీయ జన్మన్నిచ్చాను. ప్రస్తుతం రాజకీయాలు నడిపిస్తున్న కంభం, బొల్లినేని రాజకీయ ఎదుగుదలకు తోడ్పడ్డాను. ప్రస్తుత ఎన్నికల్లో కొత్తతరం నేతలు బరిలోకి దిగారు. సంతోషం. కానీ దుర్గం పర్యాటక కేంద్రం చేస్తామంటూ నేతలు చేసిన వాగ్దానాలు రింగురింగున మోగుతూ ఉంటే నాతోపాటు నా ప్రజలు దగాకు గురవుతున్నారు.

దశాబ్దాలు దాటినా పచ్చటి పంటలకు నీరిచ్చే దశకు చేరుకోలేదంటే వ్యవసాయపరంగా చెందిన అభివృద్ధి చెప్పుకోలేక పోతున్నాను. గండిపాళెం జలాశయ ఆయకట్టు 16 వేల ఎకరాలకు చేరుకోక జాతికి అంకితం ఇవ్వలేదు. నక్కలగండి, మర్రివూట్ల కళ్లముందు కనిపిస్తున్నా ప్రయోజనం అంతంత మాత్రమే. సోమశిల జలాలు తరలింపు నేతలు మరిచినా నేనింకా మర్చిపోలేదు. వెలిగొండలో అంతర్భాగమైన సీతారాంసాగర్ రైతులకు ఊహాలోకంలో విహరించేలా ఎక్కిరిస్తోంది. అన్నదాతలు వ్యవసాయ కూలీలుగా మారుతున్నా నేతలకు కనబడటంలేదు. నా గడ్డమీద పుట్టి నా అభివృద్ధి గురించి ఎన్నికల్లో ప్రస్తావిస్తూ నన్ను మోసం చేస్తుంటే సిగ్గుపడుతున్నా. రవాణా పరంగా నా స్టైలే వేరు. నడికుడి రైలు మార్గం వయా ఉదయగిరి మీదుగా వస్తుందంటే చాలా సంతోషపడ్డా. బ్రిటీష్ కాలం నుంచి నేటికీ హామీల మీద హామీలు ఇస్తున్నా ఇంకా అందుబాటులోకి రాలేదు. ఇక రోడ్ల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. ఉదయగిరి, వింజమూరు, కలిగిరి లాంటి పట్టణాల్లో జనాభాకు తగిన విధంగా ఓవర్‌హెడ్ ట్యాంకులు, పంపింగ్ స్కీములు లేక ప్రజలు పడేపాట్లు అన్నీఇన్నీకావు. ఫ్లోరైడ్ భూతం నా నియోజకవర్గ బిడ్డలను పట్టిపీడిస్తూనే ఉంది. నిరుద్యోగులు వీధిన పడ్డా పరిశ్రమలు స్థాపించక పోవడం నా నాయకులకే చెల్లింది. పార్టీల కన్నా వ్యక్తులు, గ్రూపులు కన్నా కులం, రాయలసీమ సంస్కృతి పరికిపుచ్చుకున్న ఉదయగిరిపై నేతలు ఎప్పుడు దయ చూపిస్తారో... ఆనాడే నాకు గెలుపు. అప్పటి వరకు ఎదురుచూస్తూ ఉంటా..

ఇట్లు
ఉదయగిరి నియోజకవర్గం

- ఉదయగిరి

భోజనం పెట్టి.. మందు ఇవ్వలేం !

రెండింటికీ కలిపి ఈ 'లెక్క' తీసుకోండి

మీరంతా మా పార్టీ ప్రచారాలకు రండి... అభ్యర్థితోపాటు తిరగండి.... అయితే గతంలో మాదిరిగా భోజనం పెట్టి మందు సీసా మాత్రం ఇవ్వలేం.... ఆ రెండింటికి కలిపి ఇదిగో ఇంత దినకూలి తీసుకోండి.... అని ద్వితీయశ్రేణి నాయకులు ప్రచారానికి వచ్చే వారికి చెబుతున్నారు. ఈ సారిరోజులు బాగాలేవు. ఎన్నికల అధికారుల నిఘా పెంచారు. మందు సీసా కనపడితే ఎత్తుకెళ్లిపోతున్నారు. పైగా కేసులు కూడా పెడుతున్నారు. మా ఇబ్బందులును మీరు అర్థం చేసుకోండి. ఉదయం రెండు గంటలు, సాయంత్రం రెండు గంటలు వస్తే సరిపోతుంది. మధ్యాహ్నం ఇంటికి వెళ్లిపోయి భోజనం చేసుకుని రండి. సాయంత్రం ఇంటికి వెళ్లేటప్పుడు కూలి ఇచ్చేస్తాం... దాదాపుగా అన్నీ పార్టీల ప్రచారాల్లో ఇదే జరుగుతోంది. ఈ అగ్రిమెంట్‌తో పోలింగ్ వరకు ప్రచారం కొనసాగిద్దాం.. అంటూ చెబుతున్నారు.

- నెల్లూరు రూరల్



ఈ సంగతి తెలుసా..?

గోడలపై ప్రచారానికి యజమాని అనుమతి ఉండాల్సిందే!

ఎన్నికల ప్రచారంలో భాగంగా గోడలపై పోస్టర్లు, స్టిక్కర్లు, ఫ్లెక్సీలు అంటించాలంటే ఆ ఇంటి యజమాని అనుమతి తప్పనిసరిగా ఉండాలి. ఎన్నికల సమయంలో అభ్యర్థులు వారి అనుచరులు ప్రచారంలో భాగంగా పబ్లిక్, ప్రైవేటు భవనాలు, కట్టడాలు, స్థలాల్లో బ్యానర్లు, ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేసేటప్పుడు సంబంధిత యజమాని అనుమతి లేకుండా చేయకూడదు. పోస్టర్లు అంటించడం, గోడలపై రాతలు రాయడం, జెండాలు, స్టిక్కర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు వంటి చర్యల వలన ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల రూపు శాశ్వతంగా లేదా పాక్షికంగా మారే అవకాశం ఉంది. ఎన్నికలు అనంతరం వాటిని శుభ్రం చేయాలంటే ప్రభుత్వానికి, ఆయా స్థలాల యజమానులు ఖర్చు అవుతుంది. కావున నాయకులు ముందుగా అనుమతి తీసుకుని ప్రచారానికి వాటిని వాడుకోవచ్చు. అలా ప్రచారం చేయదల చుకున్న అభ్యర్థులు సదరు యజమాని, సంతకం లేదా వేలిముద్రలతో అనుమతి పొంది ఆ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. ఈ వ్యయాన్ని అభ్యర్థుల ఎన్నికల ఖర్చులో కలుపుతారు. ఈ నిబం. దనలు ఉల్లంఘించిన వారు భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 171హెచ్, ప్రజా ప్రాతినిధ్య సెక్షన్ 127వ, అడ్వటైజుమెంట్ యాక్ట్ 1997 లోని సెక్షన్ /4 ప్రకారం శిక్షార్హులవుతారు.

- నెల్లూరు (సాంస్కృతికం)

సెంటిమెంట్

నేతలకు కలిసొచ్చే వేణుగోపాల్‌నగర్

వ్యాపారాలు, గృహ నిర్మాణాలు ప్రారంభించాలంటే ముందుగా మంచి ముహూర్తం, ఆపై కొన్ని సెంటిమెంట్లను ప్రజలు పాటిస్తారు. అదే కోవలో రాజకీయ నేతలు కూడా సెంటిమెంట్లను నమ్ముతున్నారు. ఈ క్రమంలో నెల్లూరు నగర నియోజకవర్గానికి ఈశాన్యం వైపున ఉన్న వేణుగోపాల్‌నగర్ సెంటిమెంట్ ప్లేస్‌గా నిలిచింది. నగరంలోని 3వ డివిజన్‌లో ఈ ప్రాంతం కొంతకాలంగా అసెంబ్లీ ఎన్నికల్లో నేతల ప్రచారానికి సెంటిమెంట్‌గా మారింది. 1993లో



నెల్లూరు వేణుగోపాల్‌నగర్‌లోని ప్రధాన రహదారి

వేణుగోపాల్‌నగర్ ఏర్పాటు కాగా, తొలిసారిగా 1995లో మున్సిపల్ చైర్మన్‌గా కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఆనం వివేకానందరెడ్డి అక్కడున్న మాతమ్మగుడిలో పూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు. దీంతో ఆయన చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1999, 2004లోనూ నెల్లూరు సిటీ నుంచి పోటీ చేస్తూ ఇక్కడ నుంచే ఎన్నికల శంఖారావం పూరించారు. ఆ రెండుసార్లు కూడా ఆయన గెలుపొందారు. 2009లో నెల్లూరు రూరల్ నుంచి పోటీ చేసినా కూడా ప్రచారాన్ని మాత్రం వేణుగోపాల్‌నగర్‌లోనే నిర్వహించారు. అప్పట్లోనూ ఆయనే గెలుపొందారు. దీంతో ఆ ప్రాంతాన్ని ఎన్నికల్లో సెంటిమెంట్‌గా నేతలు భావిస్తూ వస్తున్నారు. 2009లో నగర ఎమ్మెల్యేగా పోటీ చేసిన ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి కూడా ఇక్కడి నుంచే ప్రచారం ప్రారంభించి గెలుపొందారు. అలాగే 2014, 2019 ఎన్నికల్లో అనిల్‌కుమార్ యాదవ్ కూడా అదే ఆనవాయితీని పాటించారు. రెండుసార్లూ అనిలే విజయం సాధించారు. ఈ సెంటిమెంట్‌ను పాటిస్తూ వైసీపీ అభ్యర్థి ఖలీల్ కూడా ఇక్కడ నుంచే ప్రచారానికి శ్రీకారం చుట్టారు. తాజా ఎన్నికల్లో ఆ సెంటిమెంట్ నిజమవుతుందో.. లేదో చూడాలి.

- నెల్లూరు (జడ్పీ)

ఏజెంట్లే కీలకం !



ఎన్నికలు జరిగే రోజున పోలింగ్ కేంద్రాల్లో అభ్యర్థుల తరపున కూర్చునే ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకం. ఓటర్లను ప్రసన్నం చేసుకు నేందుకు అభ్యర్థులు నెలల తరబడి నిర్వహించిన ప్రచారం ఓ ఎత్తైతే, పడిన కష్టానికి ఫలితం ఇచ్చేది పోలింగ్ కేంద్రమే. అలాంటి కేంద్రంలో పోలింగ్ సక్రమంగా జరుగుతుందా.. లేదా? అన్నది గమనించడం, బోగస్ ఓట్లు పడకుండా బూత్‌లోకి వచ్చినవారిని నిశితంగా పరిశీలించడం ఏజెంట్ల పని. గుర్తింపు పొందిన రిజిస్టర్ పార్టీలు స్వతంత్ర అభ్యర్థుల తరపున ప్రాధాన్యతా క్రమంలో ఏజెంట్లు పోలింగ్ బూత్‌లో కూర్చుంటారు. పోలింగ్ కేంద్రంలో జరిగే ప్రతి కదలికను ఏజెంట్ క్షుణ్ణంగా పరిశీలించాలి. ఏమాత్రం అను మానం వచ్చినా ఏజెంట్ తన అభ్యంతరాన్ని ప్రొసీడింగ్ అధికారికి తెలియజేయాలి. ఎంతో కీలకమైన ఈ ఏజెంట్‌ను అభ్యర్థులు తమకు నమ్మకమైన వారినే కూర్చోబెడతారు. ఏజెంట్ ఏ మాత్రం తప్పు చేసినా ఆ అభ్యర్థికే నష్టం కలుగుతుంది.

- వలేటివారిపాలెం

తస్మాత్ జాగ్రత్త

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే.. జైలు ఊచలు లెక్కించాల్సిందే !

కొంతమంది అభ్యర్థులు సెంటిమెంట్‌ను రెచ్చగొడితే ఓట్లు పడతాయని భావించి కులం,మతం, వర్గం, ప్రాంత భేదాలతో ఇష్టారాజ్యంగా మాట్లాడుతుంటారు. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు అరికట్టేందుకు ఎన్నికల సంఘం కఠిన నిబంధనలను రూపొందించింది. ఎన్నికల్లో ఎవరైనా జాతి, మతం, కులం, భాష, సమాజం పేరుతో రెచ్చగొడితే ఐపీఎస్ సెక్షన్ 158ఏ ప్రకారం మూడేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తారు. ఓటుకోసం మద్యం, డబ్బులు, ఇతర వస్తువులను తీసుకున్న వారిని కూడా నేరస్థులుగానే పరిగణిస్తారు. ఐపీ ఎస్ సెక్షన్ 171బీ, 171హెచ్ ప్రకారం లంచంగా పరిగణించి ఏడాది జైలుశిక్ష విధిస్తారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రవాహాలపై నిఘా పెంచారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసిన వారు కూడా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

- ఉదయగిరి

ముఖచిత్రం



అధికారం వైపే సర్వేపల్లి !

- విజ్ఞత ప్రదర్శిస్తున్న ఓటర్లు
- తాజాగా బరిలో హేమాహేమీలు
- ఒకరు మంత్రి కాగా, మరొకరు సీనియర్ నేత

ముత్తుకూరు, ఏప్రిల్ 26 : రాష్ట్రంలో ఏ పార్టీ అధికారం చేజిక్కించుకుంటుందో ఆ పార్టీ అభ్యర్థులకే పట్టంగట్టడం సర్వేపల్లి నియోజకవర్గ ప్రజల విజ్ఞత. ఈ ఆనవాయితీ గత కొంత కాలంగా సాగుతూ వస్తున్నది. 1955లో సర్వేపల్లి నియోజకవర్గం ఏర్పడింది. తొలుత ఈ సెగ్మెంట్‌లో ముత్తుకూరు, వెంకటాచలం, తోటపల్లిగూడూరు, ఇందుకూరుపేట మండలాలతోపాటు నెల్లూరు రూరల్ మండలం లోని కొన్ని గ్రామాలు ఉండేవి. 2009లో జరిగిన పునర్విభజనలో ముత్తుకూరు, వెంకటాచలం, తోటపల్లిగూడూరు, మనుబోలు, పొదలకూరు మండలాలను కలిపి సర్వేపల్లి నియోజకవర్గం ఏర్పాటు చేశారు. నైసర్గికంగా సర్వేపల్లి నెల్లూరు జిల్లాలో ఉన్నా, సార్వత్రిక ఎన్నికల్లో తిరుపతి పార్లమెంటరీ నియోజకవర్గంలో పరిధిలో ఉంది. తొలి ఎమ్మెల్యేగా కాంగ్రెస్‌కు చెందిన బెజవాడ గోపాల్‌రెడ్డి ఎన్నికయ్యారు. 1956 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా వంగల్లు కోదండ రామిరెడ్డి విజయం సాధించారు. 1962లో స్వతంత్ర అభ్యర్థిగా వేమారెడ్డి వెంకురెడ్డి గెలుపొందడం సంచలనంగా పేర్కొనేవారు. 1967లో సీపీఐ అభ్యర్థి స్వర్ణ వేమయ్య, 1972లో కాంగ్రెస్ అభ్యర్థిగా మంగళగిరి నానాదాస్‌లు ఎస్సీ కేటగిరిలో గెలుపొందారు. 1978 నుంచి ఈ నియోజకవర్గం జనరల్ అయింది. 1978, 1989లో కాంగ్రెస్ అభ్యర్థిగా సీవీ శేషారెడ్డి గెలుపొందగా, ఎన్టీఆర్ ప్రభంజనంతో 1983లో టీడీపీ అభ్యర్థి చెన్నారెడ్డి పెంచలరెడ్డి, 1985లో ఈదూరు రామకృష్ణారెడ్డి, విజయం సాధించా రు. 1994, 1999లో టీడీపీ అభ్యర్థిగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గెలిచారు. 2004, 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి విజయం సాధించారు. 2014, 2019లో వైసీపీ అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గెలుపొందారు.



మంత్రులుగా ఇద్దరు..

సర్వేపల్లి నియోజకవర్గం నుంచి 1996లో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తొలిసారి మంత్రి పదవి దక్కించుకున్నారు. 1996 నుంచి 99 వరకు క్రీడా శాఖా మంత్రిగా పనిచేశారు. అనంతరం 2001 నుంచి 2004 వరకు సమాచారశాఖ మంత్రిగా రెండోసారి ఎన్నికయ్యారు. 2017 నుంచి 2019 వరకు మూడోసారి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేశారు. వైసీపీ ప్రభుత్వంలో 2022 నుంచి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి పనిచేస్తున్నారు. కాగా ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు జరగ్గా కాంగ్రెస్ ఏడు సార్లు, తెలుగుదేశం 4సార్లు, వైసీపీ 2 దఫాలు, సీపీఐ, ఇండిపెండెంట్ చెరోసారి విజయం సాధించారు.

సంవత్సరం	అభ్యర్థి	పార్టీ
2019	కాకాణి గోవర్ధన్‌రెడి	వైసీపీ
2014	కాకాణి గోవర్ధన్‌రెడ్డి	వైసీపీ
2009	ఆదాల ప్రభాకర్‌రెడి	కాంగ్రెస్
2004	ఆదాల ప్రభాకర్‌రెడి	కాంగ్రెస్
1999	సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి	టీడీపీ
1994	సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి	టీడీపీ
1989	చిత్తూరు వెంకటశేషారెడ్డి	కాంగ్రెస్
1985	ఈదూరు రామకృష్ణారెడ్డి	టీడీపీ
1983	చెన్నారెడ్డి పెంచలరెడి	టీడీపీ
1978	చిత్తూరు వెంకటశేషారెడ్డి	కాంగ్రెస్
1972	మంగళగిరి నానాదాస్	కాంగ్రెస్
1967	స్వర్ణ వేమయ్య	సీపీఐ
1962	వేమారెడ్డి వెంకురెడి	ఇండిపెండెంట్
1956	వంగల్లు కోదండరామిరెడ్డి	కాంగ్రెస్
1955	బెజవాడ గోపాలరెడ్డి	కాంగ్రెస్